www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 15-9-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 169 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 6.12 తదుపరి త్రయోదశి; నక్షత్రం: శ్రవణం రా. 6.49 తదుపరి ధనిష్ఠ
వర్జ్యం: రా.10.26-11.53; దుర్ముహూర్తం: సా.4.36-5.25; అమృతఘడియలు: ఉ.9.09-10.38; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.13

బిజినెస్

కార్లపై భారీ డిస్కౌంట్లు

పండగ సీజన్‌లో రాయితీలు, ప్రోత్సాహకాలతో కస్టమర్లకు గాలం.. విక్రయాలు తగ్గడమే కారణం



న్యూఢిల్లీ: కార్ల కంపెనీలు కస్టమర్లకు భారీగా డిస్కౌంట్లు ఆఫర్ చేస్తున్నాయి. గడిచిన కొద్ది నెలలుగా మార్కెట్లో కార్ల విక్రయాలు మందగించడంతో పాటు డీలర్ల వద్ద వాహన నిల్వలు ఆందోళనకర స్థాయికి పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. దాంతో కంపెనీలు భారీగా రాయితీలు, ప్రోత్సాహకాలతో కస్టమర్లను ఆకర్షించే ప్రయత్నాల్లో ఉన్నాయి. మారుతి సుజుకీ, టాటా మోటార్స్, హ్యుండయ్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హోండా కార్స్ ఈ విషయంలో మిగతా కంపెనీల కంటే ముందున్నాయి. గత నెలలో వాహన సగటు విక్రయ ధరపై 10-12 శాతం వరకు రాయితీ కల్పించిన కంపెనీలు.. ఈ నెలతో పండగ సీజన్ కూడా ప్రారంభం కావడంతో డిస్కౌంట్ స్థాయిని 12-14 శాతం వరకు పెంచాయి. కొన్ని మోడళ్లపై క్యాష్ డిస్కౌంట్, కార్పొరేట్ ప్రయోజనాలు కలిపి రూ.3 లక్షలకు పైగా లబ్ధి కల్పిస్తున్నాయి. ఉదాహరణకు, గత నెలలో స్కార్పియో క్లాసిక్ ఎస్‌యూవీపై రూ.20,000కు పైగా రాయితీ కల్పించిన మహీంద్రా ఈ నెలలో డిస్కౌంట్‌ను ఏకంగా రూ.లక్ష వరకు పెంచింది.

రూ.3 లక్షల వరకు ప్రయోజనాలు: గత ఏడాది పండగ సీజన్‌లో రూ.25,000 నుంచి రూ.లక్ష వరకు రాయితీలు అందించిన కార్ల కంపెనీలు.. ఈసారి రూ.20,000 నుంచి రూ.3.15 లక్షల స్థాయిలో డిస్కౌంట్లు, ఇతర ప్రయోజనాలను ఆఫర్ చేస్తున్నాయి. టాటా మోటార్స్ తన హైయెస్ట్ సెల్లింగ్ ఎలక్ట్రిక్ మోడల్ నెక్సాన్ ఈవీపై రూ.3 లక్షల వరకు డిస్కౌంట్ ప్రకటించింది. పంచ్ ఈవీపై రూ.1.20 లక్షలు, టియాగో ఈవీపై రూ.40,000 రాయితీ కల్పిస్తోంది. అక్టోబరు 31 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. అంతేకాదు, టాటా మోటార్స్ తన అన్ని మోడళ్ల పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ వెర్షన్లకూ భారీగానే ప్రోత్సాహకాలను అందిస్తోంది. టియాగోకు రూ.65,000 స్థాయి డిస్కౌంట్‌తో మొదలుకొని సఫారీపై రూ.1.80 లక్షల వరకు రాయితీ కల్పిస్తోంది. హోండా కార్స్ కూడా తన మోడళ్లపై రూ.1.15 లక్షల వరకు ప్రయోజనాలందిస్తోంది.

మోడల్	ప్రయోజనాలు (రూపాయల్లో)
మారుతి సుజుకీ	
ఆల్టో కే 10	61,000
వ్యాగన్ ఆర్	63,000
స్విఫ్ట్	57,000
బ్రెజ్జా	42,000
బాలెనో	57,000
ఫ్రాంక్స్	40,000
గ్రాండ్ విటారా	1.23 లక్షలు
హ్యుండయ్	
ఐ10 నియోస్	48,000
ఆరా	43,000
ఐ20	45,000
ఎక్స్‌టర్	33,000
వెన్యూ	70,000
టాటా మోటార్స్	
నెక్సాన్	80,000
నెక్సాన్ ఈవీ	3 లక్షలు
హారియర్	1.60 లక్షలు
సఫారీ	1.80 లక్షలు
మహీంద్రా	
బొలెరో	86,500
బొలెరో నియో	1.34 లక్షలు
థార్	1.55 లక్షలు
స్కార్పియో క్లాసిక్	1.15 లక్షలు
స్కార్పియో ఎన్	50,000
హోండా	
ఎలివేట్	75,000
సిటీ	1.14 లక్షలు
ఫోక్స్‌వేగన్	
టైగున్	1.20 లక్షలు
వర్టిస్	లక్ష
రెనో	
ట్రైబర్	50,000
క్విడ్	40,000

గమనిక: కార్ల కంపెనీలు అందించే రాయితీలు, ప్రోత్సాహకాలు రాష్ట్రం, నగరాన్ని బట్టి మారుతుంటాయి. పైన పేర్కొన్నవి సగటు ప్రయోజనాలు.

డీలర్ల వద్ద భారీగా నిల్వలు

ఆటోమొబైల్ డీలర్ల వద్ద కార్ల నిల్వలు భారీగా పేరుకుపోయాయి. గత నెల చివరి నాటికి డీలర్ల వద్ద నిల్వలు 7.80 లక్షల యూనిట్లకు చేరుకున్నాయని, వాటి విలువ రూ.77,800 కోట్ల స్థాయిలో ఉంటుందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) ఈ మధ్యనే వెల్లడించింది. ఈ నిల్వలు 70 రోజులకు సరిపోతాయి. ఒకవైపు విక్రయాలు మందగించడం.. మరోవైపు నెలనెలా వాహన నిల్వలు పెరుగుతూ పోతుండటంతో డీలర్ల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఫాడా పేర్కొంది. పండగ సీజన్ ప్రోత్సాహకాలతోనైనా ఈ సమస్యకు కొంత ఉపశమనం లభిస్తుందని డీలర్లు ఆశావహంగా ఉన్నారు.

ఐపీఓకు ఎల్‌జీ ఇండియా!

రూ.12,500 కోట్లు సమీకరించే ఆలోచన

ముంబై: దక్షిణ కొరియా దిగ్గజం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ భారత అనుబంధ విభాగమైన ఎల్‌జీ ఇండియా వచ్చే ఏడాదిలో పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చేందుకు సిద్ధమవుతోంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ 150 కోట్ల డాలర్ల (రూ.12,500 కోట్లు) వరకు సమీకరించాలని భావిస్తున్నట్లు సమాచారం. తద్వారా కంపెనీ 1,300 కోట్ల డాలర్ల స్థాయి మార్కెట్ విలువ దక్కే అవకాశం ఉంది. ఐపీఓ నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిటీ గ్రూప్, మోర్గాన్ స్టాన్లీ, జేపీ మోర్గాన్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది.

బంధన్ బిజినెస్ సైకిల్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. బిజినెస్ సైకిల్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. మార్కెట్ పరిస్థితులు, రిస్క్‌లకు అనుగుణంగా ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దింది. ఈ ఫండ్ ముగింపు తేదీ సెప్టెంబరు 24. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000.

ఇన్వెస్కో ఇండియా టెక్నాలజీ ఫండ్

ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్.. ఇండియా టెక్నాలజీ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది పూర్తిగా టెక్నాలజీ, టెక్నాలజీ ఆధారిత రంగాల్లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఐటీ టీఆర్‌ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. క్రమానుగత పెట్టుబడుల (సిప్) రూపంలో కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 17.

1,500 ఎకరాల్లో ఏరోసిటీ ప్రాజెక్టులు

ఢిల్లీ, హైదరాబాద్, గోవా విమానాశ్రయాల్లో అభివృద్ధి

జీఎంఆర్ గ్రూప్ సన్నాహాలు

ఢిల్లీ, హైదరాబాద్, గోవా విమానాశ్రయాలను నిర్వహిస్తున్న జీఎంఆర్ గ్రూప్.. పెద్దఎత్తున రియల్టీ ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ మూడు విమానాశ్రయాల్లో దాదాపు 1,500 ఎకరాల్లో ఏరోసిటీ ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని భావిస్తోంది. ఈ ఏరోసిటీ ప్రాజెక్టుల్లో ఇండస్ట్రియల్, కమర్షియల్, హాస్పిటాలిటీ సదుపాయాలను ఏర్పాటు చేయనుంది. ఢిల్లీ విమానాశ్రయంలో హోటల్స్, హాస్పిటల్స్, ఆఫీస్ స్పేస్‌తో పాటు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో సీనియర్ లివింగ్, కో-లివింగ్ సదుపాయాలు సహా కార్యాలయ స్థలాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. మరోవైపు గోవా విమానాశ్రయంలో రిటైల్ డిస్ట్రిక్ట్, హోటల్స్, గోల్ఫ్ కోర్స్‌తో పాటు విల్లాలను నిర్మించాలని చూస్తోంది. అయితే హైదరాబాద్ విమానాశ్రయంలో తొలుత పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి సారించాలని జీఎంఆర్ గ్రూప్ భావిస్తోంది. కాగా విమానాశ్రయాల్లో సమీకృత కమర్షియల్ ప్రాజెక్టులను ఏరోసిటీ బ్రాండ్ కింద జీఎంఆర్ గ్రూప్ అభివృద్ధి చేస్తోంది. ఢిల్లీ ఏరోసిటీ.. గ్రూప్ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌గా ఉంది. ఢిల్లీ ఏరోసిటీని అంతర్జాతీయ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో జీఎంఆర్ గ్రూప్ పలు ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. జీఎంఆర్‌తో పాటు భారతి రియల్టీ, ప్రెస్టీజ్ గ్రూప్ కూడా విమానాశ్రయాల్లో కమర్షియల్ ఆఫీస్ స్పేస్, రిటైల్, హోటల్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నాయి.

హైదరాబాద్‌కు ఆర్థిక చోదకశక్తిగా..

కాగా హైదరాబాద్ విమానాశ్రయంలో తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ఏరోసిటీ ప్రాజెక్ట్.. ఉద్యోగాల కల్పన, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై దృష్టి సారించింది. ఇప్పటికే ఈ ఏరోసిటీలో ఏవియేషన్, ఇండస్ట్రియల్ సెజ్‌లను అభివృద్ధి చేసింది. ఈ ప్రాజెక్టుల ద్వారా దాదాపు 50,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభించటమే కాకుండా హైదరాబాద్ ఆర్థికాభివృద్ధికి కీలకంగా ఉంటుందని జీఎంఆర్ గ్రూప్ అంచనాగా ఉంది. మరోవైపు ఈ విమానాశ్రయంలో స్కూల్స్, యూనివర్సిటీ క్యాంపస్‌లు, హోటల్స్‌ను మరింతగా విస్తరించాలని భావిస్తోంది. ఇదే సమయంలో వాణిజ్య, ఐటీ పార్కులు, హెల్త్‌కేర్ ప్రాజెక్ట్‌ను కూడా డెవలప్ చేయాలని చూస్తోంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,890 ▲	68,650 ▲	97,000 ▲
ముంబై	73,044 ▲	66,908 ▲	86,100 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	525
చిత్తూరు	553	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	123
వరంగల్	115	గుంటూరు	125
కరీంనగర్	115	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	122
కర్నూలు	115	నెల్లూరు	122
విశాఖపట్నం	106	అనంతపురం	122
గోదావరి	123		

జీఎస్‌టీలో కొత్తగా వచ్చిన మార్పులేమిటంటే?

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీ చట్టంలో ఇటీవల కొన్ని ముఖ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ వివరాలేమిటంటే..

మొదటిది జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ తీసుకున్న ప్రతి ఒక్కరూ తమ బ్యాంక్ ఖాతా వివరాలు కచ్చితంగా తెలపాలి. ఈ నిబంధన సెప్టెంబరు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం, ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు కామన్ పోర్టల్ ద్వారా బ్యాంక్ వివరాలు నమోదు చేయాలి. ఒకవేళ ఈ వివరాలు ఇవ్వకుంటే ఆగస్టు నెలకు సంబంధించిన జీఎస్‌టీఆర్-1 లేదా ఐఎఫ్‌ఎఫ్ గానీ దాఖలు చేయలేరు. కాబట్టి జీఎస్‌టీలో నమోదైన అందరూ ఈ విషయాన్ని గమనించాలి.

ఇక రెండోది, రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద పన్ను చెల్లిస్తూ.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకునే వారి సౌలభ్యం కోసం ఒక కొత్త స్టేట్‌మెంట్‌ను ప్రవేశపెట్టారు. కొన్ని రకాల సర్వీస్‌లు లేదా గూడ్స్ కొనుగోలు చేసినప్పుడు అమ్మకందారుడు కాకుండా కొనుగోలుదారుడే ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. దీనినే ఆర్‌సీఎంగా వ్యవహరిస్తారు. ఆర్‌సీఎం కింద చెల్లించే పన్ను మొత్తాన్ని క్రెడిట్ ద్వారా కాకుండా క్యాష్ ద్వారా చెల్లించాలి. ఈ విధంగా ఆర్‌సీఎం కింద చెల్లించిన పన్నును.. అర్హతను బట్టి తిరిగి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద తీసుకోవచ్చు. అయితే, ఇందులో ఒక్కోసారి కొంత గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. ఆర్‌సీఎం కింద చెల్లించిన పన్నులకు, తీసుకున్న క్రెడిట్‌కు కొన్ని సందర్భాల్లో వ్యత్యాసం ఉండవచ్చు. దీనికి కారణాలు అనేకం. ఒక నెలలో పన్ను చెల్లించి, మరొక నెలలో క్రెడిట్ తీసుకోవచ్చు లేదా ఇతర కారణాలు కావచ్చు. ఈ గందరగోళాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్తగా ఆర్‌సీఎం లయబిలిటీ/ఐటీసీ స్టేట్‌మెంట్ అనే స్టేట్‌మెంట్‌ను ప్రవేశపెట్టటం జరిగింది. తద్వారా పన్ను చెల్లింపుదారులు ఈ స్టేట్‌మెంట్‌లోని ఓపెనింగ్ బ్యాలెన్స్‌లో తగు వివరాలు నింపవచ్చు. అంటే ఆర్‌సీఎంకి సంబంధించి ఇప్పటి వరకు తాము చెల్లించిన పన్ను కంటే తక్కువ క్రెడిట్ తీసుకుంటే ఓపెనింగ్ బ్యాలెన్స్‌లో ఆ మొత్తాన్ని పాజిటివ్ విలువ కింద చూపాలి. ఒకవేళ చెల్లించిన మొత్తం కంటే తీసుకున్న క్రెడిట్ ఎక్కువగా ఉంటే ఆ మొత్తాన్ని నెగటివ్ విలువ కింద చూపాలి. నెలవారీ రిటర్నులు దాఖలు చేసే వారు 2024 జూలై వరకు, త్రైమాసిక రిటర్నులు దాఖలు చేసే వారు 2024 జూన్ వరకు చెల్లించిన పన్ను, తీసుకున్న క్రెడిట్‌ను లెక్కించి పైన చెప్పిన విధంగా ఓపెనింగ్ బ్యాలెన్స్‌లో చూపించాలి. క్రెడిట్‌ను లెక్కించటానికి తమకు అర్హత ఉన్న క్రెడిట్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. అలాగే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకోవటానికి సరఫరాదారుడు తగు ఇన్వాయిస్ వివరాలతో జీఎస్‌టీఆర్-1 రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుందన్న విషయం తెలిసిందే. ఇలా నమోదు చేసిన వివరాలలో ఏవేనీ తేడాలు ఉంటే వాటిని ముందుగానే తెలుసుకోవటానికి ఇన్వాయిస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐఎంఎస్) అనే కొత్త డాష్‌బోర్డ్‌ను కూడా ప్రవేశపెట్టింది. ఇది కొనుగోలుదారులకు చాలా సౌలభ్యం. ఈ కొత్త మార్పుల గురించి జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ తీసుకున్న వ్యక్తులు అవగాహన కలిగి ఉండటం మంచిది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్




కార్తీక్ జోడీకి ఐటీఎఫ్ టైటిల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ టూర్ ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పురుషుల డబుల్స్ టైటిల్‌ను హైదరాబాద్ యువ ప్లేయర్ గంటా సాయికార్తీక్ రెడ్డి కైవసం చేసుకున్నాడు. ఇండోనేసియాలోని బాలిలో జరిగిన ఫైనల్లో కార్తీక్-బాబ్రోవ్ బోగ్డాన్ (రష్యా) జోడీ 6-2, 6-4తో స్కాలియా మాథ్యూ (ఫ్రాన్స్)-ఓజిక్ జాకుబ్ (అమెరికా) జంటపై నెగ్గి టైటిల్ విజేతగా నిలిచింది.

హర్మన్ డబుల్.. పాక్ ధమాల్

చాంపియన్స్ ట్రోఫీలో భారత్ మరో గెలుపు



హులున్‌బుయిర్ (చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీలో భారత జట్టు అప్రతిహత విజయాలతో దూసుకుపోతోంది. ఇప్పటికే సెమీఫైనల్ స్థానం ఖాయం చేసుకున్న మనోళ్లు..చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పైనా అదే జోరు కొనసాగించారు. శనివారం జరిగిన ఆఖరి లీగ్ పోరులో భారత్ 2-1తో పాకిస్థాన్‌ను ఓడించింది. అద్భుత ఫామ్‌లో ఉన్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ (13, 19ని)తో దుమ్ము రేపాడు. అహ్మద్ నదీమ్ (8వ) పాకిస్థాన్ తరఫున గోల్ సాధించాడు. రౌండ్ రాబిన్ లీగ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్‌కు ఇది వరుసగా ఐదో విజయం. మరోవైపు పాకిస్థాన్‌పై 2016 నుంచి చెలాయిస్తున్న ఆధిపత్యాన్ని మనోళ్లు కొనసాగించారు. చివరిసారి ఆసియా క్రీడల్లో తలపడినప్పుడు 10-2తో పాకిస్థాన్‌ను భారత్ చిత్తు చేసింది. ఆసియాడ్‌కు ముందు చెన్నైలో జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీలోనూ మనోళ్లు 4-0తో గెలుపొందారు. కాగా, సోమవారం జరిగే సెమీఫైనల్స్‌లో చైనాతో పాక్, కొరియాతో భారత్ తలపడనున్నాయి.

నాలుగో విజయం

చెస్‌లో భారత జట్ల జోరు

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్లు జోరు కొనసాగిస్తున్నాయి. శనివారం జరిగిన నాలుగో రౌండ్‌లోనూ పురుషులు, మహిళల జట్లు విజయాలు నమోదు చేశాయి. పురుషుల జట్టు 3.5-0.5తో సెర్బియాను ఓడించగా, మహిళల జట్టు 3.5-0.5తో ఫ్రాన్స్‌ను చిత్తు చేసింది. హారిక-కార్నెటీపై, దివ్య-హెజాజిపోర్‌పై, తానియా-నటాషాపై గెలిచారు. వైశాలీ-సోఫీతో పాయింట్ పంచుకుంది. పురుషుల పోరులో అర్జున్ ఇరిగేసి-ఇండిక్‌ని చిత్తు చేశాడు. ఈ విజయంతో అర్జున్ 2800 ఎలో రేటింగ్‌కు మరింత చేరువయ్యాడు. ఐవిక్‌పై విదిత్, ప్రెడ్కేపై గుకేష్ నెగ్గారు. అలెక్సీతో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. నాలుగు రౌండ్ల అనంతరం భారత జట్లు ఎనిమిదేసి పాయింట్లతో కొనసాగుతున్నాయి.

జులియన్‌దే 100

ఒలింపిక్ చాంపియన్‌కే డైమండ్ లీగ్ టైటిల్

షకారి రిచర్డ్‌సన్‌కు 8వ స్థానం



జులియన్ ఆల్ఫ్రెడ్

బ్రసెల్స్: స్ప్రింట్ క్వీన్ జులియన్ ఆల్ఫ్రెడ్ మరోసారి తన సత్తా చాటింది. పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 100 మీటర్లలో చాంపియన్‌గా నిలిచిన ఈ సెయింట్ లూసియా స్టార్.. ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ ఫైనల్స్‌లోనూ అంతే దూకుడుగా పరిగెత్తింది. డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో వంద మీటర్ల టైటిల్ నెగ్గి ఈ సీజన్‌ను ఘనంగా ముగించింది. ఇక్కడ జరిగిన ఫైనల్ రేసులో జులియన్ 10.88 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని స్ప్రింట్‌లో తనకు తిరుగులేదని నిరూపించుకుంది. ఇక, జులియన్‌కు పోటీ ఇస్తుందనుకున్న వరల్డ్ చాంపియన్, అమెరికన్ సంచలనం షకారి రిచర్డ్‌సన్ ఇక్కడ తేలిపోయింది. పోడియం ఫినిష్ కూడా చేయలేక 11.23 సెకన్ల టైమింగ్‌తో ఏకంగా ఎనిమిదో స్థానంలో నిలిచింది. బ్రిటన్ రేసర్ దినా అషర్ స్మిత్ (10.92 సె) రెండోస్థానంతో రన్నరప్‌గా నిలిచింది. ఐవరీ కోస్ట్‌కు చెందిన మేరీ జోసీ (11.05 సె)కి మూడోస్థానం దక్కింది. పురుషుల 100 మీటర్లలో జమైకా అథ్లెట్ అకీమ్ బ్లేక్ 9.93 సెకన్లతో విజేతగా నిలిచాడు. అమెరికా అథ్లెట్లు క్రిస్టియన్ కోల్‌మన్ (10.00 సె), ఫ్రెడ్ కెర్లీ (10.01 సె) 2, 3 స్థానాలతో సరిపెట్టుకున్నారు. పురుషుల పోల్‌వాల్ట్‌లో స్వీడన్ స్టార్ అర్మాండ్ డుప్లాంటిస్ అదరగొట్టాడు. 6.11 మీటర్ల ప్రదర్శనతో అతను ప్రపంచ రికార్డు నెలకొల్పి విజేతగా నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్ విజేత కూడా అయిన డుప్లాంటిస్.. ఈ ఏడాది వరల్డ్ రికార్డును బ్రేక్ చేయడం ఇది మూడోసారి కావడం విశేషం.

సబ్లేకు తొమ్మిదో స్థానం



భారత అథ్లెట్ అవినాశ్ సబ్లే డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నిరాశపరిచాడు. 3వేల మీటర్ల స్టీపుల్‌చేజ్ ఈవెంట్‌లో పోడియం ఫినిష్ చేయడంలో విఫలమయ్యాడు. శుక్రవారం 30వ బర్త్‌డే సెలెబ్రేట్ చేసుకున్న అవినాశ్.. ఫైనల్స్‌లో 8 నిమిషాల 17.09 సెకన్ల టైమింగ్‌తో 9వ స్థానంలో నిలిచాడు. మొత్తం పది మంది పోటీపడ్డ ఫైనల్స్‌లో చివరి నుంచి రెండోస్థానం దక్కించుకోవడం గమనార్హం. కెన్యా స్టార్ అమోజ్ సెరెమ్ (8 నిమిషాల 6.90 సెకన్లు) టైటిల్ దక్కించుకోగా, మొరాకోకు చెందిన ఒలింపిక్, వరల్డ్ చాంప్ సోఫినె (8 నిమిషాల 8.60 సె) రెండు, ట్యూనీషియా అథ్లెట్ మహ్మద్ అమిన్ (8 నిమిషాల 9.68 సె) మూడు స్థానాల్లో నిలిచారు.

'ఎర్రమట్టి'తో చెక్ పెట్టాలని!

పేస్ పిచ్ సిద్ధం

జోరుగా భారత బౌలర్ల ప్రాక్టీస్

19 నుంచి బంగ్లాతో తొలి టెస్టు



చెన్నై: ఆరు నెలల తర్వాత టీమిండియా టెస్టు ఫార్మాట్ బరిలోకి దిగబోతోంది. దీంట్లో భాగంగా ఈనెల 19 నుంచి బంగ్లాదేశ్‌తో జరుగబోయే తొలి టెస్టు కోసం పకడ్బందీగా వ్యూహాలు రచిస్తోంది. ఎందుకంటే పాకిస్థాన్‌తో ఇటీవలే ముగిసిన రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లా క్లీన్‌స్వీప్ చేసింది. అదే ఊపులో పటిష్ఠ టీమిండియాకు కూడా షాక్ ఇవ్వాలనే ఆలోచనలో ఉంది. అయితే తమకన్నా బలహీన జట్టయినా బంగ్లాను రోహిత్‌సేన తక్కువగా చూడడం లేదు. అందుకే అద్భుతంగా రాణిస్తున్న వారి బౌలర్లకు ముకుతాడు వేసేందుకు చెపాక్‌లో ఎర్రమట్టితో కూడిన పిచ్‌ను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి చెన్నై పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. అటు బంగ్లాలో కూడా బంక మట్టి ఎక్కువగా ఉండే నల్లమట్టి పిచ్‌లపైనే ఆడతారు. ఆరంభం నుంచే ఇవి స్పిన్నర్లకు అనుకూలిస్తుంటాయి. అందుకే బంగ్లా బౌలర్లకు అవకాశం ఇవ్వకూడదనే ఆలోచనతో ఎర్రమట్టి పిచ్‌లను సిద్ధం చేస్తున్నారు. ఇందులో క్లే తక్కువగా ఉంటుంది కాబట్టి ఆరంభంలో బౌన్స్ రాబడుతూ పేసర్లు చెలరేగుతారు. అంతేకాకుండా ఈ ఏడాది చివర్లో భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించాల్సి ఉంది. అక్కడి పిచ్‌ల దృష్ట్యా కూడా ఈ మార్పులు చేసినట్టు సమాచారం. అయితే నెట్స్‌లో గంభీర్, మోర్కెల్ ఆధ్వర్యంలో భారత స్పిన్నర్లు నల్లమట్టి.. పేసర్లు ఎర్రమట్టి పిచ్‌లపై సాధన చేస్తున్నారు.

పేసర్ గుర్నూర్ బ్రార్‌తో.. నెట్స్‌లో భారత బ్యాటర్లకు బంతులు వేసేందుకు ఆరున్నర అడుగుల పంజాబీ పేసర్ గుర్నూర్ బ్రార్‌ను ప్రత్యేకంగా రప్పించారు. బంగ్లా జట్టులో కూడా ఇదే ఎత్తుతో పేసర్ నహీద్ రాణా ఉన్నాడు. పాక్‌తో జరిగిన రెండో టెస్టులో నహీద్ 5 వికెట్లతో చెలరేగాడు. అతడి బౌన్స్‌ను భారత్ దీటుగా ఎదుర్కొనేందుకే బ్రార్‌ను ఎంపిక చేశారు. తొలి టెస్టు మొదలయ్యేదాకా అతడు జట్టుతో పాటు ఉంటాడు.

నాది చిన్న పాత్రే: మోర్కెల్



మోర్కెల్ సిరాజ్

భారత క్రికెట్ అభివృద్ధి కోసం కొత్తగా ఎవరూ ఏమీ చేయాల్సిన అవసరం లేదని, తనంతట తానుగా ముందుకు వెళ్లే వ్యవస్థ ఏర్పాటైందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్కెల్ అభిప్రాయపడ్డాడు. ఈక్రమంలో జట్టు మరింత పటిష్ఠంగా తయారయ్యేందుకు ఏం చేయగలనో అదే చేస్తానని చెప్పాడు. ఏరకంగా చూసినా ఇందులో నాది చిన్నపాత్రేనని తెలిపాడు. రోహిత్, విరాట్, జడేజా, అశ్విన్, బుమ్రాలాంటి సూపర్ సీనియర్లు జట్టును ముందుండి నడిపిస్తారని, సహాయక సిబ్బందిగా వారికి అవసరమైన సలహాలు ఇవ్వడం కోచ్‌లుగా తమ బాధ్యతని స్పష్టం చేశాడు.

తిలక్ సెంచరీ

పట్టుబిగించిన ఇండియా 'ఎ'

దులీప్ ట్రోఫీ



తిలక్ వర్మ (111 నాటౌట్)

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): యువ బ్యాటర్ తిలక్ వర్మ (111 నాటౌట్) అజేయ శతకంతో కదం తొక్కగా..ఓపెనర్ ప్రథమ్ సింగ్ (122) కూడా సెంచరీతో చెలరేగడంతో ఇండియా 'డి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా 'ఎ' పట్టుబిగించింది. ఓవర్‌నైట్ 115/1తో శనివారం, రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'ఎ' 380/3తో డిక్లేర్ చేసింది. దాంతో ఆ జట్టుకు ఓవరాల్‌గా 487 పరుగుల ఆధిక్యం లభించింది. ప్రథమ్, తిలక్ రెండో వికెట్‌కు 104 రన్స్ జోడించారు. అనంతరం రావత్ (64 నాటౌట్) జతగా తిలక్ నాలుగో వికెట్‌కు అభేద్యంగా 116 రన్స్ జత చేశాడు. ఆపై 488 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా 'డి' మూడోరోజు ఆఖరికి 62/1 స్కోరుతో నిలిచింది. రికీ భుయ్ (44), యశ్ దుబే (15) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా 'ఎ' 290, ఇండియా 'డి' 183 పరుగులు చేశాయి.

ఫాలోఆన్ ప్రమాదంలో ఇండియా 'బి'

కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (143 బ్యాటింగ్) సెంచరీతో నిలిచినా..యువ పేసర్ అన్షుల్ కాంబోజ్ (5/66) ఐదు వికెట్లతో వెన్ను విరవడంతో ఇండియా 'సి'తో మ్యాచ్‌లో ఇండియా 'బి' ఫాలోఆన్ ప్రమాదంలో పడింది. ఓవర్‌నైట్ స్కోరు 124/0తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'బి' కాంబోజ్ ధాటికి ఆట ముగిసేసరికి 309/7 స్కోరుతో నిలిచింది. మరో ఓపెనర్ జగదీశన్ (70) మినహా ఇతర బ్యాటర్ల నుంచి ఈశ్వరన్‌కు సహకారం అందలేదు. ప్రత్యర్థి మొదటి ఇన్నింగ్స్ స్కోరుకు 216 రన్స్ వెనుకంజలో నిలిచిన ఇండియా 'బి' ఫాల్ ఆన్ తప్పించుకోవాలంటే ఇంకో 66 రన్స్ చేయాలి. చేతిలో 3 వికెట్లే ఉన్నాయి. ఈశ్వరన్‌కు తోడుగా రాహుల్ చాహర్ (18) క్రీజులో ఉన్నాడు. ఇండియా 'సి' తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగుల భారీ స్కోరు సాధించింది.

రెండో టీ20లో ఇంగ్లండ్ విజయం

కార్డిఫ్: ఆస్ట్రేలియాతో రెండో టీ20లో ఆతిథ్య ఇంగ్లండ్ 3 వికెట్లతో గెలిచింది. లివింగ్‌స్టోన్ (47 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 87; 2/16) అటు బంతితో.. ఇటు బ్యాట్‌తోనూ అదరగొట్టాడు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 1-1తో పోటీలోకి వచ్చింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆసీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 193 పరుగులు చేసింది. మెక్‌గర్క్ (50), ఇన్‌గ్లిస్ (42), హెడ్ (31) రాణించారు. కార్స్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ఇంగ్లండ్ 19 ఓవర్లలో 194/7 స్కోరు చేసి గెలిచింది. బెథెల్ (44), సాల్ట్ (33) ఆకట్టుకున్నారు. మాథ్యూ షార్ట్ ఐదు వికెట్లు తీసినా ఫలితం లేకపోయింది. నిర్ణాయక ఆఖరి టీ20 ఆదివారం జరుగుతుంది.

తొలిరోజు నిరాశ

సింగిల్స్‌లో బాలాజీ, రామ్‌కుమార్ ఓటమి

స్వీడన్‌తో భారత్ డేవిస్‌కప్ పోరు

స్టాక్‌హోమ్: స్వీడన్‌తో డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్1ను భారత టెన్నిస్ జట్టు ఓటములతో ఆరంభించింది. శనివారం జరిగిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ ఓడడంతో స్వీడన్‌కు 2-0 ఆధిక్యం దక్కింది. ముందుగా శ్రీరామ్ బాలాజీ 4-6, 2-6తో ఎలియాస్ ఎమర్ చేతిలో ఓడాడు. అయితే రెండో సింగిల్స్‌లో రామ్‌నాథన్ రామ్‌కుమార్ జట్టును పోటీలో నిలుపుతాడని ఆశించినా.. 603వ ర్యాంకర్ లియో బోర్గ్ చేతిలో 3-6, 3-6తో ఓటమిపాలయ్యాడు. ఇక ఆదివారం జరిగే డబుల్స్, రివర్స్ సింగిల్స్‌లోనూ నెగ్గితేనే భారత్ వచ్చే ఏడాది క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తుంది. డేవిస్ కప్ చరిత్రలో రెండుసార్లు మాత్రమే భారత్ 0-2తో వెనుకంజలో నిలిచి పుంజుకుంది.



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 15-9-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 169 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

రష్యాలో నిత్యం నరకమే

ఎటు నుంచి బాంబులు పడతాయో తెలియదు.. అడవిలో స్లీపింగ్ బ్యాగ్‌లో పడుకునే వాళ్లం


రష్యా-ఉక్రెయిన్ సరిహద్దులో సూఫియాన్ (కుడి నుంచి రెండో వ్యక్తి)

- తుపాకుల్లో బుల్లెట్లు నింపడం.. సొరంగాలు తవ్వడం.. మృతి చెందిన సైనికుల్ని మోసుకెళ్లడం..
- ఇదే మా పని.. ఒక్క పూట భోజనం.. ప్రతి రోజూ 15 గంటల డ్యూటీ
- రష్యా- ఉక్రెయిన్ సరిహద్దులో 8 నెలలు ఉన్నాం.. 60 మంది భారతీయులు చిక్కుకున్నారు
- తిరిగొస్తామని ఊహించలేదు.. ఓ వీడియో చూసి ఎక్కువ జీతానికి ఆశపడ్డాం
- మోసగించే ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి.. 'ఆంధ్రజ్యోతి'తో రష్యా నుంచి వచ్చిన సూఫియన్


తల్లిదండ్రులతో సూఫియాన్

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బాంబుల మోత.. తుపాకీ కాల్పులు.. తెలియని దేశం.. ఒక్క పూట భోజనం.. 15 గంటల పని.. దట్టమైన అడవి.. గడ్డ కట్టించే చలి.. స్లీపింగ్ బ్యాగులో నిద్ర.. ఇలా ఎనిమిది నెలలు నిత్యం నరకమే. పొట్టకూటి కోసం దుబాయి వెళ్లిన యువకులు.. ఒక ఏజెన్సీ యూట్యూబ్ వీడియో చూసి ఎక్కువ జీతం వస్తుందని ఆశ పడడమే.. వారిని కట్టుబానిసలను చేసింది. రష్యా-ఉక్రెయిన్ సరిహద్దులో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతకాల్సి వచ్చింది. దౌత్యపరమైన చర్యలు, దేశాధినేతల చర్చలు, ఎంబసీల వినతులు వెరసి నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ సూఫియాన్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మరో ఐదుగురు అక్కడి నుంచి బయట పడగలిగారు. శుక్రవారం రష్యా నుంచి ఇండియాకు చేరుకున్నారు. నరకయాతన అనుభవించి ఇంటికి వచ్చిన సూఫియాన్‌ను చూసి అతడి కుటుంబ సభ్యులు

మిగతా 12వ పేజీలో...

ఎఫ్‌టీఎల్ నిల్!

చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణలో మహా జాప్యం



- హెచ్‌ఎండీఏ పరిధిలో 3500పైగా చెరువులు
- తుది నోటిఫికేషన్ ప్రకటించింది 230కి మాత్రమే
- 11 ఏళ్లలో 10 శాతంలోపు చెరువులకే..
- ఇరిగేషన్, రెవెన్యూ మధ్య సమన్వయ లోపం
- రెండు శాఖల వద్ద ఉన్న వివరాల్లో వ్యత్యాసం
- నోటిఫికేషన్ల జాప్యానికి ఇదీ ఓ కారణం
- హైకోర్టు ఆదేశాలతో అధికారుల్లో కదలిక
- ఆందోళనలో నిర్మాణదారులు..
- స్పష్టత కోరుతున్న కొనుగోలుదారులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చెరువుల సంరక్షణ సంగతి దేవుడెరుగు.. అవి అన్యాక్రాంతం కావడంలోనూ ప్రభుత్వ విభాగాలు తమ వంతు పాత్ర పోషించాయి! చెరువులు అన్యాక్రాంతమవడంలో ఆయా శాఖల తీరు 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందంగా ఉంది. చెరువుల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ నిర్ధారణను కూడా అధికారులు పట్టించుకోలేదు! 11 ఏళ్లుగా సర్వే చేస్తున్నా.. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) పరిధిలో కనీసం పది శాతం చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌కు సంబంధించిన తుది నోటిఫికేషన్ జారీ

మిగతా 9వ పేజీలో...

ఏసీబీ, విజిలెన్స్ తరహాలోనే హైడ్రా

- అవి కూడా ప్రభుత్వ ఉత్తర్వులతో ఏర్పాటయినవే
- జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్, వాల్టా చట్టాల కింద అధికారాలు
- గ్రేహౌండ్స్, టాస్క్‌ఫోర్స్‌లాగా హైడ్రా పనితీరు
- మాకై మేముగా ఎవరికీ నోటీసులు ఇవ్వలేదు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

11

హైడ్రా పరిశీలనలో దిలావర్‌ఖాన్, మాసబ్ చెరువులు.. చర్యలు తప్పవన్న అధికారులు 9


హైదరాబాద్‌లో 'ప్రాఫెట్ ఫర్ ది వరల్డ్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు

నెల నెలా ఆస్తి పన్ను!

గ్రేటర్ హైదరాబాద్‌లో అమలుకు యోచన.. ఆస్తి, నల్లా, విద్యుత్ బిల్లుల అనుసంధానం

పేమెంట్ యాప్‌ల ద్వారా చెల్లింపు సౌకర్యం.. గడువులోగా చెల్లించకపోతే సేవలు బంద్

- ఇకపై చెత్త సేకరణ చార్జీలూ ఆన్‌లైన్‌లోనే
- సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్న సీఎం
- స్థానిక సంస్థలకే ఎల్‌ఆర్‌ఎస్ రాబడి
- ఆర్థిక శాఖను ఆదేశించిన రేవంత్‌రెడ్డి
- లోక్‌సభలో విద్వేషం పెంచేవాళ్లే ఎక్కువ
- పేదల గొంతుకను వినిపించేవాళ్లు తక్కువ
- ఒవైసీ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడినా శత్రువుగా చూడలేం: ముఖ్యమంత్రి రేవంత్
- 'ప్రాఫెట్ ఆఫ్ ది వరల్డ్' పుస్తకావిష్కరణ

హైదరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇక నుంచి నెల నెలా ఆస్తి పన్నును వసూలు చేయనున్నారా? ఆరు నెలలకోసారి చెల్లించే విధానానికి స్వస్తి పలకబోతున్నారా? విద్యుత్, నల్లా బిల్లుల తరహాలో ప్రతి నెలా బకాయిలు చెల్లించేలా మార్పులు తీసుకురానున్నారా? ఆస్తి పన్ను, నల్లా, విద్యుత్ బిల్లుల చెల్లింపును ఒకదానితో ఒకటి అనుసంధానం చేయడంతోపాటు పేమెంట్ యాప్‌ల ద్వారా చెల్లించే విధానాన్ని తీసుకురావాలని భావిస్తున్నారా?.. అంటే అవుననే అంటున్నాయి సంబంధిత వర్గాలు. రెండు రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ పని తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించిన తర్వాత ప్రభుత్వం

మిగతా 11వ పేజీలో...

'హైడ్రా'కు చట్టబద్ధత!

- ఆర్డినెన్స్ తీసుకురానున్న ప్రభుత్వం
- ఆ తర్వాత అసెంబ్లీలో బిల్లు.. చట్టంతో విశేషాధికారాలు
- 20న క్యాబినెట్‌లో నిర్ణయం!
- ధరణి కమిటీ సిఫారసులు, బీసీ కుల గణన, రుణమాఫీ, భరోసాపై చర్చ
- 225 కొత్త పంచాయతీల ఏర్పాటు
- వ్యవసాయ శాఖ సలహాదారుగా పోచారం బాధ్యతల స్వీకరణ

11

సాక్ష్యాధారాల ధ్వంసంపై ఆర్జీ కర్

మాజీ ప్రిన్సిపల్ అరెస్టు

- కోల్‌కతా మెడికో హత్యాచారం కేసులో అదుపులోకి తీసుకున్న సీబీఐ
- విచారణను తప్పుదోవ పట్టించినందుకు కూడా అభియోగాలు నమోదు
- వీటితోపాటు ఎఫ్ఐఆర్ ఆలస్యంపైనా తలా పోలీస్ ఎస్‌హెచ్‌వో అరెస్టు
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో ముందుకుసాగని మెడికోల చర్చలు
- ప్రత్యక్ష ప్రసారానికి పట్టుబట్టిన వైద్యులు.. ఒప్పుకోని ముఖ్యమంత్రి

కోల్‌కతా, సెప్టెంబరు 14: దేశాన్ని కుదిపేస్తున్న కోల్‌కతా ఆర్జీ కర్ వైద్య కళాశాల విద్యార్థిని హత్యాచార కేసులో ఆ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మరోసారి అరెస్టు చేసింది. సాక్ష్యాధారాల ధ్వంసంతో పాటు విచారణను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని అభియోగాలు మోపింది. వీటితో పాటు, ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం చేసినందుకు కేసును తొలుత విచారించిన తలా స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) అభిజిత్ మండల్‌ను కూడా అరెస్టు చేసింది. మండల్‌ను కొన్ని గంటల పాటు విచారించిన సీబీఐ.. ఆయన నుంచి

మిగతా 10వ పేజీలో...



320 ఎంబీబీఎస్ సీట్లకు

ఎసరు!

- ఈ ఏడాది తెలంగాణ విద్యార్థులకు చేజారిన వైనం
- కౌన్సెలింగ్ మొదలయ్యాక మల్లారెడ్డి కాలేజీలకు డీమ్డ్ హోదా రావడంతో..
- ఇప్పుడు ఆ హోదా ఎలా ఇస్తారంటూ యూజీసీపై సర్కారు ఫైర్
- కేంద్రానికి ఫిర్యాదుచేసే యోచన.. అవసరమైతే కోర్టుకు



హైదరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాలు ప్రారంభమై.. అఖిల భారత కోటా రెండు విడతల కౌన్సెలింగ్ సైతం ముగిసిన తరుణంలో రాష్ట్రంలోని మల్లారెడ్డి మెడికల్, డెంటల్ కాలేజీలకు డీమ్డ్ (స్వతంత్ర) యూనివర్సిటీ హోదా కల్పించింది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ). దీంతో వీటిలో ఈ ఏడాది తెలంగాణ విద్యార్థులకు దక్కాల్సిన 320 ఎంబీబీఎస్ సీట్లు (200 కన్వీనర్, 120 బీ కేటగిరీ) కోల్పోవాల్సి వస్తోంది. కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందే డీమ్డ్ హోదా ఇస్తే అభ్యంతరం ఉండకపోయేది. కానీ, ఇప్పుడు నిర్ణయం తీసుకోవడంపై

మిగతా 12వ పేజీలో...

గల్ఫ్ కార్మికులకు త్వరలో

సంక్షేమ బోర్డు

- హైదరాబాద్‌లో ప్రవాసీ ప్రజావాణి
- ప్రతి జిల్లాకు ఓ ప్రవాసీ సెంటర్
- మరణించిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- గల్ఫ్ ప్రభావిత నియోజకవర్గ ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం సమీక్ష

11

ఎమ్మెల్యేలు బజారున పడి తన్నుకోవడం బాధేసింది

10

- ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించింది బీఆర్‌ఎస్
- ఆ పార్టీ కుట్రలను ప్రజలు మరిచిపోలేదు: భట్టి

త్వరలో పంటల బీమా!

- నెలాఖరు వరకు కస్టర్ల వారీగా టెండర్లు
- ప్రీమియం చెల్లింపునకు రూ.2,500కోట్లు
- బీమా వర్తింపు.. వానాకాలం నుంచా.. యాసంగి నుంచా?.. తుమ్మల సమీక్ష

11

అల్లుడు.. కిరాతకుడు

- ఆస్తిపై కన్నేసి బావమరిది హత్య
- రూ. 10 లక్షలు సుపారీ మాట్లాడుకుని ప్రాణం తీయించిన వైనం
- ఆపై ఆత్మహత్యగా చిత్రీకరణ
- హైదరాబాద్‌లో ఘటన, ముగ్గురి అరెస్టు

12

టీపీసీసీ అధ్యక్షుడిగా నేడు మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతల స్వీకరణ

- గాంధీభవన్‌లో సీఎం రేవంత్ చేతుల మీదుగా..
- పాల్గొననున్న భట్టి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు

10





చైనా కంపెనీల్లో సెబీ చీఫ్ పెట్టుబడులు

- ఆ దేశంతో ఘర్షణ నెలకొన్న వేళ మాధవి బుచ్ ఆర్థిక లావాదేవీలు
- లిస్టెడ్ సెక్యూరిటీల్లో 36.9కోట్లు
- సెబీ నియమావళికి ఇది విరుద్ధం
- అఘోరా అడ్వైజరీ కంపెనీలో ఇప్పటికీ ఆమెకు 99% వాటా
- కాంగ్రెస్ సంచలన ఆరోపణలు



10

అంతిమ ఘడియల్లో కశ్మీర్ ఉగ్రవాదం

- వారసత్వ రాజకీయాలు సుందర కశ్మీర్‌ను దెబ్బతీశాయి
- ఈ ప్రాంతానికి రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తాం
- మేమొచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు జరిపాం
- అభివృద్ధికి పాటుపడిన యువతకు నా సెల్యూట్
- కశ్మీర్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

జమ్మూ, సెప్టెంబరు 14: కలయా? నిజమా? అన్నంతగా జమ్మూకశ్మీర్‌లో పదేళ్లలో అద్భుత ప్రగతిని సాధించామని.. దీంతో ఈ ప్రాంతంలో ఉగ్రవాదం అంతిమ ఘడియల్లో ఉందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గతంలో సైన్యం, పోలీసులపైకి విసిరిన రాళ్లు ఇప్పుడు నయా కశ్మీర్ నిర్మాణంలో పునాదిరాళ్లుగా మారాయని పేర్కొన్నారు. దీని వెనుక

మిగతా 10వ పేజీలో...





750 దరఖాస్తులు.. 55 మంది సివిల్ సర్వెంట్లు

- ఆర్టీఐ కమిషనర్ పోస్టులకు మాజీ ఐఏఎస్, ఐపీఎస్‌ల పోటీ
- సహా చట్టం నిపుణులకే ప్రాధాన్యం ఇవ్వనున్న ప్రభుత్వం!
- ఎంపికపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కమిషన్‌లో చోటు కోసం.. రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌లు పెద్దఎత్తున పోటీ పడుతున్నారు. రెండున్నరేళ్ల నుంచి ఖాళీగా ఉన్న కమిషన్‌లో ప్రధాన సమాచార కమిషనర్‌తో పాటు ఆరుగురు కమిషనర్లను నియమించాల్సి ఉంది. ఎంపికకు సంబంధించి టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుడు జూలైలో, కాంగ్రెస్ సర్కారు ఈ ఏడాది జూలైలో నోటిఫికేషన్లు ఇచ్చాయి. ఏడు పోస్టులకు దాదాపు 750 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో 55 మంది రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌లవే ఉన్నట్టు

మిగతా 12వ పేజీలో...

ధూర్జటిలోని ధిక్కారం పోతనలోని ఆత్మగౌరవం నలిమెల భాస్కర్‌ను సామాన్యమైన అధ్యాపకుడిగా ఉంచినా జనంలో అసామాన్యమైన వ్యక్తిగా నిలిపాయి. తెలంగాణ భాషమీద సాధికారికంగా వ్యాసాలు రాస్తూ భాస్కర్ తెచ్చిన తెలంగాణ పదకోశం అస్తిత్వ పోరాటంలో తెలంగాణ ఉద్యమకారులకు ఆయుధమైంది. కవులు రచయితలకు ఒక డిక్షన్ అయింది. తెలుగులోని అలిశెట్టి ప్రభాకర్ కవిత్వాన్ని, బిఎస్ రాములు పాలు కథని, శ్వేతరాత్రులు కథల్ని తమిళంలోకి అనువదించి ఇరుగుపొరుగు సాహిత్యానికి భాస్కర్ వారధి వేశాడు.

భాషల సాహిత్య వారధి భాస్కర్

తెలుగు సాహిత్యంలో తెలంగాణకు సంబంధించి చెప్పుకోదగ్గ సంఘటనలు మూడున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం తెలంగాణలో కవులే లేరన్నందుకు ధిక్కారంగా సురవరం ప్రతాపరెడ్డి 354 మంది కవులతో గోల్కొండ కవుల సంచికను తెచ్చాడు. తెలంగాణలో కథలే లేవన్నందుకు సవాల్‌గా సంగిశెట్టి శ్రీనివాస్ 1500 కథకులతో దస్త్రంను తెచ్చారు. తెలంగాణ భాషను భాషలా గౌరవించనందుకు నిరసనగా నలిమెల భాస్కర్ తెలంగాణ పదకోశాన్ని తెచ్చాడు. 1956 ఆత్మగౌరవానికి సంబంధించిన సంవత్సరం. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఆంధ్ర తెలంగాణలు ఉమ్మడి రాష్ట్రంగా ఏర్పడ్డాయి. 2014 కూడా ఆత్మగౌరవానికి సంబంధించిన సంవత్సరమే. ఎన్నో పోరాటాల తర్వాత సొంత రాష్ట్రం ఏర్పడింది.

ఇదే 1956లో బుచ్చమ్మ రామచంద్రం దంపతులకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో జన్మించిన నలిమెల భాస్కర్ 2014లో ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకొని ఇప్పుడు 2024లో తెలంగాణ అస్తిత్వానికి పతాక అయిన కాళోజీ అవార్డు అందుకుంటున్నారు.

మానేరు నది పరివాహక ప్రాంతం ఉద్యమాలకు పెట్టింది పేరు. అటు జగిత్యాలలో ఇటు సిరిసిల్లలో గోదావరిఖని బొగ్గుగనుల్లో పురుడుపోసుకున్న పోరాటాలు ప్రజలను ఎంతగానో చైతన్యపరిచాయి. సిరిసిల్ల నిమ్మపల్లి రైతాంగ పోరాటాలు ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఆ తరంలో ప్రతి మనిషిని ప్రభావితం చేసాయి. నారాయణపురం కొండాపురం ఆవునూర్ లాంటి నది ఒడ్డు ప్రాంతాల్లో ఆ ప్రభావం మరీ ఎక్కువ. అక్కడే పుట్టి పెరిగిన నలిమెల భాస్కర్ ధిక్కార స్వరంతో అధ్యయన శీలిగా ఎదిగాడు. కథ, కవిత్వం, గేయం లాంటి సాహిత్య ప్రక్రియల్లోనే కాకుండా భారతీయ భాషల మీద పట్టును సాధించాలనుకున్నాడు.

మొదట తెలుగు, కన్నడ, తమిళ, మళయాళ సామెతలపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్ చేశాడు. తెలుగు, మళయాళ కుటుంబ సామెతలపై పరిశోధన చేసి అదే విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాడు. తర్వాత పద్నాలుగు భాషలపై పట్టును సాధించి ఆయా భాషలు సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు తెలుగు నుంచి ఆయా భాషలకు పరిచయం చేశాడు.

వ్యక్తిగతంగా భాస్కర్ చాలా నిజాయితీ నిబద్ధతగల మనిషి. ఆయన రాతలు ఎలా ఉంటాయో జీవితం కూడా అలాగే ఉంటుంది. 45 ఏళ్ల కిందనే సంప్రదాయాలను, పద్ధతులను తృణీకరించి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఆదర్శ వివాహం చేసుకున్నాడు. కూతురైన కొడుకైన ఒక్కరే చాలు అనుకున్నాడు. తను నడిచిన దారిలోనే తన కూతురుకు కూడా ఆదర్శ వివాహం చేశాడు. ఒకవైపు ఇంటికి పెద్దకొడుకుగా ఎన్నో బాధ్యతలు మోస్తూనే సామాజిక స్పృహతో సాహిత్య సృజన చేసాడు. నిజానికి భాస్కర్ అద్భుత మేధోసంపత్తి గల మనిషి. కానీ ఎప్పుడూ అవార్డుల కోసం పరితపించలేదు. వాటి వెంట పడలేదు. నాటి అకాడమీ అవార్డు నుంచి నేటి కాళోజీ అవార్డుదాక ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. అదీ ఆయన గొప్పతనం.

చిన్ననాడు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. ఎంతో దుఃఖాన్ని దిగమింగుకున్నాడు. కానీ అప్పటికీ ఇప్పటికీ ఆయన నిటారుగానే నిలబడ్డాడు. కొద్దిగా చూపును దించుకున్నా వెన్ను వంచుకున్నా పెన్ను వంచుకున్నా భజన సంఘంలో చేరినా ఆయన మేధోసంపత్తికి మెడనిండా అవార్డుల హారాలుండేవి. పేరుకు ముందు ఎన్నో బిరుదులు ఉండేవి. కానీ ధూర్జటిలోని ధిక్కారం పోతనలోని ఆత్మగౌరవం ఆయనను సామాన్యమైన అధ్యాపకుడిగానే ఉంచాయి. కానీ జనంలో అసామాన్యమైన వ్యక్తిగా నిలిపాయి.

భాస్కర్ ఒక బడిపంతులు కొడుకు. తాను కూడా చిన్న బడిపంతులుగానే జీవితం మొదలుపెట్టాడు. 1974 నుంచే సాహిత్యంతో అనుబంధం ఉంది. అప్పుడే అభ్యుదయభావాలతో మానవుడా గేయాన్ని రాశారు.

అది ఉద్యమాల కాలం. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ప్రజలు, భూస్వాముల మధ్య అట్టుడుకుతున్న వాతావరణం. నారాయణపురం, దుమాల, అక్కపెల్లి, ఎల్లారెడ్డిపేట, వీర్నపెల్లి, అల్మాస్‌పూర్, సిరిసిల్ల, కోనరావుపేట, నూకలమర్రి, మానాల అటవీ ప్రాంతాలు మానేరు బెల్టుగా ఏర్పడి రైతాంగ పోరాటాలు ఊపిరి పోసుకుంటున్న కాలం. దొరలూ భూస్వాములు పోలీసుల అండతో ప్రశ్నించే గొంతుకను రాత్రికి రాత్రే మాయం చేస్తున్న కాలం. ప్రజల్లో ఎన్నికల చైతన్యం ఇంకా రాని కాలం. అదిగో అప్పుడే నూనూగు మీసాల నూతన యవ్వనంలోనే దొరల పెత్తనం మీద ఓ రాయి విసిరాడు. అదే మంద కథ. అప్పటికీ తెలంగాణ పల్లెల్లో గడీల పునాదులు ఇంకా గట్టిగానే ఉన్నాయి. ఆ కాలంలో వచ్చిన మంద కథ భాస్కర్‌ను మందలోని మనిషి కాడని మందను మలిపే మందలో ఒక మనిషని చెప్పింది. తర్వాత వచ్చిన అదిరింపులు బెదిరింపులకు ఆయన ఎక్కడా భయపడలేదు.

భాస్కర్ సాహిత్యం గురించి చెప్పాలంటే ముందుగా ఆయన వ్యక్తిత్వం గురించి చెప్పాలి. భాస్కర్ అసాధ్యం అనుకున్న ప్రతిదాన్ని సుసాధ్యమే అంటాడు. చేసి చూపిస్తాడు కూడా. ఉపాధ్యాయుడిగా పెద్దపల్లి దగ్గర కొలనూరులో ఉన్నప్పుడు వచ్చిన ఒక చిన్న ఆలోచన ఆయనను ఈ రోజు బహుభాషావేత్తగా ఈ స్థాయిలో నిలిపింది. 30 రోజులలో భాషను నేర్పే చిన్న గడ్డి పరక లాంటి ఒక పుస్తకంతో భాషల సముద్రాన్ని ఈదేశాడు. ఎంత పట్టుదల మనిషంటే 14 భాషలను నేర్చుకునే వరకు ఆ పనిని వదిలిపెట్టలేదు. ఆయా భాషల సాహిత్యాన్ని తెలుగులోకి తెలుగు సాహిత్యాన్ని ఆయా భాషల్లోకి అనువాదం చేశారు. పదకొండు కవిత్వం పుస్తకాలు అందులో ఏడు అనువాదాలు ఐదు అనువాద కథా సంపుటాలు ఏడు వ్యాస సంపుటాలు మూడు నవలలు రెండు బాల సాహిత్య పుస్తకాలు మొత్తం 32 పుస్తకాలను తెచ్చాడు. ఈ ప్రయత్నంలో ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయలేదు. గౌట్స్ గ్లకోమా ఇంకా ఎన్నో ఆరోగ్య సమస్యలను తెచ్చుకున్నారు. డాక్టర్ చదువకూడదూ చదివితే కళ్ళు ఉండవు అన్నాడు. కానీ ఈయన ఇప్పటికీ చదువుతూనే ఉన్నాడు. మొన్నటికి మొన్న ఒక భాష తక్కువైందని భగవద్గీతను ముందేసుకుని సంస్కృతం కూడా నేర్చుకున్నాడు. చిన్న పియానో ముందేసుకుని కీర్తనలను నేర్చుకున్నాడు. గురువు లేనిదే సంగీతం రాదని మనం అనుకుంటే ఎందుకు రాదని తను అనుకున్నాడు. ఏడాదిలోనే 16 రాగాలు 50 పాటలు వాయించడం నేర్చుకున్నాడు.

భాస్కర్‌ను కవిగాను రచయితగాను అనువాదకుడిగాను చివరికి భాషా శాస్త్రవేత్తగాను చెప్పినా పూర్తిగా చెప్పినట్టు కాదు. ఒక దాంట్లో ఒదగడమో ఒకదాంట్లోనే ఎదగడమో ఆయనకు నచ్చని పని. చిన్నతనంలోనే



నారాయణపురం లైబ్రరీలో తెలుగు సాహిత్యాన్ని చదివాక స్వచ్ఛమైన తెలుగును వాడుక భాషలో మాట్లాడాడు. తర్వాత అది తన భాష కాదని తెలిసి తెలంగాణ భాష లోతుపాతుల్ని విడమర్చి చెప్పాడు. ద్రావిడ భాషలకు తెలుగు తెలంగాణ మధ్య సంబంధాల్ని శాస్త్రీయంగా చెప్పి నేర్పించాడు. ఈ రచనలన్నీ ఒకెత్తయితే అంగాలను కప్పేది అంగి, లాగి తొడిగేది లాగు, గుండ్రంగా ఉండేది గుండి, తన్నుకుంటూ ఎక్కేది తంతే అంటూ తెలంగాణ భాషమీద సాధికారికంగా వ్యాసాలు రాస్తూ భాస్కర్ తెచ్చిన తెలంగాణ పదకోశం అస్తిత్వ పోరాటంలో తెలంగాణ ఉద్యమకారులకు ఆయుధమైంది. కవులు రచయితలకు ఒక డిక్షన్ అయింది. ఈ ఒక్క మహత్కార్యం చాలు భాస్కర్‌ను పది కాలాలపాటు మనిషిగా నిలబెట్టడానికి.

కవిగా రచయితగా గాయకుడిగా సంగీత సాధకుడిగా అనువాదకుడిగా భాషా శాస్త్రవేత్తగా వ్యాసకర్తగా అధ్యాపకునిగా అన్నింటికీ మించి మంచి మనిషిగా గురువుగా స్నేహితునిగా నిక్కచ్చిగా వ్యవహరించే భాస్కర్ సహచరి సావిత్రక్క గురించి చెప్పకుంటే భాస్కర్‌లోని ఒక పార్శ్వం గురించి చెప్పనట్టే లెక్క. ఇప్పటికీ ఆమెకు భాస్కర్ చిన్న పిల్లవాడే. కంటికి రెప్పలా కాపాడుకుంటుంది.

ఎక్కడో ఉన్న ఆఫ్రికన్ కవులు ఇంగ్లీష్ రచయితలు తెలిసినంతగా మనకు మన పక్కనున్న ఇతర రాష్ట్రాలకు చెందిన రచయితలు తెలియదు. ఆ లోటును పూడ్చడానికి భాస్కర్ భారతీయ సాహిత్యాన్ని తెలుగులోకి, తెలుగులోని అలిశెట్టి ప్రభాకర్ కవిత్వాన్ని, బిఎస్ రాములు పాలు కథని, శ్వేతరాత్రులు కథల్ని తమిళంలోకి అనువదించి ఇరుగుపొరుగు సాహిత్యానికి వారధి వేశాడు.

ఈ భాషలు కథలు కవిత్వం ఇవన్నీ పక్కన పెడితే మనిషి మాయమైపోతున్నాడని మనందరం ఆందోళన చెందుతున్న ఈ కాలంలో మనుషుల్ని ప్రేమించి బాధలకు కరిగిపోయి తనవి కాని బాధ్యతలు నెత్తినెత్తుకొని పేరుకో కీర్తికో అవార్డుకో పదవులకో ఆశించని నికార్సైన మనిషి ఇదిగో మన మధ్యనే నిరాడంబరంగా ఉన్నాడు.

• **పెద్దింటి అశోక్ కుమార్**

సంపూర్ణ భారతీయ జ్ఞాని

నేను అమితంగా అభిమానించే భారతీయ విద్వజ్జుడు ప్రొఫెసర్ ఆంద్రే బెతెయిల్. నేడు ఆ గురు శ్రేష్ఠుని 90వ పుట్టిన రోజు. బెంగాల్‌లో పుట్టి పెరిగిన బెతెయిల్ కలకత్తా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసమనంతరం ఢిల్లీకి వచ్చి, తదాది అక్కడే నివసిస్తున్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఢిల్లీ విశ్వ విద్యాలయ సామాజికశాస్త్ర విభాగంలో బోధకుడుగా ఉన్నారు. అనేక పుస్తకాలు రాయడంతో పాటు వార్తా పత్రికలలో మరెన్నో వ్యాసాలు రాశారు. విశ్రాంత జీవితంలోకి ప్రవేశించిన తరువాత అశోకా యూనివర్సిటీ తొలి ఛాన్సలర్‌గా ఉన్నత విద్యా రంగానికి విశిష్ట సేవలు అందించారు. అనితరసాధ్యమైన వైదుష్యంతో కూడిన పుస్తకాలు వెలయించడాన్ని కొనసాగిస్తూ తన యవ్వనకాల సమ్మోహక స్మృతులు, విద్యాభ్యాస విజ్ఞానదాయక అనుభవాల గురించి ఒక స్ఫూర్తిదాయక స్వీయ చరిత్రాత్మక కథనాన్ని కూడా మనకు అందించారు.

ఆంద్రే బెతెయిల్ సగం ఫ్రెంచ్, సగం బెంగాలీ, సర్వ సంపూర్ణంగా భారతీయుడు. బెంగాలీ మేధావులకు అరుదైన రీతిలో ఆయన తన దేశాన్ని ప్రేమించారు. కొత్త భావాలు, ఇతర సంస్కృతులు, భిన్న ప్రజల గురించి తెలుసుకోవడంలో బెంగాలీలు ఆసక్తి చూపకపోరు. అయితే ఇతర దేశాలు, ప్రజల జీవన సంస్కృతులలో వారు తమకు తాముగా ఆసక్తి చూపినప్పుడు, అది సాధారణంగా తోటి భారతీయుల గురించి మాత్రం అయివుండదు. ప్రముఖ బెంగాలీలు అందరూ రెండు జాతీయతలు ఉన్నవారేనని నేను ఇదే కాలమ్‌లో ఒకప్పుడు ఛలోక్తి విసిరాను. నీరద్ సి చౌధురి బెంగాలీ, ఆంగ్లేయుడు; సత్యజిత్ రే బెంగాలీ, ఫ్రెంచ్; జ్యోతి బసు బెంగాలీ, రష్యన్; చారు మజుందార్ బెంగాలీ, చైనీస్. ఈ హాస్యోక్తికి ఇలా ముక్తాయింపు నిచ్చాను : బెంగాలీ, భారతీయుడు రెండూ అయిన చివరి విఖ్యాత బెంగాలీ బహుశా రవీంద్రనాథ్ టాగోరే కావచ్చు.

రవీంద్రుడు వలే బెతెయిల్ కూడా విశాల ప్రపంచం, ఇతర భారతీయుల గురించి కూడా తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న విద్వజ్జుడు. ఆయన తన డాక్టొరల్ క్షేత్ర పరిశోధనను తమిళనాడు నడిబొడ్డున ఉన్న తంజావూరులో చేశారు. ఆయన మార్గదర్శకత్వంలో పరిశోధన చేసిన వారిలో ముంబైకి చెందిన బెంగాలీ, జంషెడ్‌పూర్ నుంచి వచ్చిన తమిళుడు, లద్దాఖ్‌లో పనిచేసిన కన్నడిగుడు, కర్ణాటక వాసి అయిన పంజాబీ మొదలైనవారు ఉన్నారు. మార్క్స్, వెబర్‌ను ఆయన సమగ్రంగా అధ్యయనం చేశారు. అలాగే ఈవాన్స్–ప్రిట్చర్డ్, లెవి స్ట్రాస్‌ను బాగా ఆకళింపు చేసుకున్నారు. నెహ్రూ, అంబేడ్కర్‌ను నిశితంగా చదివారు. నా పుస్తకం 'Democrats and Dissenters'లో సామాజిక శాస్త్రంలో బెతెయిల్ వైదుష్యం గురించి వివరంగా రాశాను. ఆయన పరిశోధనల ప్రాశస్త్యాన్ని వివరించాను. ఆయనతో నా వ్యక్తిగత, మేధో అనుబంధం గురించి రాసేందుకు ఈ కాలమ్‌ను ఉద్దేశించాను.

బెతెయిల్‌ను నేను మొట్టమొదట 1988లో కలిశాను. తదాది మా మధ్య సంబంధాలు సన్నిహితంగా కొనసాగుతున్నాయి. ఆయన రచనలు, మా సంభాషణలు నా ఆలోచనలు, మేధో దృక్పథాన్ని తీర్చి దిద్దాయి. 'భారతీయ ప్రాజ్ఞుడు'గా బెతెయిల్‌ను నేను ఒకసారి అభివర్ణించాను. అది నేను ఆయన గురించి నిరాలోచనగా ఏర్పరచుకున్న అభిప్రాయం. పదప్రయోగం సైతం రెండు హెచ్చరికలు చేస్తుంది: భారత్‌లో ఒక ప్రాజ్ఞురాలు కూడా ఉండవచ్చు; ప్రాజ్ఞుడైన భారతీయుడు ఒకరు విదేశాల్లో నివసిస్తుండవచ్చు. బెతెయిల్ పట్ల నా గౌరవాభిమానాలు స్వతస్సిద్ధమైనవి. మరి ఆయన నాపట్ల ఎందుకు అంత ప్రేమాస్పదంగా ప్రతిస్పందించారు? బహుశా, నా మేధో ప్రస్థానం ఆయనకు పూర్తిగా భిన్నమైనది కావడం వల్లేనని అనుకుంటున్నాను. మేము మొదటిసారి కలుసుకున్నప్పుడే ఆయన అప్పుడున్న ఉద్యోగంలోనే మూడు దశాబ్దాలు ముగించుకున్నారు. నేను అప్పటికి ఏడు సంవత్సరాలలో నాలుగో ఉద్యోగంలో ఉన్నాను. నేను చాలా ఉద్విగ్నుడినయ్యాను, లెక్కలేనితనంతో అభిప్రాయాలు వ్యక్తం చేసేవాణ్ణి. ఆయన చాలా ప్రశాంతంగా ఉండేవారు. స్థిత ప్రజ్ఞుడు. ఒక ప్రశ్నను బహుముఖంగా తరచిచూసి తన అభిప్రాయాన్ని తెలిపేవారు. సహచరులతో వాదోపవాదాలు చేసే స్వభావం నాది. రచనల్లో గానీ, సంభాషణల్లో గానీ ఆయన సదా సంయమనం చూపేవారు.



■ **రామచంద్ర గుహ**

ఇప్పటికి చాలా సంవత్సరాలుగా నా పుస్తకాలలో బెతెయిల్ ప్రచురిత రచనలను ప్రస్తావిస్తున్నాను; నా కాలమ్స్‌లోను, ప్రసంగాలలోను మా సంభాషణల నుంచి ఉటంకింపులు చేస్తున్నాను. నెహ్రూ మరణానంతర మాన్యత బైబిల్ ప్రవచించిన ఒక సుప్రసిద్ధ సూక్తిని తలకిందులు చేసిందని ఆయన ఒకసారి నాకు చెప్పారు. తండ్రి పాపాలు అతడి పిల్లలకు, వారి సంతానానికి చుట్టుకుంటాయన్నది బైబిల్ సుభాషితం. అయితే నెహ్రూ విషయంలో కుమార్తె, మనవడి పాపాలు ఆయన్ని చుట్టుకున్నాయి! మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య నిర్మాణానికి నెహ్రూ అందించిన మహోన్నత సేవలు, ఆయన కుటుంబ వారసుల రాజకీయాల మూలంగా అర్థరహితమయి, భ్రష్టత్వం పాలయ్యాయన్నది బెతెయిల్ వ్యాఖ్యకు అర్థం. ఆయన చేసిన ఈ వివేకశీల, నిశిత వ్యాఖ్యను నేను ఇప్పటికి కనీసం డజన్‌కు పైగా నా బహిరంగ ఉపన్యాసాలలో ఉటంకించాను, ప్రతిసారీ దాని



> **ఆంద్రే బెతెయిల్ సగం ఫ్రెంచ్, సగం బెంగాలీ, సర్వ సంపూర్ణంగా భారతీయుడు. దేశ రాజధానిలో దశాబ్దాలుగా నివసిస్తున్న బెతెయిల్ ఢిల్లీలోని ఇతర మేధావుల మాదిరిగా అధికార ప్రాభవ ప్రాబల్యాలు ఉన్న వ్యక్తులతో పరిచయాలకు ఏ మాత్రం ఆరాటపడరు. పరిశోధన, రచన, బోధన మాత్రమే తన విధ్యుక్తధర్మంగా భావిస్తారు. తనకుతాను ఏదో ఒక రీతిలో రాజగురుగా చెలామణి అయ్యేందుకు ప్రయత్నించరు. ఏ అమాత్యుడికి గానీ లేదా ప్రతిపక్ష నాయకుడికి గానీ సలహాలు ఇచ్చేందుకు ఉబలాటపడరు.**

కర్తృత్వాన్ని బెతెయిల్‌కు ఆపాదిస్తూనే సుమా!

సామాజిక శాస్త్రంలో అపార వైదుష్యం, పరిశోధనానుభవం నిర్దిష్ట ప్రభుత్వ విధానాలను సహేతుకంగా విమర్శించగల సాధికారతను ఆయనకు సమకూర్చాయి. అయితే బెతెయిల్ ఎప్పుడూ తన సొంత ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదించలేదు. అర్థశాస్త్ర స్వభావం దృష్ట్యా ఆర్థికవేత్తలు విధాన రూపకల్పనలోను, విధాన నిర్దేశంలోను చురుగ్గా పాల్గొంటున్నారు. కొంత మంది సమాజ శాస్త్రవేత్తలు, చరిత్రకారులు కూడా ఆర్థికవేత్తల వలే వ్యవహరించేందుకు ఆరాటపడుతున్నారు. అధికారంలో ఉన్న, లేని రాజకీయవేత్తల మద్దతుతో తమ ప్రత్యామ్నాయ విధానాలను నిర్దేశిస్తున్నారు. ఇటువంటి వ్యవహారాలకు బెతెయిల్ చాలా దూరం. అప్పుడప్పుడు విధాన విశ్లేషణలో పాల్గొన్నా ఎప్పుడూ ఏ విధంగాను విధాన నిర్దేశానికి ఆయన పూనుకోనే పూనుకోరు.

బెతెయిల్ దశాబ్దాలుగా దేశ రాజధానిలో నివశిస్తున్నారు. అయితే ఢిల్లీ వాసులు అయిన ఇతర మేధావుల మాదిరిగా అధికార ప్రాభవ ప్రాబల్యాలు ఉన్న వ్యక్తులతో పరిచయాలకు, వారిని ప్రభావితం చేసేందుకు ఆయన ఏ మాత్రం ఆరాటపడరు. పరిశోధన, రచన, బోధన మాత్రమే తన విధ్యుక్త ధర్మంగా భావించేవారు, పాటించేవారు. తనకుతాను ఏదో ఒక రీతిలో రాజగురుగా చెలామణి అయ్యేందుకు ప్రయత్నించరు. ఏ అమాత్యుడికి గానీ లేదా ప్రతిపక్ష నాయకుడికి గానీ సలహాలు ఇచ్చేందుకు ఉబలాటపడరు.

బెతెయిల్ తన స్వభావరీత్యా నేను ప్రజా రంగంలో మితిమీరిన స్థాయిలో చురుగ్గా ఉంటున్నానని భావించేవారు. నిత్యం ఉపన్యాసాలు వెలువరిస్తున్నానని, టీవీ కార్యక్రమాలలో కనిపిస్తున్నానని, నిష్ఫల వివాదాల్లో పాల్గొంటున్నానని ఆయన అనేవారు. 2012 వేసవిలో నేను ఒక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాను. నెలల తరబడి పడక మీదే గడపాల్సివచ్చింది. ఇది తెలిసిన బెతెయిల్ నాకు ఒక లేఖ రాశారు : 'నీ ప్రమాద ఘటన ఒక ఊహించని మేలు అని భావిస్తున్నాను. నీ బాధాకర పరిస్థితి నీ రచనా వ్యాసంగాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని నేను అనుకోవడం లేదు. నిజానికి అదొక ప్రయోజనకర లబ్ధి. నీ సన్నిహిత బంధువు (ఆర్థిక చరిత్రవేత్త ధర్మకుమార్) నాతో తరచు మీకు మేధో క్రమశిక్షణ బాగా ఉన్నదిగానీ భావనాశక్తి తక్కువగా ఉన్నదని అంటుండేవారు. నీకు నీ చింతన, రచనలో మరింత క్రమశిక్షణ అవసరమని నేను నిజంగా భావిస్తున్నాను. మరి ఒకచోట స్థిమితంగా కూర్చున్నప్పుడే చింతన, రచన సుసాధ్యమవుతాయి'.

ఇప్పుడు ఆయనకు నేను రాసిన ఒక లేఖ నుంచి ఉటంకింపు చేస్తాను : 'బీబీసీ విలేఖరిగా వృత్తి జీవితమంతా ఉపఖండంలో గడిపిన మార్క్ టుల్లీని కొన్ని సంవత్సరాల క్రితం బెంగళూరులో కలిశాను. మీకు ఆంద్రే బెతెయిల్ తెలుసా అని ఆయన నన్ను అడిగారు బెతెయిల్‌ను తాను ఒకసారి బీబీసీ కోసం ఇంటర్వ్యూ చేశానని చెప్పారు. నిజమైన విద్వజ్జుడుగా మిమ్ములను టుల్లీ గుర్తు చేసుకున్నారు. రేడియో జర్నలిజం ప్రింట్ జర్నలిజం కంటే తక్కువ స్థాయికి చెందినదని, ప్రింట్ జర్నలిజం విద్యావిషయిక విద్వత్ వ్యాసంగం కంటే అధమ స్థాయికి చెందినదనేది మీ అభిప్రాయమని టుల్లీ చెప్పారు. ఈ రెండు విషయాలలోను మీ అభిప్రాయం సరైనదని అనడానికి నేను సంకోచించను'.

బెతెయిల్‌కు ఒకే ఒక్క అధ్యయన అంశం ఉన్నదని ఆయన విమర్శకులు అనడం కద్దు. అయితే అది చాలా విశాలమైనది, బహుశా చాలా ముఖ్యమైనది కూడా. సామాజిక అసమానతలే ఆ అధ్యయన అంశం. ఒక తమిళ గ్రామంలో కుల వ్యవస్థ గురించి, వ్యవసాయ రంగంలో వర్గ నిర్మాణం గురించి, ప్రాచ్య పాశ్చాత్య దేశాలలోని అసమానతల తుల్య విశ్లేషణ, వెనుకబడిన వర్గాల ఉత్థానం, సామాజిక న్యాయ డిమాండ్లు– సంస్థల న్యాయవర్తన గురించి విస్తారంగా రాశారు సామాజిక స్తరీకరణను కేవలం ఆర్థిక కారకాల ప్రాతిపదికన కాకుండా సాంఘిక హోదా ప్రాముఖ్యత, అధికార ప్రభావశీలత కోణాల నుంచి కూడా ఆయన పరిశీలించారు. బెతెయిల్ రచనలకు శాశ్వతమైన ప్రాసంగికత ఉన్నది.


(వ్యాసకర్త చరిత్రకారుడు)

(నేడు ఆంద్రే బెతెయిల్ 90 వ పుట్టిన రోజు)

ఎలుక కాదు, ఎలుగు!

'ఎలుక తోలు తెచ్చి యేడాది ఉతికినా
నలుపు నలుపే గాని తెలుపు రాదు'

అని ప్రారంభమయ్యే పద్యం 'వేమన శతకం'లో చాలా ప్రసిద్ధి చెందిన పద్యాలలో ఒకటి. పుట్టుకతో వచ్చిన సహజమైన చెడు గుణం, లేదా శారీరకమైన అవలక్షణాన్ని వదిలించాలని ఎంత కష్టపడి ప్రయత్నించినప్పటికీ అది వదిలేది కాదు అనే అర్థంలో ఈ పద్యం చెప్పబడింది. చెప్పదలుచుకున్న లోకనీతి, వివేకవంతమైన మంచి విషయం పిల్లలకు (పెద్దలకు కూడా!) సులభంగా అర్థం కావాలనే ఉద్దేశంతో ఇలాంటి పోలికలు చేసి పద్యంగా మలచడం జరిగిందని అనుకున్నప్పటికీ, ఇందులో పోలిక కోసం తీసుకున్న 'ఎలుక తోలు' నిజానికి వేమన ఉద్దేశించినది కాదని పూర్వులు వ్రాసి పెట్టుకున్న తాళపత్ర పుస్తకాలలోని పద్యాన్ని చూసినప్పుడు అర్థమౌతుంది. ఏనాటిదో తెలియని ఒక తాళపత్ర పుస్తకంలో ఈ పద్యానికి పాఠం ఇలా ఉంది:



ఆ. ఎలుగు తోలు తెచ్చి యందాక నుతికిన
నలుపు గాక యేల తెలుపు గలుగు
కొయ్యబొమ్మ దెచ్చి కొట్టిన గుణియౌనె
విశ్వదాభిరామ వినురవేమ!

ఉతకడం అనే క్రియకు సరిపోయేదిగా వేమన 'ఎలుక తోలు' అనే మాట కంటె 'ఎలుగు తోలు' అనగా ఎలుగుబంటి చర్మాన్ని ఉదాహరణగా చేసుకుని చెప్పాడని ఊహించడానికి పెద్దగా సందేహించనక్కర లేదు. ఒకవేళ సందేహపడినా, పరిమాణంలో కనీసం నాలుగు వేళ్ళ మధ్యకు కూడా అమరని ఎలుక తోలును ఉతకడం, అదీ ఏడాది పాటు ఉతకడానికి వీలయ్యేపనేనా? అని ఒక్కసారి ఆలోచన చేస్తే, అందులోని అసంభావ్యత కళ్ళ ముందు మెదిలి వెంటనే సందేహ నివృత్తి జరుగుతుంది. అదేగాక 'యందాక' (ఎంతగా కష్టపడి ఉతికినా అనే అర్థంలో చెప్పబడిన) మాటకు బదులుగా 'యేడాది' అని చేర్చడం కూడా 'ఎలుక'తో పాటుగా చేసిన మార్పు అనేది అర్థంచేసుకోగలిగినదే! అయితే, ఆ మాటలతోనే ఈ పద్యం ప్రసిద్ధమైనది కాబట్టి అందులోని అసంభావ్యతలకు సమాధానపడి సరిపెట్టుకోవడమే మంచిది అనే అభిప్రాయానికి చెప్పగలిగిన అభ్యంతరం నా దగ్గర ఏదీ లేదు. కాని, వేమన ఉద్దేశించిన పోలిక ఇదేనా? అని ప్రశ్నించుకున్నప్పుడు మాత్రం పద్యంలోని ఆ 'తప్పు పాఠాలను' ఎప్పటికైనా సరి చెయ్యకుండా వదిలెయ్యడం సరైనది కాదేమో అని తప్పకుండా అనిపిస్తుంది. వేమన శతకంలోని ఈ పద్యం మాట అటుంచితే, తెలుగు నాట బహుళ ప్రసిద్ధి పొందిన మొదటి నీతిశతకమైన 'సుమతీ శతకం'లో కూడా ఇటువంటి 'తప్పు పాఠాలు' కొన్ని కనపడి చదువుతున్నప్పుడు పంటి కింద పడ్డ రాళ్ళలాగా అడ్డుపడుతూ ఇబ్బంది కలిగిస్తుంటాయి. ఉదాహరణకు ఈ క్రింది పద్యం:

కం. రూపెంచి సతిని బొందకు
ప్రాపగు చుట్టంబు కెగ్గు బల్కకు మెపుడున్
కోపించు రాజు గొల్వకు
పాపపు దేశంబు బోకు పాటుర సుమతీ!

ఇప్పటికీ లభ్యమౌతున్న ఒక తాళపత్రప్రతిలోని పాఠం ఇది. పద్యం సరళంగా 'సుమతీశతకం'లోని పద్యాల ధారకు, భాషకు సరిపోయి చదవడానికి సాఫీగా సాగిపోతుంది. మధ్యలో ఎక్కడా నట్టు పడదు. భావం సుబోధకమే! ఈ పాఠానికి బదులుగా ఇప్పుడు ముద్రణలో లభ్యమౌతున్న 'సుమతీశతకం' ప్రతులలో ఈ పద్యం ఈ క్రింది పాఠంతో కనపడుతుంది:

కం. రూపించి పలికి బొంకకు
ప్రాపగు చుట్టంబు నెగ్గు పలుకకు మదిలోఁ
గోపించు రాజు గొల్వకు
పాపపు దేశంబు సొరకు పదిలము సుమతీ!

మొదటి పాదంలోని భావం పూర్తిగా మార్చివేయబడింది. 'రూపించి పలికి' అబద్ధం చెప్పడం అంటే ఏమిటో అర్థం చెప్పుకోవడానికి కష్టపడాల్సిందే తప్ప సులభంగా అయ్యేది కాదు. కంటికి కనిపించే అందానికి ప్రాధాన్యతను ఇవ్వవద్దు అని ఉద్దేశించిన మాటలను ఇలా మార్చడం ఎందుకు జరిగిందనే ప్రశ్నకు సరైన సమాధానం దొరకదు. రెండవ పాదం చివరన 'మదిలో' అని అన్వయానికి సరిపోని అపపాఠం చేరింది. నాల్గవ పాదంలోనూ ఇదే విధమైన మార్పు చేయబడింది. 'చాలా కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది సుమా!' అనే అర్థంలోని 'పాటుర' అనే మాటకు బదులుగా 'జాగ్రత్త వహించు' అని అర్థాన్ని సూచించే 'పదిలము' అనే మాట చేరింది. పైన ఇచ్చినవి రెండు శతకాలలో నుండి రెండు ఉదాహరణలు మాత్రమే. రెండు శతకాలలోనూ ప్రసిద్ధమైన పద్యాలలో ఇటువంటి అపపాఠాలు మరికొన్ని ఉన్నాయి. తెలిసిన తరువాత వీటిని సరి చేయకుండా వదిలేసి కొనసాగించడం సరైనదేనా? అన్నది ఇప్పుడు బాధించే ఆలోచన.

○ **భట్టు వెంకటరావు**

'విమోచనం' అనడానికి బెరుకెందుకు?

ఈ 17 సెప్టెంబరును 'ప్రజాపాలన దినోత్సవంగా' నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. 2022 సెప్టెంబరు 17నుండి రెండు సంవత్సరాలు ఆజాదికా అమృతోత్సవాన్ని పురస్కరించుకొని విమోచనదినంగా ఉత్సవాలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. కేంద్ర హోంశాఖామంత్రి సికింద్రాబాదు పరేడు గ్రౌండులో 17 సెప్టెంబర్ విమోచనదినం సందర్భంగా గత సంవత్సరం వరకు అధికారికంగా ఉత్సవాలలో పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు రెండుసార్లు ఈ రోజును "జాతీయ సమైక్యతా దినంగా" రెండు సంవత్సరాలు నిర్వహించారు.

కేంద్ర హోంమంత్రిత్వశాఖ 12.03.2014 నాడు గెజిట్ నోటిఫికేషన్ ఇస్తూ, 17 సెప్టెంబరు నాడు విమోచన ఉత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహించుకోవాలని ఉత్తర్వులను జారీచేసింది (The Union Ministry of Home Affairs on this day issued a Gazette notification to celebrate 17th September, the day when erstwhile princely state of Hyderabad was acceded to Indian Union as Hyderabad Liberation Day every year). ఇంతవరకు ఈ రోజును విమోచనదినం, విలీనదినం, విద్రోహదినం అని ఉద్యమాల ముందు, ఉత్సవాల ముందు ప్రచారం జరిగేది. కేంద్రప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులలో విమోచన, విలీనం, రెండు పదాలూ ఉన్నాయి. 1999 నుండి జరగని ఉత్సవం చివరికి ఏదో పేరు మీద అధికారికంగా జరుగుతుందని కొంతవరకు ఆనాడు సంతృప్తి పొందారు. కానీ ఇప్పుడు రాష్ట్రంలో ఈ 17 సెప్టెంబరును "ప్రజాపాలన దినంగా" నిర్వహించాలని ఉత్తర్వులను జారీచేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. సికింద్రాబాదు పరేడు మైదానంలో కేంద్ర హోంశాఖామాత్యులు 'విమోచన'మని, మిగతా రాష్ట్రంలో ఇక్కడి ప్రభుత్వం "ప్రజాపాలన" అని ఉత్సవాలను నిర్వహించడం పరస్పర వైరుధ్యంగా ఉంటుంది. రాజ్యాంగబద్ధం కాదు.

నిజానికి, ఆ 17 సెప్టెంబర్ నాటికి ప్రజాపాలన లేదు. పోలీసు చర్య తరువాత, హైదరాబాదు సంస్థానం విమోచన పొందింది, భారతదేశంలో విలీనం అయింది. వెంటనే జె.ఎన్ చౌదరి, మిలిటరీ గవర్నర్ ఆఫ్ హైదరాబాద్ స్టేట్‌కు నియమించబడి 1949 వరకు ఉన్నారు. తరువాత ఎం.కె వెల్లోడిని భారత ప్రభుత్వం సి.ఎంగా నియమించింది. 1952లో బూర్గుల రామకృష్ణారావు ఎన్నికలలో గెలిచి ముఖ్యమంత్రి అయినాకనే ప్రజాపాలన మొదలయినట్టు లెక్క.

రాష్ట్ర భారతీయ జనతా పార్టీ 1998 సెప్టెంబర్ 17నాడు విమోచన స్వర్ణోత్సవాన్ని నిజాం కాలేజి గ్రౌండ్స్‌లో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఎల్‌కె అద్వానీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేలాదిమంది ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్యన సమరయోధులైన ప్రతి ఒక్కరి దగ్గరికి అద్వానీ స్వయంగాపోయి సన్మానం చేసినారు. కే.శే. వందేమాతరం రామచందర్‌రావు, నిజాం వాహనం పైన బాంబు విసిరిన పవార్ గారితో పాటు ఎంతోమంది స్వాతంత్ర సమర యోధులు హాజరైనారు. ప్రస్తుత హోంమంత్రి అమిత్ షా రెండు సంవత్సరాల క్రితం సికింద్రాబాదు పరేడు గ్రౌండులో విమోచన ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడంవల్ల ప్రజల కల నెరవేరింది. మహారాష్ట్రలో 2001లో, కర్ణాటకలో 2009లో 17 సెప్టెంబర్‌ను విమోచనదినంగా ఉత్తర్వులు జారీచేసి ఉత్సవాలను జరుపుతున్నారు. ఈ రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఇంకా తెలంగాణాలో విమోచన పదంపై మీమాంస కొనసాగడం విచారకరం.

> **ఈ 17 సెప్టెంబరును "ప్రజాపాలన దినంగా" నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. సికింద్రాబాదు పరేడు మైదానంలో కేంద్ర హోంశాఖామాత్యులు 'విమోచన'మని, మిగతా రాష్ట్రంలో ఇక్కడి ప్రభుత్వం "ప్రజాపాలన" అని ఉత్సవాలను నిర్వహించడం పరస్పర వైరుధ్యంగా ఉంటుంది. మహారాష్ట్రలో 2001లో, కర్ణాటకలో 2009లో 17 సెప్టెంబర్‌ను విమోచనదినంగా ఉత్తర్వులు జారీచేసి ఉత్సవాలను జరుపుతున్నారు. ఈ రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఇంకా తెలంగాణాలో విమోచన పదంపై మీమాంస కొనసాగడం విచారకరం.**



తెలంగాణా విమోచన కోసం హైదరాబాద్ సంస్థానంలోని ప్రతి గ్రామంలో పోరాటాలు జరిగినాయి. అతి సామాన్యులైన స్త్రీ పురుషులు ధృఢచిత్తులై సైనికులుగా పోరాడిన దృశ్యాలు, వారి త్యాగాలు అనన్యసామాన్యం. రాబోయే తరాలకు ఆనాటి అమర వీరుల చరిత్ర ప్రేరణదాయకం. గగుర్పాటు కలిగించే సాహసిక ఘట్టాలు ఎన్నో ఈ ఉద్యమ చరిత్రలో ప్రజ్వలించినాయి. ఈ జ్వాలనే పోలీసు చర్యకు సుగమమైన మార్గాన్ని ఏర్పాటు చేసింది. సమరయోధులు చిరస్మరణీయులు. వారు బలిదానం చేసిన స్థలాలు స్ఫూర్తినిచ్చే స్మృతి చిహ్నాలు. ఆనాడు పోరాటమే జరగకపోతే, హైదరాబాదు సంస్థానం ప్రత్యేక దేశంగా అవతరించిఉంటె, భారతదేశ పటమే ఛిద్రమై ఉండేది. ఇప్పుడు మనం చూస్తున్న "కాలుతున్న పూతోట"లలో భాగమయ్యేది. చరిత్రను స్మరించుకోవడం ఆత్మాభిమానానికి ప్రతీక. భారత ప్రభుత్వ ఉత్తర్వుల తరువాత మహారాష్ట్ర– కర్ణాటక మాదిరిగా అధికారికంగా విమోచన ఉత్సవాలను నిర్వహించి ఈ పోరాట ఘట్టాలను పాఠ్యాంశాలలో చేర్చాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా వరంగల్ జిల్లా బైరాన్‌పల్లిలో, పరకాలలో, వరంగల్ ఖిల్లా తదితర ప్రాంతాల్లో రజాకార్లు మారణహోమాన్ని సృష్టించారు. ఎన్నో గ్రామాలలో హైదరాబాదు సంస్థాన విమోచన కొరకు వేలాదిమంది రక్తతర్పణం చేశారు. అసలు హైదరాబాదు సంస్థానంలో బ్రిటీష్ వారికీ, నిజాంకు మధ్య జరిగిన ఒప్పందానికి వ్యతిరేకంగా 1800 సంవత్సరంలోనే పోరాటం పురుడు పోసుకుంది. ఈ పోరాటమే క్రమంగా స్వాతంత్ర సాధన వరకు కొనసాగింది. కుల వ్యవస్థ, భూస్వామ్య దోపిడీ, మాతృభాషా నిషేధం, మత మార్పిడులు, పేదరికంతో విలవిలలాడుతున్న జీవన విధానాలపైన, రాబందుల్లా పీక్కుతింటున్న అరాచక శక్తుల మీదా తమదైన పోరాటాన్ని ఎందరో మహనీయులు ఎంచుకున్నారు, ప్రాణత్యాగం చేసినారు. రాంజీ గోండ్ – కొమురం భీం తదితర గోండ్ వీరులు పోరాటం ప్రఖ్యాతిగాంచింది. 1857 జూలై 17న మౌల్వి అల్లాఉద్దిన్, తుర్రేబాజ్ ఖాన్ నాయకత్వంలో 500లకు పైగా ఉన్న "రోహిల్లా" దళం కోఠీలో గల బ్రిటిష్ ప్రెసిడెన్సీపై దాడిచేసింది. ఫలితంగా తుర్రేబాజ్ ఖాన్‌ను హతమార్చి శవాన్ని తలక్రిందులుగా వేలాడదీశారు. అల్లాఉద్దిన్ అండమాన్ జైల్లో 1884లో కన్ను మూశాడు. ఇతడే అక్కడి కారాగారంలో శిక్ష అనుభవించిన ఏకైక హైదరాబాదు ఖైదీ. నిద్రాణమైన జనంలో ఉద్వేగాన్ని నింపి ఉరకలెత్తించిన చైతన్యవంతుల పేర్లు ఎన్ని ప్రస్తుతించినా ఇంకా మిగిలిపోతాయి. భారతదేశం శరీరమైతే హైదరాబాదు సంస్థానం ఒక గుండె లాంటిదని అది వేరుగా ఉండిపోకూడదని నినదించిన ఇమ్రోజ్ పత్రికా సంపాదకుడు షోయబుల్లా ఖాన్‌ను రజాకార్లు 22.08.1948న దారుణంగా హత్యచేశారు. ఈ సంఘటన నెహ్రూ ప్రభుత్వాన్ని కదిలించింది. నిజాం పాలనకు వ్యతిరేకంగా రాస్తే చేతులు నరికేస్తాం అని రజాకర్ల నాయకుడు ఖాసిం రజ్వీ రంకెలేసినా షోయబ్ వెనుకడుగు వేయలేదు. మతసామరస్యాన్ని కాపాడడానికి విశ్వప్రయత్నం చేసాడు, ఎత్తిన కలాన్ని దించలేదు. 1931లో కాన్పూర్‌లో గణేష్ శంకర్ విద్యార్థి "ప్రతాప్" అనే పత్రికా సంపాదకున్ని మతవాద శక్తులు ఇలాగే పొట్టన పెట్టుకున్నాయి. సంపాదకులుగా ఉండి మత సామరస్యానికి, దేశ స్వాతంత్రం కోసం చనిపోయిన వారిలో ఒకరు ఉత్తరప్రదేశ్ వారైతే, రెండవవారు మన హైదరాబాదీయుడు. గణేష్ శంకర్ విద్యార్థి పేరిట అనేక పుస్తకాలు ప్రచురించబడ్డాయి. ప్రభుత్వం తరుపున ఆయన పేరిట కాలేజీలు స్మారక కట్టడాలు వెలిసినాయి. మన షోయబుల్లా ఖాన్ పేరు కనీసం మన పిల్లలు చదువుకోవడానికి పాఠ్యాంశాలలోనైనా చోటుకు నోచుకోలేదు. ట్యాంక్‌బండ్‌పైన ఆయన విగ్రహ ప్రతిష్ఠకు స్థలం దొరుకలేదు. హైదరాబాద్ సంస్థాన విమోచన చరిత్ర స్ఫూర్తికి అనుగుణంగా మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు ఏవిధంగానైతే అధికారికంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నాయో అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాలని, అందరు తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి అంకితం కావాలని ఆశిద్దాం.

■ **చెన్నమనేని విద్యాసాగరరావు**
మహారాష్ట్ర మాజీ గవర్నర్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
ఆదివారం 15 సెప్టెంబరు 2024







దేవాదుల సొరంగం

- అబ్బురపరిచే కట్టడాలకు నిలయం ఓరుగల్లు
- కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఎన్నో విశిష్ట నిర్మాణాలు
- వంతెనలు, భారీ ప్రాజెక్టుల వరకు అన్నింటిలోనూ ఇంజనీర్లే కీలకం
- దేవాదుల ప్రాజెక్టులో 49.6కి.మీ.ల టన్నెల్ ఓ రికార్డు
- 506 మీటర్లపైకి కొండపోచమ్మ వరకు నీటిని లిఫ్ట్ చేసేలా కాళేశ్వరం డిజైన్
- చెక్కుచెదరని నిజాంకాలం నాటి ఇచ్ఛంపల్లి ప్రాజెక్టు పునాదులు
- మేడారం జంపన్నవాగుపై 37రోజుల్లో వంతెన నిర్మాణం మరో రికార్డు
- ఇప్పటికీ అంతుచిక్కని కాకతీయుల నాటి కళా నైపుణ్యం

మన మేధస్సు.. అద్భుతం





నేటికీ చెక్కుచెదరని ఇచ్ఛంపల్లి ప్రాజెక్టు పునాదులు

5 నేడు ఇంజనీర్స్ డే



కాళేశ్వరం ప్రాజెక్టు

ప్రపంచ వారసత్వ సంపదగా వెలుగొందుతున్న రామప్ప దేవాలయం

Sunday Special

కాకతీయుల కాలమైనా.. ప్రస్తుతమైనా.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్నో అద్భుత కట్టడాలకు నిలయం. గొలుసు కట్టు చెరువుల నుంచి నీటిని ఎత్తిపోసే నేటి తరం ప్రాజెక్టుల వరకు అన్నింటిలోనూ అద్భుతాలే. వీటికి తోడు ఇప్పటికీ అంతుచిక్కని ఎన్నో రహస్యాల సమాహారమైన ఆలయాలు ఉన్నాయి. ఓ వైపు భూగర్భంలో అనకొండల్లా కిలోమీటర్ల కొద్ది సాగిపోయే సొరంగాలు.. మరోవైపు శిల్పకళా శోభిత ఆలయాల కట్టడాలను చూస్తే కళ్లు చెదురుతాయి. ఆహా.. ఈ ఇంజనీరింగ్ నైపుణ్యం అమోఘం అనడం ఖాయం. కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక గొలుసుకట్టు చెరువులు, సాండ్ బాక్స్ టెక్నాలజీ ప్రపంచాన్నే అబ్బుర పరిస్తే.. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన టన్నెల్‌తో పాటు 624 అడుగుల ఎత్తుకు కాళేశ్వర జలాలను తరలించే ఇంజనీరింగ్ డిజైన్‌ను మహాద్భుతంగా అభివర్ణిస్తున్నారు. మేడారంలోని జంపన్నవాగుపై 37రోజుల వ్యవధిలో నిర్మించిన వంతెనకు కితాబివ్వని వారుండరు. వందేళ్లకు ముందెప్పుడో నిర్మించిన ఇచ్ఛంపల్లి ప్రాజెక్టు పునాదులు ఇప్పటికీ చెక్కు చెదరకుండా నిలవటం నాటి మన ఇంజనీర్ల దూరదృష్టికి నిదర్శనం. ఇలా ఎన్నో విశిష్ట కట్టడాల సమాహారమైన ఓరుగల్లు నిర్మాణాల్లో ఇంజనీరింగ్ నిపుణుల నైపుణ్యం చెక్కుచెదరనిది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని చేరుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు, సెప్టెంబరు 14: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వర్ధన్నపేట నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమం సమావేశం పున్నేలు సత్యం గార్డెన్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ సభ్యత్వ ప్రముఖ్ మల్లాడి తిరుపతిరెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ, మండలస్థాయిల్లో ప్రజాప్రతినిధులను గెలిపించుకుంటేనే పార్టీ బలం పెరుగుతుందన్నారు. సభ్యత్వ నమోదును అన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలన్నారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధిలో ప్రజాసంక్షేమంలో ప్రథమ స్థానంలో మోదీ ప్రభుత్వం నిలుపుతోందన్నారు. కార్యకర్తలంతా కష్టపడి సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదు కోసం 8800002024 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి మీ వివరాలు పొందుపరిచి బీజేపీ సభ్యులు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జి పాపారావు, జిల్లా సభ్యత్వ సహప్రముఖ్ కుసుమ సతీష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, రాష్ట్ర నాయకుడు రంజిత్‌కుమార్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు బన్న ప్రభాకర్, కాజీపేట దర్గా సొసైటీ అధ్యక్షుడు వనం రెడ్డి, మల్లారెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ జక్కు రమేష్‌గౌడ్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏకాంతంగౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సునీత, మజ్జిగ జయపాల్, జడ సతీష్, వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు పెద్దూరి రాజు, మండల, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బల్దియాలో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

- దరఖాస్తుల పరిశీలనకు ముందుకు రాని ప్రజలు
- అవగాహన కల్పించడంలో బల్దియా విఫలం
- ఇప్పటివరకు కేవలం 375 అప్లికేషన్లు పరిశీలన
- మరో లక్షకుపైగా పెండింగ్
- తలలు పట్టుకుంటున్న అధికారులు

ప్రచార వైఫల్యంతోనే..

నత్తనడకన ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మునిసిపాలిటీలలో ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల అనుమానాల నివృత్తి, దరఖాస్తుల స్వీకరణ నత్తనడకన సాగుతోంది. మునిసిపాలిటీల వారిగా ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్‌లలో దరఖాస్తుదారులు కనిపించకపోవడంతో అధికారులు పనిలేకకూర్చుంటున్నారు. రోజుకు 20 నుంచి 30 మంది దరఖాస్తుదారుల కోసం ఇద్దరు అధికారులు నిరంతరంగా పని చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్‌పై బల్దియా అధికారులు ప్రజలకు ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలున్నాయి. కనీసం ప్రత్యేకంగా కాలనీలలో జీపులకు మైకులను అమర్చి ప్రజలకు అవగాహన కల్పించలేదనే విమర్శలు వెలువడుతున్నాయి.

ఎల్ఆర్ఎస్‌లపై దృష్టి

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్)పై దృష్టి సారించింది. ప్లాట్లు, వ్యవసాయ భూములు క్రమబద్ధీకరించేందుకు గతంలో ప్రజలు దరఖాస్తులు చేసుకోగా, ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కోసం ముందుకొచ్చింది. మూడు మాసాలలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికీ బల్దియాలో ఒక్కశాతం కూడా పూర్తి కాకపోవడంతో సిబ్బంది నిస్సహాయస్థితిలో పని చేస్తున్నారు.

375 దరఖాస్తుల పరిశీలన

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల పరిధిలో భూములు క్రమబద్ధీకరించుకునేందుకు 2020 ఆగస్టు 26వరకు 1,09,689 మంది దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో పరిశీలనకు నోచుకోలేదు. దీంతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల పరిశీలనకు గత ఆగస్టు నెల 24 నుంచి బల్దియాలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసింది. ఎల్ఆర్ఎస్ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న అర్జిదారులకు మెసేజ్, ఫోన్‌ద్వారా పిలిపించి వారి అనుమానాలు నివృత్తి చేస్తున్నారు. అయితే ఈ 20 రోజుల్లో 375 మంది దరఖాస్తుదారులు వచ్చి భూముల సమస్యను పరిష్కరించే పనిలో పడ్డారు. గతంలో దరఖాస్తు చేసుకున్న రశీదు లేదా ఫోన్ నెంబర్ ద్వారా హెల్ప్‌డెస్క్‌లో పని చేస్తున్న అధికారులు ప్రాంతాల వారిగా పనిచేస్తున్న అధికారులు పేర్లు, ఫోన్ నెంబర్లు ఇస్తున్నారు.

బల్దియా అవగాహన రాహిత్యం

ముఖ్యమంత్రి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన అధికారులు పరిష్కరించాలని సమీక్షా సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లలో ఆదేశించినా వరంగల్ బల్దియా అధికారులు నిద్రమత్తు నటిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బల్దియా కార్యాలయం, కలెక్టర్ కార్యాలయాల్లో రెండు చోట్ల రెండు ఫ్లెక్సీలు తప్ప.. ఎక్కడా ప్రజలకు అవగాహన కల్పించపోవడంతో దరఖాస్తుదారులు రాలేకపోతున్నారని చెప్పుకొస్తున్నారు. చాలామందికి దరఖాస్తుదారులకు ఇప్పటివరకు ఎల్ఆర్ఎస్ అంటే ఏవిటో కూడా తెలియని స్థితిలో ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వం రూ.కోట్లు వసూలు చేసి కనీసం అవగాహన కల్పించకపోవడంతోపాటు ప్రచారం చేయకపోవడంతో ప్రజలు బల్దియా తీరుపై నిరాశ చెందుతున్నారు. గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్‌లలో ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తే లక్ష్యం చేరుకోవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

మూడు శాఖల బృందాలు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు మూడు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. బల్దియా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి ఉన్నతాధికారులను 12 టీములుగా చేశారు. 7 హనుమకొండ, 5 వరంగల్ ప్రాంతంలో పనిచేస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న భూమి పట్టా, ప్రభుత్వ భూమా? లేక చెరువు శిఖం, కెనాల్ కింద ఉందా? అని అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేసి దరఖాస్తును ప్రత్యేక యాప్ ద్వారా ఉన్నతాధికారులకు చేరవేస్తారు. కానీ ఎల్ఆర్ఎస్ యాప్ తరచుగా మొండికేయడంతో అధికారులు ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు.

ప్రజల్లో అవగాహన కల్పించాలి

- సముంద్రాల శ్రీకాంత్, టౌన్‌ప్లానింగ్ హెల్ప్‌డెస్క్ అధికారి

బల్దియాలో 2020 ఆగస్టు 26 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 1,09,689 వచ్చాయి. ప్రజలు రూ.1000 చలానా చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికీ చాలామందికి హెల్త్‌డెస్క్ ఏర్పాటు చేసినట్టు తెలియక పోవడం వల్ల బల్దియాకు రాలేకపోతున్నారు. ప్రధానంగా ఎల్ఆర్ఎస్ ద్వారా భూములను క్రమబద్ధీకరించుకునేందుకు నగరంలో ప్రతీ కాలనీలో అవగాహన కల్పించాలి. విషయం ప్రజల దృష్టికి చేరితేనే లక్ష్యం పూర్తి చేయవచ్చు.

కాజీపేట మీదుగా నాగపూర్‌కు 'వందేభారత్'

కాజీపేట, సెప్టెంబరు 14: ఈ నెల 16 నుంచి కాజీపేట మీదుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడవనుంది. ఇందుకు రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నాగ్‌పూర్-సికింద్రాబాద్‌ల మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20101) రైలు ఈ నెల 16న నాగ్‌పూర్‌లో ఉదయం 5 గంటలకు బయలుదేరి కాజీపేట 10.04 నిమిషాలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్‌కు 12.15 నిమిషాలకు చేరుకుంటుంది. తిరిగి సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 3.20 నిమిషాలకు చేరుకుంటుంది. రాత్రి 8.20 నిమిషాలకు నాగ్‌పూర్‌కు చేరుకుంటుంది. ఈ రైలు సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్లార్షా, రామగుండం, కాజీపేట రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినయభాస్కర్

వీవోఏల వేతనం రూ.25వేలకు పెంచాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్

రాంనగర్, సెప్టెంబరు 14: వీవోఏల వేతనం రూ.25వేలకు పెంచాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వీవోఏల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వినయభాస్కర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళా సంఘాలకు, ప్రభుత్వ అధికారులకు, ప్రజలకు అనుసంధానంగా విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ (వీవోఏ) పని చేస్తున్నారని ఆయన తెలిపారు. వీవోఏల శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదన్నారు. గతంలో ప్రస్తుత మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు వీవోఏలకు రూ.25వేల వేతనం ఇవ్వాలని అన్నారని, ఇప్పుడు వారు మాట నిలబెట్టుకోవాలన్నారు. న్యాయమైన సమస్యల సాధనకు వీవోఏలు ఉద్యమించాలని, వారికి తాము అండగా ఉంటామని వినయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ గౌరవ అధ్యక్షులు రూప్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షుడు మారిపెల్లి మాధవి, ప్రధాన కార్యదర్శి మచ్చేందర్, కోశాధికారి తిరుపతి, నేతలు నాయిని రవి, భిక్షపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకున్న స్కూళ్లకు చేయూతనందించాలి

- హసన్‌పర్తి విద్యార్థులతో కలెక్టర్ ప్రావీణ్య
- సంగారెడ్డి ఎస్పీ రూపేష్ కృషితో పాఠశాల, కళాశాలకు విరాళాలు

హసన్‌పర్తి, సెప్టెంబరు 14: మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు జీవితంలో రాణించి చదువుకున్న పాఠశాలకు చేయూతనందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. హసన్‌పర్తి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ కృషితో శనివారం ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలకు విరివిగా విరాళాలు వచ్చాయి. ఈక్రమంలో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల విద్యార్థులకు కలెక్టర్ ప్రావీణ్య రూ.7లక్షల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. అనంతరం ప్రావీణ్య మాట్లాడుతూ.. పాఠశాల, కళాశాల అభివృద్ధి కోసం సంగారెడ్డి ఎస్పీ చెన్నూరు రూపేష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రూపేష్‌ను ప్రతీ విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ.. తాను సామాన్య కుటుంబం నుంచి వచ్చి కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. విద్యార్థులు కూడా చదువులో రాణించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్‌ను పూర్వ ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత సముద్రాల రాంనర్సింహాచారి సత్కరించి అభినందించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ చెన్నూరి రూపేష్, నర్సింహాచారి, దాతలు, కళాశాల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బందితోపాటు హసన్‌పర్తి పోలీసులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యకమంలో తహసీల్దారు చల్ల ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్, ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులు అనుమాండ్ల విద్యాసాగర్, ఆకుతోట శాంతారాం కర్ణ, వెంకన్న, శీలం యాదగిరి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఎస్పీ రూపేష్ చొరవతో..

తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఏదైనా చేయాలనే సదుద్దేశంతో సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ ప్రభుత్వ పాఠశాల, కళాశాలను దత్తత తీసుకున్నారు. విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన కోసం వనరులను సమకూర్చుతానని హామీ ఇచ్చారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త సత్యనారాయణ రూ.18లక్షలు, అలాగే రూపేష్ మిత్రుడు, హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ ఉదయ్ రూ.7లక్షలు కళాశాలకు అందజేశారు. చెక్కులను సభాస్థలంలోనే కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ సునితకు అందజేశారు. వీరి స్ఫూర్తికి స్పందించిన కలెక్టర్.. అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల ద్వారా పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పన కోసం రూ.10లక్షల నిధులను మంజూరు చేశారు.



చెక్కును అందజేస్తున్న ప్రముఖ వ్యాపారవేత్త

పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా

- సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణత తప్పనిసరి
- డీన్ మనోహర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 14: కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లకు పీజీ అభ్యర్థులంతా ఇక నుంచి తప్పనిసరిగా యూజీసీ సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణను తప్పనిసరి చేయనుంది. దేశవ్యాప్తంగా న్యూఢిల్లీలోని యూని వర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) పీహెచ్‌డీ అడ్మిషన్లకు జాతీయ అత్యున్నత సంస్థ నిర్వహించే నెట్ పరీక్షలు తప్పనిసరి చేసింది. దేశవ్యాప్తంగా యూజీసీ గుర్తింపు పొందిన వర్సిటీలన్నింటికీ మార్గదర్శకాలను రూపొందించింది. తమ ఆదేశాల మేరకు అన్ని వర్సిటీలు పీహెచ్‌డీ అడ్మిషన్లలో ప్రత్యేక ప్రవేశ పరీక్షలు రద్దు చేసి సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణత మేరకు సీట్లు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. యూజీసీ మార్గదర్శకాల నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులు విధి విధానాలు రూపొందించేందుకు కేయూ సోషల్‌సైన్స్ డీన్ తాళ్లపల్లి మనోహర్, చైర్మన్‌గా జియాలజీ విభాగా. దిపతి మల్లికార్జున్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం డీన్ ఎం సదానందం, అకాడమిక్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలా శంకర్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. కమిటీ ఇప్పటికే యూజీసీ నిబంధనలు ఏమీ చెబుతున్నాయి. మార్గదర్శకాలు ఏవిధంగా రూపొందించాలనే అంశంపై చర్చించింది.

పీహెచ్‌డీ ఎంట్రెన్స్ రద్దు

కేయూ ప్రత్యేకంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఎలాంటి ఎంట్రెన్స్ నిర్వహించదు. జాతీయ స్థాయి జేఆర్ఎఫ్ అభ్యర్థులకు అన్ని విభాగాల్లో మొట్టమొదటి ప్రాధాన్యత కల్పించి అడ్మిషన్లు కల్పిస్తారు. జేఆర్ఎఫ్ తర్వాత నెట్ ఉత్తీర్ణతలో వచ్చిన మెరిట్ మేరకు అడ్మిషన్లు కల్పిస్తారు. ఏడాదికి రెండు దఫాలుగా జాతీయస్థాయిలో నెట్ పరీక్షలు జరుగుతాయి. నెట్ పరీక్షల ఫలితాలు రాగానే అర్హులైన అభ్యర్థులు నేరుగా దరఖాస్తులు చేసుకుంటే అడ్మిషన్లు కల్పించే వీలుంది. అభ్యర్థులు ప్రత్యేకంగా పీహెచ్‌డీ నోటిఫికేషన్‌కు ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. నెట్ పాసైన వెంటనే అడ్మిషన్లు పొందవచ్చు.

జేఆర్ఎఫ్, నెట్‌కు కుస్తీ పట్టాల్సిందే..

జాతీయస్థాయిలో ప్రతీ సబ్జెక్టులో నెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇంగ్లిష్, హిందీ భాషల్లో రెండు పేపర్లుంటాయి. మొదటి పేపర్ జనరల్ నాలెడ్జ్, కంప్యూటర్ పరిజ్ఞానం, ప్రాథమిక గణిత సామర్థ్యాలు, లోక పరిజ్ఞాన అంశాలుంటాయి. మొదటి పేపర్‌లో అర్హులైన అభ్యర్థుల రెండో పేపర్‌ను వాల్యూయేషన్ చేస్తారు. రెండో పేపర్ మొత్తం సంబంధిత అభ్యర్థి ఎంచుకున్న అంశంలో ఉంటుంది. సైన్స్ అభ్యర్థులకు సీఎస్ఐఆర్ అని, ఆర్ట్స్, సోషల్ సైన్స్ ఇతర సబ్జెక్టుల అభ్యర్థులందరికీ నెట్ పరీక్షలని పిలుస్తారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో ఏడాదికి రెండు దఫాలుగా యూజీసీ సీఎస్ఐఆర్, నెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. పీజీ ఫైనలియర్‌లో ఉన్న అభ్యర్థులను కూడా నెట్, సీఎస్ఐఆర్ ప్రవేశ పరీక్షలకు అనుమతిస్తారు. జేఆర్ఎఫ్‌కు వయసు పరిమితి విధించారు. నెట్ ఉత్తీర్ణతకు మాత్రం ఎలాంటి వయసు పరిమితి ఉండదు. ఉత్తీర్ణులయ్యే వరకు పరీక్షలు రాసే వెసులుబాటు కల్పించారు. నెట్ పరీక్షల కోసం కేయూలో ఉచితంగా కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కొత్త వీసీ రాగానే నోటిఫికేషన్

యూజీసీ నిబంధనల మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం రూపొందించిన విధి విధానాల నోటిఫికేషన్ కొత్త వీసీ రాగానే జారీ కానుంది. యూజీసీ నిబంధనలన్నీ ఉన్నది ఉన్నట్లుగా అడాప్ట్ చేసుకునే అధికారం వీసీకి ఉంది. రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు నూతన వీసీలను నియమిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. వీసీలు రాగానే యూజీసీ పీహెచ్‌డీ అడ్మిషన్లు ప్రక్రియకు అధికారికంగా పచ్చజెండా ఊపుతారని వర్సిటీ అధికార వర్గాలు వెల్లడించాయి.

పురుగుల మందు తాగిన వృద్ధురాలి మృతి

డోర్నకల్, సెప్టెంబరు 14 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన డోర్నకల్‌లోని లచ్యాతండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. లచ్యాతండాకు చెందిన తేజావత్ బీబు (60) సుభాష్ వీధిలో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి లింగంపల్లి రాజేష్ ఇంటిలో పనిచేస్తుంది. ఈనెల 13న రాజేష్ ఇంటిలో రోజువారి పనులు ముగించుకుని తన ఇంటికి వెళ్లింది. అదేరోజు సాయంత్రం మళ్లీ రాజేష్ ఇంటికి రాగా ఇంట్లో ఉన్న రూ.15 వేలు నగదు పోయిందని, ఆమె తీసిందని ఆవేశంతో రాజేష్, అతడి భార్య అమల బీబుపై చేయి చేసుకున్నారు. మనస్తాపం చెందిన బీబు ఇంటికి వెళ్లి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంటికి వచ్చిన ఆమె కుమారుడు రమేష్ బీబును చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ బీబు మృతి చెందింది. మృతురాలి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిన్నెల వాగులో గల్లంతైన వ్యక్తి మృతి

బయ్యారం, సెప్టెంబరు 14 : వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నామాల పాడు పంచాయతీ ధర్మాపురానికి చెందిన పూనెం వెంకన్న (45) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని భార్య శృతితో చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. అనంతరం ఎంతకు తిరిగి రాకపోవ డంతో కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాలు వెతక సాగారు. ఈ క్రమంలోనే గ్రామ సమీపంలోని జిన్నెల వాగు ఒడ్డున వెంకన్నకు సంబంధించిన చెప్పులు, టవల్ కనిపించడంతో ప్రమాదవశాత్తు వెంకన్న వాగులో గల్లంతై ఉంటాడనే అనుమానంతో రెండురోజుల పాటు గజ ఈతగాళ్లతో వెతికించారు. శనివారం వెంకన్న మృతదేహం లభ్యమైంది. మృతురాలి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.



కుడా చైర్మన్ వినతిపత్రం అందిస్తున్న కళాకారులు

కళాకారులకు గుర్తింపు ఇవ్వాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: హనుమకొండలో ప్రారంభమయ్యే కాళోజీ కళాక్షేత్రంలో కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాసంస్థలకు ఉచితంగా ఇవ్వాలని తెలంగాణ నాటక కళా సమితి నాయకులు, కళాకారులు శనివారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కుడా కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆడిటోరియంలో కళాకారులు మేకప్ చేసుకునేందుకు ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్, స్టేజీ డెకరేషన్, గ్రీన్‌రూమ్, రిహార్సల్స్ గదులు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, కాకతీయ నాటక కళాపరిషత్ జిల్లా అధ్యక్షుడు రాదారపు సంజీవరెడ్డి, కళాకారులు చక్రపాణి, బాలాజీ, రమేష్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, బిక్షపతి, శంకర్, గణేశ్‌తో పాటు కళాకారులు పాల్గొన్నారు.

నిమజ్జన వేళ.. మద్యం షాపులు బంద్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 14: గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఈనెల 16వ తేదీ ఉదయం 6గంటల నుంచి 17వ తేదీ ఉదయం 6గంటల వరకు మద్యం విక్రయాలు నిలిపివేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఒక ప్రకటనలో సూచించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా పూర్తి చేసేందుకు మద్యం షాపులు బంద్ చేయాలన్నారు. మద్యం సరఫరా చేసే బార్‌లు, క్లబ్‌లు, హోటళ్లు మూసివేయాలని అంబర్ కిషోర్‌ఝూ సూచించారు. ఎవరైనా మద్యం షాపులు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు ఆకాశవాణిలో ఎంపీ కావ్యతో ముఖాముఖి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: వరంగల్ ఆకాశవాణి ఎఫ్ఎం బ్యాండ్ 103.5 మెగా హెడ్జ్‌పై ఆదివారం ఉదయం 7.15నిమిషాలకు వరంగల్ ఎంపీ కడియం కావ్యతో ముఖాముఖి కార్యక్రమం ప్రసారం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు ఇల్లెందుల రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడియం కావ్య జీవన ప్రయాణంలో అనేక విషయాలు.. అనే అంశంపై ప్రసారం ప్రారంభం అవుతుందని తెలిపారు.

తైక్వాండోలో శశాంక్‌కు కాంస్యం

న్యూశాయంపేట, సెప్టెంబరు 14: తమిళనాడులో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో న్యూశాయంపేటకు చెందిన గుజ్జేటి త్యాగరాజు కుమారుడు శశాంక్ కాంస్య పతకం సాధించాడు. శనివారం టోర్నీ నిర్వాహకుల నుంచి శశాంక్ కాంస్య పతకం అందుకున్నాడు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శశాంక్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ కోచ్ వీ నరసింహ పర్యవేక్షణలో 6 నెలలు శిక్షణ తీసుకున్నాడు.



నిర్వాహకుల నుంచి కాంస్య పతకం తీసుకుంటున్న విద్యార్థి శశాంక్

మన మేధస్సు.. అద్భుతం

- అబ్బురపరిచే కట్టడాలకు నిలయం ఓరుగల్లు
- కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఎన్నో విశిష్ట నిర్మాణాలు
- వంతెనల నుంచి భారీ ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ ఇంజనీర్లే కీలకం
- నేడు ఇంజనీర్స్ డే

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కళ్లు చెదిరే ఎన్నో కట్టడాలకు నెలవు ఉమ్మడి వరంగల్ జిల్లా. కాకతీయుల కాలం నాటి గొలుసు కట్టు చెరువుల నుంచి ఈ తరం వారు నిర్మించిన ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ అద్భుతాలే. అంతేకాదు ప్రపంచాన్ని సైతం అబ్బురపరిచే ఆలయాల నిర్మాణం, దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన టన్నెల్ నిర్మాణంతో పాటు 624 అడుగుల ఎత్తుకు కాళేశ్వర జలాలను తరలించే ఇంజనీరింగ్ డిజైన్‌ను మహా అద్భుతంగా చెబుతున్నారు. మేడారంలోని జంపన్నవాగుపై 37రోజుల వ్యవధిలో నిర్మించిన వంతెనకు కితాబివ్వని వారుండరు. వందేళ్లకు ముందెప్పుడో నిర్మించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు ఇప్పటికి చెక్కు చెదరకుండా నిలవటం ఆనాటి మన ఇంజనీర్ల దూరదృష్టికి నిదర్శనం. అంతేకాదు కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక గొలుసుకట్టు చెరువులు, సాండ్ బాక్స్ టెక్నాలెజీ ప్రపంచాన్నే అబ్బుర పరిచింది.

అసియాలోనే అతిపెద్ద టన్నెల్

ఉమ్మడి వరంగల్ జిల్లాకు వరప్రదాయనిగా భావించే దేవాదుల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఓ అద్భుతంగా చెబుతారు. 2003లోనే మన ఇంజనీర్లు రూపొందించిన దేవాదుల ఎత్తిపోతల పథకానికి అసియాలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా పేరుంది. మూడు దశలుగా విభజించి నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏడాదంతా నీటిని ఎత్తిపోసేలా డిజైన్ చేశారు. సుమారు 6లక్షల ఎకరాలకు సాగు నీరందించే ఈ దేవాదుల ప్రాజెక్టులో భాగంగా మూడవ దశలో టన్నెల్‌ను నిర్మించారు. ఈ అతిపెద్ద సొరంగాన్ని ములుగు జిల్లా జాకారం నుంచి హనుమకొండ జిల్లా దేవన్నపేట వరకు 49.6కిలో మీటర్ల వరకు నిర్మించారు. ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటూ వందలాది మంది ఇంజనీర్ల కృషితో విజయవంతంగా సుదీర్ఘకాలం పాటు టన్నెల్ నిర్మాణం సాగింది. ఈ సొరంగం నుంచి దేవాదుల ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను తరలించనున్నారు. దేవన్నపేట రిజర్వాయర్ వద్ద నిర్మించిన అతిపెద్ద సర్జ్‌పూల్‌ను 25మీటర్ల డయాతో 135మీటర్ల లోతున్న బావితరహాలో నిర్మించగా, 141 మీటర్ల లోతులో ఏర్పాటు చేసిన పంపుహౌస్ కూడా ఓ రికార్డే. ఇంత పెద్ద సొరంగం నిర్మాణాన్ని డిజైన్ చేసిన ఇంజనీర్ల ప్రతిభను ప్రశంసించని వారు లేరు. టన్నెల్ పనులు ఆలస్యమైనా ఇంత పెద్ద సొరంగాన్ని తవ్వి గోదావరి జలాలను తరలించటం సాధారణ విషయం కాదనే చర్చ ఉంది. ఇందులో వినియోగించిన యంత్రాలు విదేశీవే అయినప్పటికి మేధస్సు మాత్రం మన ఇంజనీర్లదే కావడం విశేషం.

ఇచ్చంపల్లి... అచ్చాహై..

నిజాం కాలంలోనే అప్పటి హైదరాబాద్ రాష్ట్రంతో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్రల సాగు, తాగు నీరు, విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై ఈ భారీ ప్రాజెక్టుకు నిజాం సర్కారు శ్రీకారం చుట్టింది. 1860లోనే ఫ్రెంచ్ దేశానికి చెందిన 30మంది ఇంజనీర్ల సహకారంతో హైదరాబాద్ ఇంజనీర్లతోపాటు 3వేల మందికి పైగా కూలీలు ఈ ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ప్లేగు వ్యాధి వ్యాప్తి చెంది పనులు చేస్తున్న 20ఫ్రెంచ్ ఇంజనీర్లు, 2వేల మందికి పైగా కూలీలు మృత్యువాత పడ్డారు. దీంతో ప్రాజెక్టు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. అయితే వందేళ్లు దాటిన ఇప్పటికి ఇచ్చంపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న నాటి కట్టడాలు చెక్కుచెదరలేదు. గోదావరిలో రాళ్లతో నిర్మించిన తాత్కాలిక రోడ్డు ఇంకా పటిష్ఠంగానే ఉంది. ఛత్తీస్‌గఢ్ వైపు చేపట్టిన బండ్ ఇంకా బలీయంగా కనిపిస్తుందంటే నాటి ఇంజనీరింగ్ తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



మేడారం జంపన్న వాగుపై నిర్మించిన జంట వంతెనలు

జంపన్నవాగుపై వంతెన ఓ అద్భుతం..

మేడారం జాతరలో 2002కు ముందు జంపన్నవాగుపై ఎలాంటి వంతెనలు లేవు. దీంతో భక్తులు వాగు దాటి జాతరకు వచ్చేవారు. తాత్కాలికంగా పైపుల అమర్చి, వాటిపై ఇసుక బస్తాలను వేసి రోడ్డు వేసేవారు. అయితే 2002లో టీడీపీ హయాంలో అప్పటి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి రూ.1.89కోట్లతో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో నక్సలైట్ల నుంచి బెదిరింపులు వచ్చినా తట్టుకుని ఇంజనీర్లు మేడారం అడవుల్లోనే మకాం వేసి 37రోజుల్లో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. అతితక్కువ కాలంలో ప్రతికూల పరిస్థితుల్లో ఇంజనీర్లు తమ ప్రతిభ చాటారు. 2014లో మరో వంతెనను ఇంజనీర్ల చాలెంజ్‌గా తీసుకుని దాన్ని కూడా 37రోజుల్లోనే పూర్తి చేసి మొదటి వంతెన రికార్డును సమం చేశారు. మన ఇంజనీర్ల కృషితో నిర్మాణమైన జోడు వంతెనలు మహాజాతరకు వన్నె తెస్తున్నాయి.

నేడు ఇంజనీర్స్ డే

ఏటా సెప్టెంబరు 15న ఇంజనీర్స్ డే జరుపుకొంటారు. తొలి ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కర్నాటకలోని ముద్దెనహళ్లిలో 1861 సెప్టెంబరు 16న జన్మించారు. మైసూరు దివాన్‌గా 1912 నుంచి 1919 వరకు పని చేశారు. దేశంలో అనేక నదులపై వంతెనలు, ఆనకట్టలను నిర్మించి నీటిపారుదల, తాగునీరు పథకాల ద్వారా జలవనరులను సద్వినియోగానికి కృషిచేసిన ఆయనకు కర్ణాటకలోని కృష్ణరాజ సాగర్ ఆనకట్ట నిర్మాణం పేరు తెచ్చింది. ఇక ఆయన హైదరాబాద్ డ్రెయినేజీ వ్యవస్థకు రూపకల్పన చేశారు. విశాఖపట్నం పోర్టు సముద్రం వల్ల కోతకు గురికాకుండా చేయగలిగారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గౌరవిస్తూ ఏటా ఆయన జయంతి రోజున ఇంజనీర్స్‌డేగా జరుపుకొంటున్నారు.

ప్రపంచంలోనే గొప్ప డిజైన్ కాళేశ్వరం సొంతం

కాళేశ్వరం ప్రాజెక్టు ఓ అద్భుత నిర్మాణం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తెలంగాణ ఇంజనీర్ల నైపుణ్యం.. మేధస్సు స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో ఉన్న ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టును తెలంగాణ ఇంజనీర్లు రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తున్న ప్రాణహిత నది నీటిని మళ్లించేలా ఈ రీ డిజైన్ జరిగింది. సముద్ర మట్టానికి మేడిగడ్డ 100 మీటర్ల ఎత్తులో ఇది ఉండగా.. ఇక్కడి నుంచి 624మీటర్ల ఎత్తులో ఉన్న కొండపోచమ్మ సాగర్ వరకు నీటిని ఎత్తిపోయాలి. అంటే సుమారుగా అర కిలో మీటర్‌కు పైగా ఎత్తుకు నీటిని ఎత్తిపోసేలా కాళేశ్వరం ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఇది సాగునీటిరంగంలోనే ఓ గొప్ప ఆవిష్కరణగా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఇటీవల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపాలు, ఇతర కారణాలపై ఆరోపణలు, విమర్శలు ఉన్నా మన ఇంజనీర్ల పనితీరు మాత్రం అద్భుతమనే చర్చ ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఓ సవాల్‌గా తీసుకున్న ఇంజనీర్లు ప్రాజెక్టు పూర్తి చేయటమే లక్ష్యంగా కుటుంబాలను కూడా వదిలి పనిచేశారు. ఎండ, వాన, చలి, రాత్రి, పగలు అనేది లేకుండా మూడు షిఫ్టుల్లో పనులు చేశారు. ఇంటి వద్ద ఎవరికైనా అనారోగ్యం వచ్చినా 'ఎలాగోలా అడ్జెస్ట్ చేసుకోండి. ఇక్కడ పని బాగా ఉంది. అర్థం చేసుకోండి' అంటూ తమ వారికి సర్దిచెప్పుకొన్న సందర్భాలు అనేకం ఉన్నాయని ఇంజనీర్లు గుర్తు చేసుకుంటున్నారు. మేధస్సు మాత్రమే కాదు వారి అంకుఠిత దీక్ష కూడా అద్భుతమేనని మన్ననలు అందుకున్నారు.

కాకతీయ ఇంజనీరింగ్ సూపర్...

ఇసుక పునాదులు.. నీటిపై తేలియాడే ఇటుకలు.. భూకంపాలను తట్టుకునేలా శాండ్‌బాక్స్ సాంకేతికతతో రామప్ప ఆలయాన్ని నిర్మించారు. ఇప్పటి ఇంజనీర్లకు కూడా అంతు చిక్కని సాంకేతికత కాకతీయులది. ప్రపంచవ్యాప్త వారసత్వ గుర్తింపు పొందిన రామప్ప ఆలయ నిర్మాణం మహా అద్భుతంగా ఇంజనీర్లు పేర్కొంటారు. ఇసుక పునాదులతో రామప్ప ఆలయాన్ని నిర్మించారు. శాండ్‌బాక్స్ టెక్నాలెజీతో రామప్పతో వెయ్యి స్తంభాల ఆలయాన్ని నిర్మించారు. ఎంత పెద్ద భూకంపాలు వచ్చిన తట్టుకునేలా ఈ శాండ్‌బాక్స్ టెక్నాలెజీని అప్పటి ఇంజనీర్లు వినియోగించినట్టు చెబుతారు. అంతేకాకుండా నీళ్లలో తేలియాడే ఇటుకలను కూడా రామప్ప ఆలయ గోపురంపైన వాడారు. ఏనుగు పేడ, తవుడు, కరక్కాయ, చెట్ల జిగురుతో ఇటుకలను తయారు చేసి గోపురం నిర్మాణానికి వినియోగించారు. ఇప్పటికీ నీటిలో తేలియాడే ఇటుకలతో గోపురం చెక్కుచెదరకుండా ఉంది. ఇది అప్పటి కాకతీయ ఇంజనీర్ల సత్తా. అంతేకాకుండా వేలాది గొలుసుకట్టు చెరువుల నిర్మాణం కాకతీయ ఇంజనీర్ల మేదస్సుకు నిదర్శనంగా నిలుస్తాయి. ఓరుగల్లు గడ్డపై ఇంజనీర్ల అమోఘ ప్రతిభను కనబరిచారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

హరికోట్ల రవిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలి

రాంనగర్, సెప్టెంబరు 14: మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్, వరంగల్ జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన హరికోట్ల రవి అక్రమాలకు పాల్పడ్డారని, విచారణ జరిపి అతడిపై చర్య తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన టీఎస్ఎఫ్, డీఎంఎస్‌ఏ నేతలు సుదీర్ఘకాలం వరంగల్‌లో పనిచేసిన రవి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని, అతడిపై చర్య తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నేతలు డి.నరేష్, కె.సునిల్, వంశీకృష్ణ ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

31వేల నగదు స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 14: ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాబా రియల్ ఎస్టేట్ కార్యాలయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.31వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం ఆరుగురిని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ ధ్రువీకరించారు.

జీవిత భాగస్వామికో ప్రశంస..

- హ్యాపీ వైఫ్.. హ్యాపీ లైఫ్
- 'ఆమె' శ్రమను గుర్తించేది మాత్రం అతితక్కువ మందేనట
- కొంత సమయం కూడా మాట్లాడని వారెందరోనని అభిప్రాయాలు
- నేడు భార్యను ప్రశంసించే రోజు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

భార్య.. భర్తలో సగభాగమే కాదు. ప్రతీ కష్టంలోనూ తోడుండే ఏకైక బంధం. మూడు ముళ్లు పడినప్పటి నుంచి జీవిత చరమాంకం వరకు తోడుగా వచ్చే భార్య భర్త కష్టసుఖాలను అర్థం చేసుకుంటూ కుటుంబ భారాన్ని మోస్తుంది. అలాంటి భార్య శ్రమను గుర్తించే మగవారు మాత్రం అతితక్కువ మందే ఉంటున్నారట. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో అసలు భార్యతో కొంత సమయం కేటాయించి మనసువిప్పి మాట్లాడని వారు ఎందరో ఉన్నారట. అయితే కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుంటూ ఎంతో కష్టపడే భార్య.. తన భర్త నుంచి ఒక్క ప్రశంస వస్తే చాలు అనుకుంటుందట. ఆ ఒక్క ప్రశంసతో తన కష్టాన్నే మరిచిపోతుందట. అందుకే ఏటా సెప్టెంబరు నెలలో వచ్చే మూడో ఆదివారాన్ని భార్యను ప్రశంసించే రోజులుగా జరుపుకొంటున్నారు. వాస్తవానికి ఈ రోజును ఎందుకు, ఎప్పటి నుంచి జరుపుకుంటున్నారో తెలియదు కానీ.. 2006 సెప్టెంబరు మూడో ఆదివారం నుంచి అధికారికంగా అంతర్జాతీయంగా భార్యను ప్రశంసించే రోజు నిర్వహిస్తున్నారు. మన సంస్కృతి సంప్రదాయాల్లో ఇది అంతగా వెలుగులోకి రాలేదు కానీ కొన్ని దేశాల్లో మాత్రం భర్తలు తమ భార్యలతో ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది.

లైఫ్‌లో బెటర్ హాఫ్..

మన సంస్కృతి సంప్రదాయాల్లో భార్యకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఆమె లేని జీవితాన్ని ఊహించుకోలేం. ఊహించుకోండి.. నిత్యం ఇంటి పనులే కాదు భర్త, పిల్లల ఆలనాపాలన, కుటుంబ పెద్దల బాగోగులు చూసుకునే క్రమంలో తెల్లవారింది మొదలు నిద్రపోయే వరకు ఎంతో శ్రమిస్తుంటారు. ప్రస్తుతమైతే మగవారితో సమానంగా ఉద్యోగ, వ్యాపార తదితర బాధ్యతల్లోనూ రాణిస్తున్నారు. ఈ క్రమంలో వారు పడుతున్న శ్రమకు ప్రతిఫలంగా భర్త నుంచి ప్రశంస అందితే చాలని చాలామంది మహిళలు అభిప్రాయపడుతున్నారు. కానీ ఈ విషయంలో భర్త నుంచి ఏమాత్రం ఓదార్పు లేదా ప్రశంస దక్కటం లేదని చాలా మంది ఆవేదన చెందు తుండటం గమనార్హం. పెళ్లి ఎప్పుడైందన్నది కాకుండా భార్యను ఒక్కసారి మెచ్చుకోగలిగితే.. అంత కన్నా హ్యాపీ వైఫ్.. హ్యాపీ లైఫ్ ఇంకేం ఉండదని, అదే జీవితంలో బెటర్ హాఫ్ అని అభిప్రా యపడుతున్నారు.

● భాగస్వామి తాను పడిన శ్రమను మరిచిపోయేలా ప్రశంసించడమే కాదు వారు ఎంతో ఇష్టపడే బంగారు ఆభరణాలు, చీరలు, ఇతర సౌందర్య సాధనాలను బహుమతిగా ఇవొచ్చు. లేదంటే వంట నుంచి ఈ ఒక్క రోజున విశ్రాంతి ఇచ్చి భర్త ఆమెకు ఇష్టమైన వంటలు చేసి పెట్టొచ్చు. లేదంటే ఓ రెస్టారెంట్‌కు తీసుకెళ్లి, తనకు ఇష్టమైన ఆహారాన్ని ఆర్డర్ సర్‌ప్రైజ్ చేయవచ్చు. పువ్వులు, చాక్లెట్లు ఇలా వారికి నచ్చిన వాటితో ట్రీట్ ఇవ్వాలి. ఆమెను పొగుడుతూ ఓ కవితను రాయవచ్చు.

అంతేకాదు సోషల్‌మీడియాను వేదికగా చేసుకుని ఆమెను ప్రశంసిచొచ్చు. వైవాహిక జీవితం ప్రారంభ రోజుల నుంచి ఇప్పటి వరకు ఉన్న జ్ఞాపకాలు, ఫొటోలను ఒక పుస్తక రూపంలో తయారు చేసి బహుమతిగా ఇవ్వొచ్చు. రోజంతా వారితోనే పూర్తి సమయం కేటాయించగలిగితే.. ఆ ఒక్క రోజును వారు ఏడాదంతా గుర్తుంచుకుని కుటుంబబాధ్యతల్లో తాము ఎదుర్కొనే కష్టాలను సైతం మరిచిపోగలరని నిపుణులు చెబుతున్నారు.





కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న హసన్‌పర్తి గ్రామస్థులు

ఉమ్మడి శ్మశానవాటిక ఏర్పాటు చేయాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 14: గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఉమ్మడి శ్మశాన వాటిక లేక రోడ్డు వెంటే దహన సంస్కారాలు చేస్తున్నారని, గ్రామంలో ఉమ్మడి శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం హసన్‌పర్తిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ప్రావీణ్యకు గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసిన వారిలో సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్, ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, గ్రామస్థులు అనుమాండ్ల విద్యాసాగర్, ఆకుతోట శాంతారాంకర్ణ, శీలం యాదగిరి, హసన్‌పర్తి మీడియా ప్రతినిధులు, హసన్‌పర్తి పోలీసు సంఘం ప్రతినిధులు ఉన్నారు.



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు నాయిని, దొంతి

మార్కెట్‌లోకి కర్వ్‌ఈవీ కారు

రెడ్డికాలనీ, సెప్టెంబరు 15: వరంగల్ నగరంలోని సెలెక్ట్ మోటార్స్‌లో టాటా నూతన కారు కర్వ్‌ఈవీని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టాటా మోటార్స్ రీజినల్ హెడ్ గోపీ క్రిష్ణ, సెలెక్ట్ గ్రూప్ పార్టనర్స్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెలెక్ట్ గ్రూప్ అధినేత ముప్పిడి విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ కర్వ్ కారు పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రికల్ మోడల్‌లలో లభిస్తుందని, ప్రారంభ ధర రూ.9,99,999 నుంచి గరిష్ఠ ధర రూ.18.99లక్షల వరకు లభిస్తుందని తెలిపారు. అత్యంత ఆధునిక ఫీచర్స్ అత్యంత భద్రతతో ఈ కారును తీర్చిదిద్దారని తెలిపారు. ఈవీ కారు ఒకసారి చార్జింగ్‌లో 502 కి.మీ. నుంచి 585 కి.మీ. దూరం ప్రయాణం చేయవచ్చని తెలిపారు.



అల్కజార్ ఎస్‌యూవీని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న యుగంధర్

మార్కెట్‌లోకి ఆల్కజార్ ఎస్‌యూవీ కారు

రెడ్డికాలనీ, సెప్టెంబరు 15: వరంగల్ ములుగురోడ్డులోని హేమ హ్యూందాయ్ కారు షోరూమ్‌లో కొత్త ఆల్కజార్ ఎస్‌యూవీ కారును షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ యుగంధర్, హనుమకొండ ఏసీపీ కె.దేవేందర్ రెడ్డి, హనుమకొండ సీఐ వై.సతీష్ మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఆరు సీటర్, ఏడు సీటర్లలో అందుబాటులో ఉంది. ఈ కారు ప్రారంభ ధర ఎక్స్‌షోరూమ్‌లో పెట్రోల్ రూ.14.99 లక్షలు కాగా, డీజిల్ ప్రారంభ ధర ఎక్స్‌షోరూమ్ రూ.15.99లక్షలు. ఈ కారులో ఫీచర్లు లెవల్ 2 ఏడీఎస్, వెంటిలేటెడ్ సీట్స్ ఫ్రంట్, రియర్ పార్కింగ్ సెన్సార్లు, ఆరు ఎయిర్ బ్యాగ్స్, 4 డిస్క్‌బ్రేక్స్, బ్లూ లింక్, 40 స్టాండర్డ్ సేఫ్టీ ఫ్యూచర్లు కలిగి ఉంది. ఈ కారు ఎనిమిది రంగుల్లో అందుబాటులో ఉంది. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శ్రీధర్, పృథ్వీ, ఆదిత్య, ఏజీఎం మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సంప్రదాయ దుస్తులతో నర్సింగ్ విద్యార్థులు

సందడిగా ఓనం సంబరాలు

న్యూశాయంపేట, సెప్టెంబరు 14: హనుమకొండ హంటర్‌రోడ్‌లోని రోహిణి నర్సింగ్ కళాశాలలో శనివారం నర్సింగ్ విద్యార్థులు ముందస్తు ఓనం వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఓనం ముగ్గు వేసి రంగు, రంగు పూలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి, పలు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వేడుకల్లో డాక్టర్ వీ రాంరెడ్డి, ప్రిన్సిపాల్ చైతన్య ప్రశాంత్, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



వినాయక మండలి ప్రతినిధులకు సూచనలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ చేరాలు

వినాయక నిమజ్జనోత్సవంలో డీజేలు నిషేధం

హసన్‌పర్తి, సెప్టెంబరు 14: వినాయక నిమజ్జనోత్సవంలో డీజేలను నిషేధించినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల వినాయక మండలి ప్రతినిధులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16వ తేదీన జరిగే వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఇందుకు వినాయకమండలి నిర్వాహకులు సహకరించాలని తెలిపారు. మండల పరిధిలోని పలువురు డీజే ఓనర్లను, ఆపరేటర్లను తహసీల్దారు ఎదుట బైండోవర్ చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎస్సైలు దేవేందర్, రవిందర్, సిద్దయ్య, ఏఎస్సైలు మల్లికార్జున్, జనార్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చీపురు చూపించి హెచ్చరిస్తున్న సారంపల్లి శ్రీనివాస్ రెడ్డి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చౌకబారు రాజకీయాలు

కాజీపేట, సెప్టెంబరు 14: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పిచ్చెక్కి మాట్లాడుతున్నాడని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఆయనను హుజూరాబాద్ ప్రజలు చీపుర్లతో బుద్ధిచెప్పాలని కాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. కాజీపేట మీడియా పాయింట్‌లో మహిళా మండల అధ్యక్షురాలు నీలం రజని వేణు యాదవ్, 46వ డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్ ఎడబోయిన ప్రభాకర్‌లతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కౌశిక్‌రెడ్డి వాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యేలను చీరలు కట్టుకోవాలని, గాజులు వేసుకోవాలనడం సరికాదన్నారు. దీనిపై మాజీ సీఎం కేసీఆర్ జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే హైదరాబాద్‌లో తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో 64వ డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, 45వ డివిజన్ అధ్యక్షుడు సట్ల సదానందం గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గుర్రం జ్యోతి అమర్‌నాథ్, వస్కుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అప్రోచ్ రోడ్డు

- ఐదేళ్లుగా ముందుకు సాగని యాదవనగర్ హైవే పనులు
- కంకరపోసి వదిలేసిన అధికారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- నరకం అనుభవిస్తున్న ప్రయాణికులు



హనుమకొండ యాదవనగర్-ఎన్‌హెచ్ 163 హైవే అప్రోచ్ రోడ్డుపై పడిన గుంతలు

హనుమకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులతో నగరాన్ని కలిపే లింకు రోడ్ల విషయంలో వరంగల్ నగర పాలక సంస్థ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. వీటిని పూర్తి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదు. పనులు మొదలై సగంలో ఆగిపోయిన హనుమకొండ యాదవనగర్ నుంచి హైవేను కలిపే లింకు రోడ్డు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. వరంగల్, హనుమకొండ నుంచి గుడెప్పాడు, దామెర, ఆత్మకూరు, పరకాల, ములుగు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇది దగ్గరిదారి. పైగా ఇది బైపాస్ రోడ్డు కావడంతో ద్విచక్రవాహనాలతో పాటు లారీలు, కార్లు ఈ రోడ్డు మీది నుంచే వెళుతుంటాయి. ట్రక్కులు భారీ లోడ్లతో రోడ్డు ద్వారానే హైవేకు చేరుకుంటాయి.

అధ్వానంగా..

హనుమకొండ యాదవనగర్ నుంచి 163 నెంబర్ ములుగు-భూపాలపట్నం జాతీయ రహదారిని కలిపే లింక్‌రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై అడుగడుగునా గుంతలే. హైవేకి చేరుకునేందుకు దగ్గరదారి కదా అని హనుమకొండ నగరవాసులు ఎక్కువగా ఈ అప్రోచ్ రోడ్డును ఆశ్రయిస్తుంటారు. యాదవ్‌నగర్ జంక్షన్ నుంచి హైవే వరకు 2.50కి.మీ. పొడవున్న రోడ్డుపై నిత్యం వందల వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో దీనిపై ప్రయాణికులు, వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేల పరిధిలో..

యాదవనగర్ నుంచి విజయలక్ష్మి కాలనీ, రెడ్డిపురం మీదుగా హైవే వరకు వెళ్లే ఈ అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని రూ.8.5 0కోట్ల అంచనా వ్యయంతో రెండున్నరేళ్ల కిందట వరంగల్ నగరపాలక సంస్థ చేపట్టింది. ఈ రోడ్డు వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల పరిధిలో ఉంది. మొత్తం 2.50 కి.మీ.లో ఒక కిలోమీటర్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం, మిగతా 1.50 కి.మీ. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. దీంతో ఈ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్ రూ.2 కోట్లు, ఆరూరి రమేష్ రూ.2 కోట్లను తమ నియోజకవర్గం అభివృద్ధి నిధుల నుంచి ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. రెండున్నరేళ్ల కిందట టెండర్లు పిలిచారు. పనులు కూడా మొదలయ్యాయి. ప్రస్తుతం 40 ఫీట్లు ఉన్న సింగిల్ లేన్ రోడ్డును 80 అడుగుల మేరకు డబుల్ రోడ్డుగా విస్తరించాలని, డివైడర్ మధ్య సెంట్రల్ లైట్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.



కంకరపోసి వదిలేసిన రోడ్డు

నిలిచిపోయిన పనులు

కిలోమీటర్ వరకు కంకర పోశారు. మరో కిలోమీటరున్నర రోడ్డు పనులు మొదలే కాలేదు. ఆ తర్వాత ఏమైందో తెలియదుగానీ పనులు మధ్యలో ఆగిపోయాయి. రెండేళ్లుగా పనులు జరగడం లేదు. రోడ్డంతా కంకరతేలి ఉండడంతో వాహనాలు వెళుతున్నప్పుడు పెద్ద ఎత్తున దుమ్ము లేస్తోంది. రోడ్డు పొడవునా పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో రాత్రివేళ వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. ఇప్పటికే సుమారు 30 మంది ప్రమాదాలకు గురై అస్పత్రుల పాలయ్యారు. రోడ్డుపై కనీసం వీధిదీపాలు కూడా సరిగా లేకపోవడంతో రాత్రివేళ ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవలసి వస్తోంది. దుమ్ము రేగుతుండడంతో రోడ్డును ఆనుకొని ఉన్న యాదవనగర్ కాలనీ, విజయలక్ష్మికాలనీ, రెడ్డిపురం తదితర కాలనీల వాసులు ప్రతీరోజు ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము, ధూళి పీల్చడం వల్ల పలువురు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎలాగో ఈ రోడ్డు పూర్తి కాలేదు. కాంగ్రెస్ హయాంలోనైనా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు ప్రత్యేక శద్ధ తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

18న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

- కరపత్రం ఆవిష్కరించిన వినయభాస్కర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వినయభాస్కర్

రాంనగర్, సెప్టెంబరు 14: తమ సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాకు సంబంధించిన కరపత్రం శనివారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ ఆవిష్కరించారు. హనుమకొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించిన వినయభాస్కర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులు సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేసిందన్నారు. కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యం, సహజ మరణానికి రూ.5లక్షలు అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్మికులకు వైద్య సేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ఈనెల 23న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌లో కార్మిక కమిషనర్ కార్యాలయం ముట్టడి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు నాయిని రవి, టి.ఉప్పలయ్య, సారంగపాణి, పి.అశోక్, భిక్షపతి, కుసుల శ్యామ్, సంపూర్ణ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రజలకు చేసింది శూన్యమే..

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, సెప్టెంబరు 14: పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమేనని, రాష్ట్రంలో ప్రజా సమస్యలపై స్పందించడంలో ప్రతిపక్షం పూర్తిగా విఫలమైందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో 265 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల కింద రూ.2,65,30,740 అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకన్న, వేముల శ్రీనివాస్, పోతుల శ్రీమాన్, ఏనుగుల మానస, చెన్నం మధు, మామిండ్ల రాజు యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఎనుకొంటి నాగరాజు, నసీం జహన్, పుప్పాల ప్రభాకర్, హనుమకొండ తహసీల్దార్ కె.శ్రీపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు తాళ్లపెల్లి సుధాకర్, ఎనుకొంటి పున్నంచందర్, ఎండి అక్మల్, తాళ్లపెల్లి రవీందర్, మండల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ భవన్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

దివ్యాంగులకు నిత్యావసరాలు అందచేత

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 14: హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని మానసిక, శారీరక దివ్యాంగులకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను శనివారం డాక్టర్ పాక వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో పాక పద్మ, అనిత, రాజు, షబానా భాను వికాస్, శ్రీనివాస్, స్వర్ణకుమారి, రవళి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి స్వచ్ఛ ఆటోడ్రైవర్ల చేయూత

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: 31వ డివిజన్ న్యూశాయంపేటలో బల్దియా స్వచ్ఛ ఆటో ఓనర్ కం డ్రైవర్‌గా పనిచేస్తున్న జన్ను కుమారస్వామి(40) విధులు నిర్వర్తిస్తూ ఇటీవల గుండెపోటులో మృతి చెందాడు. కుమారస్వామి ఆర్థిక పరిస్థితిని చూసి చలించిపోయిన తోటి స్వచ్ఛ ఆటో డ్రైవర్లు చేయూత అందించారు. శనివారం హసన్‌పర్తిలో అద్దెకు ఉంటున్న మృతుడి కుటుంబ సభ్యులను కలిసి పోగు చేసిన రూ.25వేల నగదుతో పాటు బియ్యాన్ని అందించారు. కుమారస్వామి కుటుంబాన్ని కలిసిన వారిలో చిలువేరు భద్రయ్య, మురళీకృష్ణ, అజ్మీర మోహన్, దినేష్, బుర్రి విజయ్‌కుమార్, రాజు, ఎలేందర్, కిశోర్, రవీందర్‌లు పాల్గొన్నారు.

8వ రోజుకు చేరిన నవరాత్రి వేడుకలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 14: నగరంలో వాడవాడలా కొలువైన గణనాథులు భక్తులచే విశేష పూజలందుకుంటున్నాడు. శనివారం ఈ నవ రాత్రి వేడుకల పర్వం 8వ రోజుకు చేరుకున్నాయి. ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి వేడుకలు జోరుగా సాగుతున్నాయి. గణపయ్యకు నవరసాభిషేకం, గంధాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రధాన గణపతిని లక్ష్మీ గణపతిగా శోభాయమానంగా అలంకరించి గులాబీ, ఇతర పుష్పాలతో పుష్పార్చన చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ పద్మనాభరెడ్డి దంపతులు, జబర్దస్త్ ఆర్టిస్టులు చిత్రం శ్రీను, నాగరాజు, వెంకీ, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. యాగశాలలో లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న గణపతి హోమం వేద పండితులు మణికంఠశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రజ్యోతి బీఎం రఘుపతిరావు దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదంను పెద్ద ఎత్తున నిర్వహించారు. సాయంత్రం భద్రకాళి కళాక్షేత్రం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింప చేశాయి. స్వామి వారిని నెమలి వాహనంపై ఊరేగించారు. ఆలయ ఈవో వెంకటయ్య పర్యవేక్షించారు. బ్రాహ్మణవాడలోని శ్రీవిజయగణపతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా శనివారం విశేష యాగంతో పాటు మహిళలచే కుంకుమార్చనలు నిర్వహింపచేసినట్లు నిర్వాహకులు శ్రీవర్ధన్, శ్రీమాన్ నారాయణ, సూరజ్ కృష్ణ, మేఘశ్యామ్‌లుచెప్పారు. హనుమకొండ భీమారంలోని సాయి రెసిడెన్సీలో నేత్రపర్వంగా జరుగుతున్న గణపతి నవ రాత్రి వేడుకల పర్వంలో భాగంగా లక్ష్మీ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపయ్యకు మంగళహారతులతో నివేదన చేశారు.

రుద్రేశ్వరాలయంలో వైభవంగా హోమం



టీచర్స్‌కాలనీలో 108 నైవేద్యాలతో గణపతి పూజలు నిర్వహించిన భక్తులు

• హనుమకొండలోని వరంగల్ దర్శన్ కార్యాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను 8వ రోజు భక్తిప్రపత్తులతో నిర్వహించుకున్నారు. ఉత్తమ గణపతులకు వరంగల్ దర్శన్ సంస్థ చైర్మన్ పెండెం రమేష్‌బాబు, మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ అవార్డులను ప్రదానం చేశారు. హనుమకొండలోని న్యూరెడ్డి కాలనీలో నెలకొల్పిన గణపతి మండపంలో శనివారం మహిళా భక్తులు లక్ష్మీమాత కుంకుమ పూజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.నిర్వాహకులు రిటైర్డ్ ఎంపీడీవో, కమిటీ చైర్మన్ గుళ్లపెల్లి విద్యాసాగర్, శంకరయ్య, రాంనారాయణ, వీరన్న, వెంకన్న, మహిళా భక్తులు గుళ్లపల్లి వనజలత, నిర్మల, ఉమ, స్వరూప, ఉపేంద్ర, సక్కుబాయి తదితరులు విఘ్నాధిపతిని కొలిచి చల్లంగా దీవించమని వేడుకున్నారు.

• వడ్డెపల్లి: హనుమకొండలోని వివిధ డివిజన్లలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు శనివారం విఘ్నేశ్వరుడికి భక్తులు మండపాలలో భక్తిప్రపత్తులతో అభిషేకాలు, అర్చనలు చేశారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని రాఘవేంద్రనగర్ ఫేస్-2లో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మండల సమ్మయ్య-సంధ్య దంపతుల ఆధ్వర్యంలో మహిళలు విఘ్నాధిపతికి కుంకుమ పూజలను నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అల్లుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు మట్టిప ల్లి మోహన్, తాళ్లపల్లి రవీందర్ (జేకే), జనగాం శ్రీనివాస్ గౌడ్, పాకనాటి ప్రశాంత్‌రెడ్డి, మట్టిపల్లి భాగ్యలక్ష్మి, ఐలి తేజస్విని, స్నేహిత తదితరులు విఘ్నేశ్వరుడిని దర్శించుకొని పూజలు చేశారు. హనుమకొండ గోపాల్‌పూర్‌లోని బృందావన కాలనీలో నిర్వహణ కమిటీ ప్రతినిధి రచ్చ నాగేశ్వర్‌రావు, వడ్డెపల్లి మెయిన్ రోడ్డులోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆలయ చైర్మన్ చిర్ర రఘుపతిరెడ్డి, కార్యదర్శి చంద్రమౌళి, కాలనీ అధ్యక్షుడు పింగిళి రాంరెడ్డి ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడికి నైవేద్యం, పాయసం సమర్పించుకున్నారు.

• హసన్‌పర్తి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆయా వినాయక నవరాత్రి మండపాల్లో శనివారం అన్నాదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీనగర్, శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం, వారాల సంఘం, పద్మశాలి కాలనీలతోపాటు పలు వినాయక మండపాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు పావుశెట్టి శ్రీదర్, కందుకూరి చంద్రమోహన్, దీకొండ భిక్షపతి, ఆరెల్లి వెంకటస్వామి, చెన్నూరి శ్రీనివాస్, పోరండ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎన్జీవోస్ కాలనీ రాఘవేంద్ర నగర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాయిని అల్లుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు



వేయిస్తంభాల గుడిలో గణపయ్యకు పుష్పాలతో అభిషేకం



న్యూ రెడ్డి కాలనీలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

నేడు హనుమకొండ చౌరస్తాలో స్వీట్ల పంపిణీ

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 14: భూకబ్జాకారులపై ఉక్కుపాదం మోపుతూ హైదరాబాద్‌లోని హైడ్రా ఆధ్వర్యంలో కుంటలు, చెరువులు, ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములను రక్షించడానికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ చౌరస్తాలో స్వీట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఉమ్మడి జిల్లా చైర్మన్ కుమారస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలి

ధర్మసాగర్, సెప్టెంబరు 14: త్వరలో జరుగబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగ ఎమ్మెల్యేలకు అవకాశమివ్వాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మైస ఉపేందర్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. తెలంగాణ సాధనలో మాదిగలు కీలకపాత్ర పోషించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మాదిగ కులస్తుల కృషి ఎంతో ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు సముచిత స్థానం కల్పించి మంత్రి, నామినేటెడ్ పదవులివ్వాలన్నారు.

జాతీయ అనుసంధాన భాష హిందీ

న్యూశాయంపేట, సెప్టెంబరు 14: జాతీయ అనుసంధాన భాష హిందీ అని ప్రిన్సిపాల్ సల్ల శైలజ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో శనివారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శైలజ మాట్లాడుతూ.. విద్యార్థులు హిందీ భాషను మార్కుల కోసం కాకుండా భావవ్యక్తీకరణ మాధ్యమంగా ఉపయోగపడే భాషగా గుర్తించాలన్నారు. హిందీ ఉపాధ్యాయురాలు మాడిశెట్టి సుధ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు హిందీ భాషపై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే హిందీ టీచర్ సుధను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడ్లూరి దేవిప్రసాద్, దోమలపల్లి ఇందిర, షర్మిలా భేగం, కుందారపు సాధన, కందకట్ల శ్రీలత పాల్గొన్నారు.

• ధర్మసాగర్: పెద్దపెండ్యాలలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో హిందీ దివస్ వేడుకలను పాఠశాల చైర్మన్ రవికిరణ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి శనివారం ప్రారంభించారు. హిందీ దివస్ గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. హిందీ కవులు, రచయితలు మీరాబాయి, సుభద్ర కుమారి, చౌహాన్, రసఖాన్ , రహీమ్ వేషధారణతో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యూశాయంపేటలో హిందీ ఉపాధ్యాయురాలు సుధను సన్మానిస్తున్న టీచర్లు, విద్యార్థులు

పీసీసీలో పదవులు సమానంగా ఇవ్వాలి

ఐనవోలు, సెప్టెంబరు 14: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ)లో పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సమానంగా ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడిని కోరినట్లు ఏఐసీసీ కోఆర్డినేటర్ ఉల్లేంగుల యాదగిరి తెలిపారు. పీసీసీ చీఫ్‌గా నియామకమైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీలో పదవుల నియామకంపై చర్చించినట్లు తెలిపారు.



పీసీసీ చీఫ్‌ను శాలువాతో సత్కరిస్తున్న యాదగిరి

కుడా చైర్మన్‌కు సన్మానం

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 14 : కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్‌రామిరెడ్డిని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు ఉదయ భానురావు సన్మానించారు. శనివారం హనుమకొండలోని ఇనుగాల వెంకట్‌రామిరెడ్డి నివాసంలో ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ప్రభాకర్, మట్టెడ కుమార్, డీఎస్ఏ క్రికెట్ కోచ్ ఎండీ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



ఇనుగాల వెంకట్‌రామిరెడ్డిని సన్మానిస్తున్న వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

ఆదివారం

ఓనమ్‌కు 'కసావు' కళ

సంబరం

లేతపసుపు... శ్వేతవర్ణం మిళితమైన చేనేతపై బంగారపు అంచు అద్దుకొని... మగువకు వన్నెలద్దుతుంది కేరళ సంప్రదాయ చీర 'కసావు'. కళాకారుల అద్భుతమైన పనితనం... రెండు వందల ఏళ్లకు పైబడిన చరిత్ర గల ఈ చీరను నిత్యనూతనంగా నిలుపుతోంది. 'ఓనమ్ చీర'గా కూడా ఖ్యాతికెక్కిన 'కసావు' కళాత్మకతకు మళయాళ ప్రాంతంలోనే కాదు... దేశవిదేశాల్లోనూ అభిమానులున్నారు. ఈ చీర అంతటి అపురూపం ఎందుకైంది..! ఓనమ్ సందర్భంగా ఒకసారి ఆ కథలోకి వెళదాం.



ఒక్క ఓనమ్‌నాడే కాదు... కేరళలో ఏ పర్వదినమైనా మహిళలు కసావు చీరలో మెరుస్తారు. ఇది అక్కడ తరతరాలుగా అనుసరిస్తున్న వారసత్వం. రెండు వందల ఏళ్లనాటి ఈ కళ కాలక్రమంలో ఎన్నో హంగులు, వర్ణాలు సంతరించుకుంది. కానీ పండుగల, ప్రత్యేక సందర్భాలప్పుడు ఐవరీ (దంతం) కలర్ కాటన్ వస్త్రంపై... అంచుగా బంగారు పోగులు పేర్చిన చీరదే నేటికీ అగ్రస్థానం. దీనికి భారత్‌తో పాటు దక్షిణాసియా దేశాల్లో మంచి డిమాండ్ ఉంది.

'కసావు' అనేది కేరళలో ఒక పురాతన చేనేత పద్ధతి. ఆ పేరుతోనే ఈ చీరలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఈ పద్ధతిలో అతిసున్నితమైన బంగారం, వెండి దారాలతో అంచును నేస్తారు. ఇదే సాంకేతిక విధానంతో 'ముండు' (ధోవతీ)పై కూడా అంచులు వేస్తారు. దీన్ని వారు 'కసావు ముండు' అంటారు. అంతేకాదు... కేరళలో జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) ట్యాగ్ సాధించిన మొట్టమొదటి చేనేత కళ ఇది. ప్రధానంగా ఆ రాష్ట్రంలోని బలరామపురం, చెండమంగళం, కుతమ్‌పుల్లి గ్రామాలు ఈ నేతకు ప్రసిద్ధి.

ట్రావెన్‌కోర్ రాజవంశీయుల కాలంలో 'కసావు' చీరలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. మహారాజా బలరామ వర్మ... తమిళనాడులోని వల్లియూర్ నుంచి సాలియా సామాజిక వర్గానికి చెందిన చేనేత కళాకారుల కుటుంబాలను బలరామపురానికి తీసుకువచ్చారు. కేవలం తమ రాజవంశీయులకు సంబంధించిన వస్త్రాలు నేసేందుకు వారిని ఉపయోగించుకున్నారు. బలరామపురం చీరలు బ్లీచింగ్, డైయింగ్ లేని సహజసిద్ధమైన కాటన్ (కోరా)తో రూపొందిస్తారు. వేసవిలో కేరళ ఉక్కపోత వాతావరణానికి ఇవి సరిగ్గా సరిపోతాయి. కాలక్రమంలో మోటిఫ్స్, జరీతో టెంపుల్ బోర్డర్స్ వంటివి చీరపై సింగారించుకున్నాయి. పుతమ్‌పల్లి కళాకారులను కొచీ మహారాజు ప్రోత్సహించారు. వందల ఏళ్లు గడిచినా ఈ చీరల సొగసులానే... వాటిపై మనసు పడే మగువలు అంతకంతకూ పెరుగుతున్నారే కానీ... ఇసుమంతైనా తగ్గలేదు. అదే కసావు కళ ప్రత్యేకం.



అలనాటి కథ

అరుదైన రాజకుమారి ఏస్రా!

రాజ కుటుంబాలలో మహిళలు ఎక్కువగా చదువుకోరనే అపోహ చాలా మందిలో కనిపిస్తూ ఉంటుంది. కానీ అది వాస్తవం కాదు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించి.. తమ కళాదృష్టితో హైదరాబాద్ సంస్కృతికి మెరుగులు దిద్దినవారెందరో! అలాంటి వారిలో నా ప్రియ స్నేహితురాలు ప్రిన్సెస్ ఏస్రా ప్రథమ స్థానంలో నిలుస్తుంది.



1940, 50 దశకాలలో ప్రపంచంలోనే అత్యంత ధనిక రాజ్యాలలో హైదరాబాద్ ఒకటి. అలాంటి హైదరాబాద్‌ను పరిపాలించే రాజకుటుంబానికి కోడలుగా రావటమంటే సామాన్యమైన విషయం కాదు. అలాంటి సమయంలో- నిజాం మనవడు ప్రిన్సెస్ ముఖరం ఝా - టర్కీకి చెందిన రాజకుమారిని పెళ్లి చేసుకుంటున్నాడనే వార్తలు గుప్పుమన్నాయి. చాలా రోజుల పాటు ఆ యువరాణి ఎవరు? ఎలా ఉంటుంది? అందరితో కలివిడిగా ఉంటుందా? లేదా అనే విషయంపై చర్చించుకున్నట్లు గుర్తు. ఆ రాజకుమారే ఏస్రా. తన పుట్టింది టర్కీలో. 13 ఏళ్ల వయస్సులోనే లండన్‌కు వెళ్లిపోయింది. అక్కడే చదువుకుంది. 18 ఏళ్లకు ఫ్లోరెన్స్ విశ్వవిద్యాలయంలో చేరింది. ఆ సమయంలోనే ముఖరం ఝాను కలిసిందని.. వారిద్దరు ప్రేమలో పడ్డారని.. అయితే నిజాంకు ఈ పెళ్లి ఇష్టం లేదని.. జవహర్‌లాల్ నెహ్రూ కలగజేసుకున్న తర్వాత నిజాం ఒప్పుకున్నారని చెప్పుకుంటూ ఉండేవాళ్లం. ముఖరం ఝా, ఏస్రాల పెళ్లి లండన్‌లో జరిగింది. నిఖా మాత్రం హైదరాబాద్‌లోనే జరిగింది. ఆ పెళ్లికి కేవలం నిజాం కుటుంబ సభ్యులను మాత్రమే పిలిచారు. నిజాంకు సన్నిహితంగా ఉండే మా కుటుంబాన్ని కూడా పిలిచిన జ్ఞాపకం లేదు. కానీ హైదరాబాద్ అంతా మాత్రం సుమారు వారం రోజులు వేర్వేరు ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. అన్నదానాలు చేశారు. ప్యాలెస్‌లను అందంగా ముస్తాబు చేశారు. కొత్త దంపతులకు నిజాం హిల్‌ఫోర్ట్‌పై ఉన్న ప్యాలెస్‌ను కానుకగా ఇచ్చారు. వారు అక్కడ నివసించటం ప్రారంభించారు.

ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. రాజకుటుంబాలలో రాజకుమారిగా బతకటం అంత సులభం కాదు. అందమైన బట్టలు.. విలువైన నగలతో పాటుగా కుటుంబం భారం కూడా వారిపైనే పడుతుంది. స్వేచ్ఛగా బతకాలనుకొనేవారికి ఈ బంధనాలు ఇబ్బంది పెడతాయి. ఏస్రా విషయంలో కూడా అదే జరిగింది. నిజాం కుటుంబంలో నివసించే వారు కొన్ని మర్యాదలను తప్పనిసరిగా పాటించాలి. నిజాం అనుమతి లేకుండా బయటకు వెళ్లకూడదు. సామాన్య ప్రజలతో మాట్లాడకూడదు. ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు- వారికి ఎలాంటి మర్యాదలు చేయాలనే విషయంపై కూడా నిబంధనలు ఉంటాయి. కానీ ఇస్రా వీటిని పట్టించుకోలేదు. తనదైన జీవన విధానంతో హైదరాబాద్‌పై ముద్ర వేసింది. ఆ సమయంలో నేను ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ (ఏఐడబ్ల్యూసీ) కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేదానిని. ఇస్రా ఈ సంస్థకు పేట్రన్‌గా ఉండేది. ఇతర రాజకుటుంబీకులతో కలిపి మా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేది. బేగం బషీర్ యార్ జంగ్, బేగం ఫజులొద్దీన్ ఖాన్, మసూమా బేగం మొదలైన వారు ఈ సమావేశాల్లో పాల్గొనేవారు. ఈ సమావేశాల్లో పాల్గొనే మహిళలందరూ- చీర కొంగును తలపై కప్పుకొనేవారు. ఇస్రా మాత్రం అలాంటి ఆచారాలను పాటించేది కాదు. అందరితో కలిసిపోయేది. ఒక రోజు తను నాకు హఠాత్తుగా ఫోన్ చేసి- "నేను తిరుపతి వెళ్లాలను కుంటున్నాను" అంది. నాకు షాక్ కొట్టినట్లు అయింది. నిజాం కుటుంబ సభ్యులు తిరుపతి వెళ్లటమనేది జీర్ణించుకోలేకపోయా. నాకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. "నువ్వు నమ్మితే వెళ్లు" అన్నా. "వేల మంది దేవుడిని అక్కడికి వెళ్తున్నప్పుడు నేను ఎందుకు వెళ్లకూడదు?" అంది. నాకు మూసీకి వరదలు వచ్చిన సమయంలో మహబూబ్ ఆలీ పాషా హారతి ఇచ్చిన సందర్భం గుర్తుకు వచ్చింది. తను తిరుపతి వెళ్లి వచ్చిన తర్వాత నన్ను కలిసింది. "నువ్వు ఒక పెద్ద సాహసం చేశావు" అన్నా. తను నవ్వి ఊరుకుంది. తను విపరీతంగా పుస్తకాలు చదువుతుంది. ఈ విషయంలో మా ఇద్దరికీ అనేక పోలికలు ఉన్నాయి. మేమిద్దరం కలిసి పారిస్‌కు హాలిడేకు వెళ్లినప్పుడు- అక్కడకు అనేక పుస్తకాలు తీసుకువచ్చేది. పారిస్ నుంచి తిరిగి వచ్చే లోపులో వాటిని పూర్తి చేసేసేవాళ్లం. మేమిద్దరం నూర్ మహల్ గార్డెన్లో కూర్చుని టీ తాగిన అనేక సందర్భాలు నాకు ఇంకా గుర్తున్నాయి.



ఇక చౌమల్లా ప్యాలెస్, ఫలక్‌నామా ప్యాలెస్‌లకు పునర్వైభవాన్ని తీసుకురావటంలో ఆమె పాత్ర మరచిపోలేనిది. టాటా గ్రూపునకు ఫలక్‌నామా ప్యాలెస్‌ను లీజుకు ఇచ్చిన తర్వాత 10 ఏళ్ల పాటు వారితో కలిసి పనిచేసింది. ఆ ప్యాలెస్ ఓపినింగ్‌కు నేను కూడా వెళ్లా. నిజాం ముఖరం ఝా సహా అనేక మంది పాత స్నేహితులను కలిసా. ఈ రోజు ఆ ప్యాలెస్‌లకు ప్రపంచ వ్యాప్తంగా అంత పేరు ప్రఖ్యాతులు రావటంలో ఇస్రా పోషించిన భూమిక అపూర్వమనే చెప్పాలి. ఇప్పుడు కూడా హైదరాబాద్‌కు వచ్చినప్పుడు నన్ను కలుస్తూ ఉంటుంది. మొదటి పరిచయంలో ఎంత ప్రేమను, అభిమానాన్ని చూపించిందో.. ఈ రోజుకు అదే ప్రేమాభిమానాలు చూపిస్తుంది. తన వ్యక్తిత్వం ద్వారా అనేక మందికి స్ఫూర్తిగా నిలిచిన ఇస్రా చాలా అరుదైన రాజకుమారి!

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

అలాంటి పాటలు రాసేందుకు ఇష్టపడతా!

దాదాపు 100 సినిమా పాటలు.. 750కి పైగా సీరియల్స్‌కి పాటలు రాసిన గీత రచయిత ఆయన. ఇటీవలే 'ఇండియా ఫైల్స్' చిత్రం కోసం ఆయన రాసిన 'తిరిగి చూడు తిరిగి చూడు తిరుగుతున్న భూవిని... కలిసి చూడు కలిసి చూడు మనిషిలోని మనిషి' పాట అనేక మంది హృదయాలను గెలుచుకుంది. సాహిత్య విలువలు ఉన్న పాటలు రాయడానికి ఇష్టపడే ఆ రచయిత మౌనశ్రీ మల్లిక్. "ఇండియా ఫైల్స్" చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఆయనతో 'నవ్య' ముచ్చటించింది.

మీ సాహిత్య ప్రయాణం ఎలా మొదలైంది?

మాది వరంగల్‌లోని వర్ధన్నపేట. నాకు చిన్నప్పటి నుంచి సాహిత్యం అంటే ఎంతో ఇష్టం.



ఎప్పటికైనా సినీ పాటల రచయితగా మారాలనే సంకల్పంతో రచనలు చేసేవాడిని. జర్నలిస్టుగా కొన్నాళ్లు పనిచేశాను. నేను రాసిన 'దిగంబర', 'గరళం', 'తప్తస్పృహ' కవితా సంకలనాలకు 30కి పైగా పురస్కారాలు వచ్చాయి. సినిమా పాటలు రాయాలని ఇండస్ట్రీకి వచ్చి.. మొదట సీరియల్స్‌కు పని చేశాను. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు ప్రోత్సాహంతో 'కోయిలమ్మ' అనే సీరియల్‌లో 550కి పైగా పాటలు రాశాను. 'కృష్ణతులసి' అనే సీరియల్‌లో 200కి పైగా భక్తి పాటలు రాశాను. ఆ తర్వాత 2010లో 'చేతిలో చెయ్యేసి' సినిమాలో 'చిలిపి చిలిపి' అనే పాటను రాశాను. ఇప్పటి వరకు దాదాపు 50 సినిమాల్లో.. 100కు పైగా పాటలు రాశాను.

మీకు బాగా గుర్తింపు తెచ్చిన పాటలు...

నేను రాసిన పాటల్లో 'చేతిలో చెయ్యేసి' చిత్రంలోని పాట ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. 'గుడ్ మార్నింగ్' చిత్రంలో నేను రాసిన 'ఎదలో నదిలాగ కదిలిన భావాలు' పాటను ఆలపించినందుకు గీతా మాధురికి నంది అవార్డు వచ్చింది. 'ఐపీసీ సెక్షన్ భార్య బంధు'.. 'బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్'.. 'చెంబు చిన సత్యం' సినిమాల్లోని పాటలకు సాహితీపరమైన ప్రశంసలు వచ్చాయి. 'ఇండియా ఫైల్స్' చిత్రంలో రాసిన 'తిరిగి చూడు', 'జై ఇండియా' సాంగ్‌కు విశేషమైన స్పందన వస్తోంది.

గుర్తుండిపోయే ప్రశంసలు

నా ఆరాధ్య దైవం..దివంగత గాయకుడు ఎస్.పి.బాలసుబ్రమణ్యం.. సంగీత దర్శకులు ఎమ్.ఎమ్.కీరవాణి, సాలూరి కోటేశ్వరరావు (కోటి)లు నా పాటల్లోని సాహిత్యాన్ని మెచ్చుకోవడం.

నటుడిగానూ కొన్ని సినిమాల్లో చేసినట్లున్నారు....

అవునండీ! నాలుగైదు చిత్రాల్లో నటించాను. అదీ దర్శక నిర్మాతల కోరిక మేరకు.

ఎలాంటి పాటలు రాయడమంటే ఇష్టం?

రచనకు అలాంటి పరిధులు ఏవీ పెట్టుకోలేదు. అవసరానికి తగినట్లు అన్ని రకాల పాటలు రాయాలనుంది. సాహిత్య విలువలు ఉన్న పాటలు రాసేందుకు ఎక్కువ ఇష్టపడతా.

'ఇండియా ఫైల్స్' చిత్రం గురించి చెప్పండి?

దేశంలోనే కల్చరల్ డీ.ఎన్.ఏ సబ్జెక్ట్‌తో తెరకెక్కుతోన్న మొదటి చిత్రమిది. సామాజిక స్పృహను మేల్కొలిపేలా ఉంటుంది. సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్య లు.. వాటి పరిష్కారాలను ఇందులో చూపించాము. బొమ్మకు మురళీ దర్శకత్వ పటిమ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. రాజకీయ నాయకుడు అద్దంకి దయాకర్ కథానాయకుడి పాత్రకు జీవం పోశారు. ఇందులో ఆయన పోషించిన పాత్ర గుర్తుండిపోతుంది.

మీరు అభిమానించే సినీ పాటల రచయితలు..?

సి.నారాయణరెడ్డి. ఆయన రాసిన అనేక సినిమా పాటలతో పాటు 'విశ్వంభర', 'ప్రపంచ పదులు' ఇష్టం. అలాగే వేటూరి సుందరరామ్మూర్తి, ఆచార్య ఆత్రేయ రాసిన పాటలు ఎంతో ఇష్టం.

• మోహన్ వర్మ

కొత్త సినిమాతో పాటు ఇండస్ట్రీలో వినిపించే పదం కాంబినేషన్. హీరోలు, హీరోయిన్లు, దర్శకుల కలయిక గురించి అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు భారతీయ చిత్ర పరిశ్రమలో సరికొత్త కలయికకు వేదిక సిద్ధమౌతోంది. భిన్న ధ్రువాల్లాంటి దక్షిణాది, ఉత్తరాది చిత్ర పరిశ్రమల కాంబినేషన్ హిట్ ఫార్ములాగా మారుతోంది. పోటీ పడి నష్టపోయే బదులు రెండు ఇండస్ట్రీలు పరస్పర ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తున్న దృశ్యం ఆవిష్కారమవుతోంది.





హద్దులు చెరిగే... కలయిక కుదిరే

భారతీయ సినిమాకు పెద్దన్న అంటే బాలీవుడ్. కానీ కరోనా తర్వాత కథ మారింది. దక్షిణాది సినిమాలు, ముఖ్యంగా టాలీవుడ్ చిత్రాలు వసూళ్లలో, విజయాల్లో హిందీ సినిమాలతో పోటీ పడడమే కాదు బాలీవుడ్ రికార్డులను బ్రేక్ చేశాయి. తెలుగు చిత్రాలు 'పుష్ప', కార్తికేయ', కన్నడ నుంచి 'కేజీఎఫ్', 'కాంతార', మలయాళ సినిమాలు '2018, ఆడుజీవితం', తమిళం నుంచి 'విక్రమ్, జైలర్' లాంటివి బాలీవుడ్ లో భారీ వసూళ్లను రాబట్టాయి. స్ట్రెయిట్ చిత్రాలు సైతం వాటి ధాటికి నిలవలేకపోయాయి. ఉత్తరాది, దక్షిణాది పరిశ్రమల మధ్య పోటీ అనే అంశం అలా తెరపైకి వచ్చింది. కానీ పరిశ్రమలో మాత్రం అలాంటిదేం కనిపించలేదు. పోటీ భావన మనసులో ఉన్నా దాన్ని పక్కనపెట్టి పరస్పరం సహకరించుకుంటూ ఇరుపక్షాలు లాభపడుతున్నాయి. ఒకరి సినిమాలను మరొకరు ప్రమోట్ చేయడంతో పాటు, ప్రతిభావంతులైన నటీనటులకు కొత్త అవకాశాల ద్వారాలు తెరుస్తున్నారు. దీనివల్ల ఉత్తరాది, దక్షిణాది సినిమా అనే విభజన రేఖ క్రమంగా చెరిగిపోతోందని సినీ విశ్లేషకులు అంటున్నారు. హిందీ, దక్షిణాది పరిశ్రమలు పరస్పర ప్రయోజనాల కోసం పోటీని పక్కనపెట్టాయి. కటౌట్‌ను నమ్ముకుంటే పనికాదని అర్థం చేసుకున్న బాలీవుడ్ సినీ ప్రముఖులు మంచి కంటెంట్ కోసం దక్షిణాది పరిశ్రమతో చేతులు కలుపుతున్నారు. ఈ అవకాశాన్ని సౌత్ పరిశ్రమ అందిపుచ్చుకుంటోంది. మంచి కంటెంట్ ఉన్న సినిమాలను అందించడం ద్వారా బాలీవుడ్‌లో పాగా వేస్తోంది. ఇలా ఉత్తరాది, దక్షిణాది పరిశ్రమలు కలసి పనిచేయడం తెలివైన వ్యూహం అని రుజువైంది. బాలీవుడ్ ఇండస్ట్రీతో కలవడం ద్వారా తెలుగ సినిమాకు సరికొత్త మార్కెట్ పరిచయమవుతోంది.



మనమంతా ఒక్కటే

అలాగే ఇటీవలే ముంబైలో నిర్వహించిన ఐఫా 2024 వేడుకల సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్న రానా వేదికపైన ఉన్న షారూఖ్‌ఖాన్ పాదాలను తాకి నమస్కరించారు. షారూఖ్ వెంటనే రానాను ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం అక్కడ ఉన్న వారిని ఆకట్టుకుంది. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమంత కూడా కొన్ని రోజుల క్రితం ఓ ప్రచార కార్యక్రమంలో కరణ్ జోహార్ పాదాలను తాకి నమస్కరించారు. ఇలాంటి సంఘటనల వల్ల మనమంతా ఒకటే అనే సందేశం బలంగా జనాల్లోకి వెళ్లి మంచి వాతావరణాన్ని సృష్టిస్తోంది.

దక్షిణాది అందాలకు అందలం

దక్షిణాది హీరోయిన్లకు బాలీవుడ్‌లో మంచి గుర్తింపు దక్కుతోంది. సౌత్ నుంచి బాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన రష్మిక మందన్న, సమంత అక్కడ కూడా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. 'ది ఫ్యామిలీ మాన్ 2' సిరీస్‌తో హిందీ జనాలకు చేరువయ్యారు సమంత. ఆమె నటించిన 'హనీ-బన్నీ' హిందీ సిరీస్ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సమంత విషయంలో ఇది కేవలం ఆమె నటన జీవితానికే పరిమితం కాలేదు. ఆమె విడాకులు తీసుకున్న సమయంలో, అనారోగ్యానికి గురైన సందర్భంలో బాలీవుడ్ వర్గాలు ఆమెకు బాసటగా నిలిచాయి. 'యానిమల్' సినిమా సూపర్‌హిట్ అవ్వడంతో బాలీవుడ్‌లో రష్మిక ప్రభ వెలిగిపోతోంది. అగ్రహీరోల చిత్రాల్లో ఆమెకు అవకాశాలు వస్తున్నాయి. సల్మాన్‌ఖాన్‌తో 'సికందర్', విక్కీ కౌశల్ సరసన 'ఛావా' చిత్రాల్లో రష్మిక నటిస్తున్నారు. గ్లామర్ పాత్రల్లో రాణించే బాలీవుడ్ హీరోయిన్లకు భిన్నంగా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను పోషిస్తూ, మంచి విజయాలను దక్కించుకుంటున్నారు. అలాగే ఉత్తరాదిలోనూ వసూళ్ల మోత మోగించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం విజయంలో దీపికా పదుకొనే, అమితాబ్‌బచ్చన్ స్టార్‌డమ్ అక్కరకొచ్చిందనే చెప్పాలి.

సత్తా చూపుతున్న దక్షిణాది దర్శకులు

పరాజయాలతో డీలా పడిన బాలీవుడ్ స్టార్స్ హిట్ కొట్టేందుకు దక్షిణాది దర్శకులతో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. షారూఖ్ ఖాన్‌కు తమిళ దర్శకుడు అట్లీ 'జవాన్' చిత్రంతో భారీ విజయాన్ని అందించారు. అలాగే రణ్‌బీర్‌కపూర్‌కు 'యానిమల్' రూపంలో సాలిడ్ హిట్ ఇచ్చారు సందీప్‌రెడ్డి వంగా. అలాగే దక్షిణాది దర్శకులు, హీరోలతో సినిమాలు చేయడం ద్వారా బాలీవుడ్ బాక్సాఫీసు దగ్గర లాభపడుతోంది. హృతిక్‌రోషన్‌తో కలసి వార్ 2 చిత్రంలో ఎన్టీఆర్ నటిస్తున్నారు. అలాగే రామాయణ్‌లో యష్ నటిస్తున్నారు. పలువురు సీనియర్ బాలీవుడ్ నటులు దక్షిణాది చిత్రాల్లో ప్రతినాయక పాత్రల్లో అలరిస్తున్నారు.

దేవరతో జిగ్రా

'ఆర్‌ఆర్‌ఆర్' ఘన విజయం తర్వాత జూనియర్ ఎన్టీఆర్ పాన్ ఇండియా మార్కెట్‌పై గురిపెట్టారు. బాలీవుడ్‌లోనూ 'దేవర' ప్రచార కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేస్తున్నారు. అక్కడి సినీ ప్రముఖులు సైతం ఎన్టీఆర్‌కు తమవంతు సాయం చేస్తున్నారు. బాలీవుడ్ ప్రముఖుడు కరణ్ జోహార్ 'దేవర' ప్రమోషన్స్ కోసం ఓ ఈవెంట్‌ను స్వయంగా నిర్వహించాడు. 'బ్రహ్మాస్త్ర' సినిమా విడుదల సమయంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమాలకు జూనియర్ ఎన్టీఆర్ ఎంతగానో సహకరించారు. ఆయన ప్రచారం వల్ల మా సినిమాకు వసూళ్ల పరంగా మంచి లబ్ధి చేకూరింది. తారక్ నాకు మంచి ఫ్రెండ్. మా అనుబంధం మున్ముందూ కొనసాగుతుంది' అని కరణ్ చెప్పారు. ఇదే కార్యక్రమంలో అలియాభట్, ఎన్టీఆర్‌ను కలిపి ఇంటర్వ్యూ చేయడం ద్వారా కరణ్ తన స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన 'జిగ్రా' సినిమాకు ప్రచారాన్ని కల్పించారు.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ	ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్			**జియో సినిమా**		
కలినరీ క్లాస్ వార్స్	కొరియన్ సిరీస్	సెప్టెంబర్ 17	అమెరికన్ సొసైటీ ఆఫ్ మాజికల్ నీగ్రోస్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 15
ట్విలైట్ ఆఫ్ ది గాడ్స్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 19	దుర్గ	హిందీ సిరీస్	సెప్టెంబర్ 16
మాన్‌స్టర్స్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 19	**జో తేరా హై వో మేరా హై**	హిందీ చిత్రం	సెప్టెంబర్ 20
హిజ్ త్రీ డాటర్స్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 20	ది పెంగ్విన్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 20
ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో 2	టాక్ షో	సెప్టెంబర్ 21			
అమెజాన్ ప్రైమ్			**డిస్నీ ప్లస్ హాట్‌స్టార్**		
ఎ వెరీ రాయల్ స్కాండల్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 19	అన్ ప్రిజన్డ్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 16
జీ 5			అగాథ	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 17
నుణక్కుళి	మలయాళ చిత్రం	సెప్టెంబర్ 15	ది జడ్జ్ ఫ్రమ్ హెల్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 21





గ్యాంగ్‌వార్

అధికారం కోసం అండర్ వరల్డ్ గ్యాంగ్‌ల మధ్య జరిగే అంతర్యుద్ధం నేపథ్యంలో తెరకెక్కిన సిరీస్ 'పెంగ్విన్'. క్రెయిగ్ జోబెల్ దర్శకత్వం వహించారు. గోతం సిటీలో వరదల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఓస్వాల్డ్ అనే యువకుడు మాఫియా ప్రపంచంపై పై చేయి సాధించేందుకు వేసే ఎత్తుల నేపథ్యంలో కథ సాగుతుంది. ప్రత్యర్థుల మధ్య పోరాటంలో సామాన్య ప్రజానీకం ఎలా నలిగిపోయిందనేది మనసుకు హత్తుకునేలా తెరకెక్కించారు.



ఐఐటీహెచ్‌లో పీహెచ్‌డీ

సంగారెడ్డి-కందిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్(ఐఐటీహెచ్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, డైరెక్ట్ విధానాల్లో అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్ ప్రోగ్రామ్‌లో విభాగానికి నిర్దేశించిన మేరకు అకడమిక్ మెరిట్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. డైరెక్ట్ ప్రోగ్రామ్ వ్యవధి



అయిదేళ్లు. మొదటి రెండేళ్లు జేఆర్ఎఫ్ కింద రూ.50,000; చివరి మూడేళ్లు ఎస్ఆర్ఎఫ్ కింద రూ.55,000 అందిస్తారు.

విభాగాలు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, ఫిజిక్స్

అర్హత: డైరెక్ట్ పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐఐటీలు/నిట్ సంస్థలు/ఐఐఎస్సీ/ఐసర్ సంస్థల నుంచి కనీసం 9 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీ డిజైన్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ అర్హత తప్పనిసరి కాదు.

- రెగ్యులర్ పీహెచ్‌డీలో ప్రవేశానికి సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎంసీఏ/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 19
- **వెబ్‌సైట్:** www.iith.ac.in/phdadmissions/

సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా

హైదరాబాద్, బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ) కోర్సులో ప్రవేశానికి వాక్ ఇన్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: అభ్యర్థులు డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు వించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

- **వాక్ ఇన్ అడ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 21
- **చిరునామా:** అడ్మిషన్ డెస్క్, రూమ్ నెంబరు 102, డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037
- **వెబ్‌సైట్:** citdindia.org

దిక్సూచి DIKSUCHI

ఐఐటీ మద్రాస్‌లో డిప్లొమా



మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ప్రోగ్రావింగ్, డేటా సైన్స్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి 8 నెలలు. ఒక్కో ప్రోగ్రామ్‌లో రెండు ఫౌండేషనల్ కోర్సులు, అయిదు ప్రోగ్రామ్ సంబంధిత కోర్సులు, ఒక స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్‌నకు 35 క్రెడిట్స్ నిర్దేశించారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు, డిగ్రీ ప్రోగ్రామ్‌లో కనీసం రెండేళ్లు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్: ఇందులో కంప్యూటేషనల్ థింకింగ్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్ అనే ఫౌండేషనల్ కోర్సులు; డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రోగ్రామింగ్-డేటా స్ట్రక్చర్స్-అల్గారిథమ్స్ విత్ పైథాన్, మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్-1&2 అనే ప్రోగ్రామింగ్ కోర్సులు; సిస్టం కమాండ్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ 1&2లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

డిప్లొమా ఇన్ డేటా సైన్స్: ఇందులో మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్ అనే ఫౌండేషనల్ కోర్సులు; మెషిన్ లెర్నింగ్ ఫౌండేషన్స్, బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్, బిజినెస్ అనలిటిక్స్ అనే డేటా సైన్స్ కోర్సులు; టూల్స్ ఇన్ డేటా సైన్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్‌లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

క్వాలిఫయర్ ఎగ్జామ్: డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్, బేసిక్ మేథమెటిక్స్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్ పేపర్ 25 మార్కులకు ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లిజనింగ్ ఎబిలిటీ, గ్రామర్, రైటింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్ పేపర్‌లో రీజనింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ పేపర్‌లో సెట్ థియరీ, నెంబర్ సిస్టమ్, కో-ఆర్డినేట్ జామెట్రీ, క్వాడ్రాటిక్ ఫంక్షన్స్, పాలినామియల్స్, ఫంక్షన్స్, లాగరిథమ్స్, గ్రాఫ్ థియరీ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 3 గంటలు.

- డిప్లొమా ఇన్ డేటా సైన్స్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంగ్లీష్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్, మేథమెటిక్స్ పేపర్‌లు పై ప్రోగ్రామ్‌కు నిర్వహించేవాటి మాదిరిగానే ఉంటాయి. పైథాన్ పేపర్‌లో ఇంట్రడక్షన్ టు పైథాన్, కండిషనల్ స్టేట్‌మెంట్స్, లూప్స్, లిస్ట్స్, ఫంక్షన్స్, కలెక్షన్స్, రికర్షన్, ఫైల్ హ్యాండిలింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. స్టాటిస్టిక్స్ పేపర్‌లో డేటా, స్కేల్స్ ఆఫ్ మెజర్‌మెంట్, డేటా ఫ్రీక్వెన్సీ, వేరియబుల్స్, పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, రాండం వేరియబుల్స్, వేరియన్స్ తదితర అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లో మల్టిపుల్ ఇటరేషన్స్, ఫిల్టరింగ్, ఫ్లో ఛార్ట్, సైడ్ ఎఫెక్ట్‌లు, గ్రాఫ్, మాట్రిక్స్, ట్రీ, బ్యాక్ ట్రాకింగ్, క్లాసిఫికేషన్, ఆబ్జెక్ట్ ఓరియంటేషన్ ప్రోగ్రామింగ్, రిమోట్ ప్రొసీజర్ కాల్, పోలింగ్ తదితర సాంకేతిక అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 4 గంటలు.
- క్వాలిఫయర్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 40 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 35 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 45 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 30 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 40 శాతం మార్కులు రావాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.6,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.3,000; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 22
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, భీమవరం, గుంటూరు, కడప, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **డిప్లొమా క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 22
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** 2025 జనవరి 8 నుంచి 9 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2025 జనవరి 10 నుంచి
- **వెబ్‌సైట్:** diploma.iitm.ac.in

నవ్య | చిత్రజ్యోతి

సమంతకు అరుదైన గౌరవం



నటి సమంతకు ఓ అరుదైన గౌరవం దక్కింది. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) ఉత్సవం అవార్డ్స్ కార్యక్రమం ఈ నెల 27న దుబాయ్‌లో జరగనుంది. కార్యక్రమంలో ఆమెను 'ఉమెన్ ఆఫ్ ద ఇయర్' అవార్డుతో సన్మానించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. "ఈ తరానికి చెందిన ఉత్తమ నటుల్లో సమంత ఒకరు. తన వైవిధ్యమైన పాత్రలతో అభిమానులను నిరంతరం ఆకట్టుకునే ఆమెకు ఈ అవార్డును అందజేయటం ఆనందంగా ఉంది" అని ఐఫా నిర్వాహకులు తెలిపారు. "ఐఫా ఉత్సవం నాకెల్లప్పుడూ ప్రత్యేకమే. దక్షిణాది సినిమాను ప్రపంచ ప్రేక్షకులకు తెలియజెప్పే ఈ వేదికపై పాల్గొనడానికి నేను ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను" అని సమంత పేర్కొన్నారు.

150 మంది ఫైటర్లు... 300 మంది జూనియర్స్



నందమూరి కల్యాణ్‌రామ్ నటిస్తున్న తాజా చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌ను అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం యాక్షన్ డైరెక్టర్ పీటర్ హెయిన్ సారథ్యంలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరిస్తున్నారు. 15 రోజుల పాటు కొనసాగే ఈ చిత్రీకరణలో 150 మంది ఫైటర్లు, 300 మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్నారు. సినిమాకు ఈ యాక్షన్ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాతలు చెప్పారు. విజయశాంతి పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రాఘవ లారెన్స్ 25వ సినిమా



'రాక్షసుడు', 'ఖిలాడీ' చిత్రాల తర్వాత నిర్మాత కోనేరు సత్యనారాయణ మరో భారీ చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. యాక్షన్, అడ్వంచర్ అంశాలతో రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రాఘవ లారెన్స్ హీరోగా నటించనున్నారు. ఇది ఆయనకు 25వ సినిమా కావడం గమనార్హం. ప్యాన్ ఇండియా రేంజ్‌లో తెర కెక్కనున్న ఈ సినిమాకు రమేశ్ వర్మ దర్శకుడు. ఆయనతో కోనేరు సత్యనారాయణ తీస్తున్న మూడో చిత్రం ఇది. నవంబర్‌లో షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. సినిమా గురించి పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

దేవర సినిమాను కలిసి చూద్దాం

అభిమానికి ఎన్టీఆర్ వీడియో కాల్





బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తన అభిమాని కౌశిక్‌ను జూనియర్ ఎన్టీఆర్ శనివారం పరామర్శించారు. కౌశిక్ బెంగళూరు కిద్వాయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆ అభిమానితో దాదాపు 10 నిమిషాలు ఎన్టీఆర్ వీడియో కాల్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. "నువ్వు నవ్వుతుంటే చాలా బాగున్నావు. ధైర్యంగా ఉండు. ట్రీట్‌మెంట్ తీసుకుని కోలుకో. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి. త్వరలోనే కలుద్దాం. 'దేవర' సినిమాను ఇద్దరం కలసి చూద్దాం. ట్రీట్‌మెంట్ ఖర్చులకు సాయపడతాను" అని ఎన్టీఆర్ భరోసా ఇచ్చారు. అలాగే కౌశిక్ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆ వీడియో కాల్‌లో కౌశిక్ మాట్లాడుతూ "అన్నా, మిమ్మల్ని అస్సలు అనుకోలేదు" అని అన్నారు. దానికి బదులుగా ఎన్టీఆర్ "భలే వాడివే. నీతో మాట్లాడకుంటే ఎలా" అని అన్నారు. ఇటీవలే కౌశిక్ తల్లి ఓ వీడియో ద్వారా కుమారుడి ఆరోగ్య పరిస్థితి, జూనియర్ ఎన్టీఆర్ పట్ల తన కుమారుడికి ఉన్న అభిమానాన్ని తెలిపారు. దీంతో స్పందించిన జూనియర్ ఎన్టీఆర్, తిరుపతికి చెందిన తమ అభిమానసంఘం కన్వీనర్ కృష్ణయాదవ్‌ను బెంగళూరుకు పంపించారు. తనతో మాట్లాడించాలని సూచించారు. దీంతో కృష్ణయాదవ్‌తో పాటు అభిమానసంఘం కన్వీనర్‌లు మాణిక్యం, బసవ కిద్వాయ్ ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

విజయ్‌కి ఇదే ఆఖరి చిత్రమా?



అగ్రహీరో విజయ్ నటించే తదుపరి చిత్రాన్ని శనివారం సాయంత్రం అధికారికంగా వెల్లడించారు. 'విజయ్69' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కే ఈ చిత్రం వచ్చే ఏడాది అక్టోబరు నెలలో ప్రేక్షకుల ముందుకురానుంది. మరో అగ్రహీరో అజిత్ కుమార్‌కు 'నెర్కొండ పార్వై' 'వలిమై', 'తుణివు' వంటి వరుస హిట్ చిత్రాలను అందించిన హెచ్.వినోద్ ఈ సినిమాకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ కె.నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చే ఈ సినిమాలో పూజా హెగ్డే, సిమ్రాన్, మమిత బైజులను ఎంపిక చేయగా, విలన్ పాత్రను బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పోషిస్తున్నారు. కెమెరా: సత్యన్ సూరియన్. ఈ చిత్రానికి సంబంధించి విడుదల చేసిన పోస్టరులో 'త్వరలోనే ప్రజాస్వామ్యానికి వెలుగు చూపే వ్యక్తి రాక.' అంటూ ఆంగ్లంలో రాయగా, ఒక చేతితో టార్చ్‌ను పట్టుకుని కనిపిస్తున్నారు. కాగా, ఈ చిత్రం తర్వాత విజయ్ సినిమాలకు స్వస్తి చెప్పి.. పూర్తిస్థాయిలో క్రియాశీలక రాజకీయాల్లో నిమగ్నం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే ఆయన 'తమిళగ వెట్రి కళగం' అనే పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

యుద్ధం నేపథ్యంలో ప్రేమకథ





సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్, విక్కీ కౌశల్ నటిస్తున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. జనవరిలో సినిమాను మేకర్స్ ప్రకటించిన మేకర్స్.. వచ్చే ఏడాది క్రిస్మస్‌కు సినిమాను విడుదల చేస్తున్నట్లు మొదట తెలిపారు. అయితే, తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని మార్చారు. 2026లో మార్చి 20న రంజాన్ సందర్భంగా సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ ఎపిక్ లవ్ డ్రామా కథేంటేంటన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని కలిగిస్తోంది. ఈ సినిమా కథను మేకర్స్ ప్రకటించకున్నా.. ఇది యుద్ధం నేపథ్యంలో జరిగే ప్రేమకథ అని టాక్ వినిపిస్తోంది. అదే రోజున షారుక్ ఖాన్ నటించిన క్రైమ్ డ్రామా 'కింగ్' సినిమా విడుదలవుతోంది. కాగా, సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలోనే 'సావరియా' చిత్రంతో రణ్‌బీర్ సినీ రంగ ప్రవేశం చేశారు.

కౌన్ బనేగా కరోడ్‌పతిలో.. పవన్‌పై ప్రశ్న



పవన్‌కల్యాణ్‌కు ఇండియా వైడ్ ఉన్న క్రేజ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ విషయం మరోసారి రుజువైంది. 'కౌన్ బనేగా కరోడ్‌పతి' సీజన్ 16కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న అమితాబ్ బచ్చన్.. కంటెస్టెంట్‌ను ఓ ఆసక్తికర ప్రశ్నను అడిగారు.. జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వ్యక్తి ఎవరు? అని. ఇందుకు కంటెస్టెంట్ ఆడియన్స్ పోల్ ఎంచుకున్నారు. ఆడియన్స్‌లో 50శాతం మంది పవన్ అని జవాబు చెప్పారు. దీంతో ఈ సమాధానాన్ని లాక్ చేశారు. అది సరైన సమాధానం కావడంతో కంటెస్టెంట్ రూ. లక్ష అరవై వేలు గెలుచుకుని మరో ప్రశ్నకు వెళ్లారు.

ఎంత గౌరవమో!

ఫ్లాష్‌బ్యాక్



తెలుగుజాతి గర్వించదగ్గ నటుడు నందమూరి తారకరామారావు. చిత్ర పరిశ్రమలో తను ఎదుగుతూ మరెందరికో అవకాశాలు కల్పించి ఆదుకున్న మంచి వ్యక్తిగా ఎన్టీఆర్‌కు పేరుంది. అలా ఆయన ఆశీస్సులతో తన కెరీర్‌ను చక్కగా మలుచుకున్న పాత తరం హీరోల్లో కాంతారావు ఒకరు. తొలి సినిమా 'ప్రతిజ్ఞ' తర్వాత సరైన అవకాశాలు లేక ఇంటికి తిరిగి వెళ్లిపోదామనుకున్న ఆయన్ని పిలిచి తన సొంత చిత్రం 'జయసింహ'లో తనతో సమానమైన పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు ఎన్టీఆర్. అలాగే 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడి పాత్ర కూడా ఎన్టీఆర్ గట్టి రికమండేషన్‌తోనే కాంతారావుకు దక్కింది. అలా ఎన్నోసార్లు తనని ఆదుకొన్న ఎన్టీఆర్ అంటే కాంతారావుకు ఎంతో అభిమానం, గౌరవం. కాంతారావు సొంత సినిమా పూజా కార్యక్రమానికి ఎన్టీఆర్ హాజరైన అరుదైన దృశ్యం ఇది. ఇందులో హీరోయిన్ జయంతి కూడా ఉన్నారు.

విడుదలకు ముందే అరవై అవార్డులు

ఇన్ ప్రోగ్రెస్



హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఫియర్'. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శకురాలు హరిత గోగినేని రూపొందిస్తున్నారు. సుజాత రెడ్డితో కలసి ఏ.ఆర్ అభి నిర్మిస్తున్నారు. అరవింద్ కృష్ణ ఓ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న 'ఫియర్' చిత్రం విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అరవైకి పైగా అవార్డులు పొంది సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. 'ఫియర్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు ప్రభు దేవా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. త్వరలో థియేటర్లలో విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

కమ్ బ్యాక్ ఫిల్మ్



'శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి', 'అన్నయ్య', 'ప్రేమ కోసం', 'శివరామరాజు' తదితరులు చిత్రాల్లో నటించిన హీరో వెంకట్ కమ్ బ్యాక్ ఫిల్మ్ 'హరుడు'. హెబ్బా పటేల్, సలోని, నటషా, అలీ ఇతర ముఖ్య పాత్రధారులు. రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ దిక్కల లక్ష్మణరావు నిర్మిస్తున్నారు. ఇది కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్ అని దర్శకుడు చెప్పారు. నవంబర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు.

యాదాద్రి, వేములవాడకు హరీశ్ బినామీ డెయిరీల నెయ్యి

» ఆ ఒప్పందాలను రద్దు చేసి, మదర్ డెయిరీ నెయ్యినే ఆ గుడుల్లో వాడాలి

» మంత్రి సురేఖకు మంత్రి వెంకట్‌రెడ్డి వినతి



హయత్‌నగర్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బినామీ పేర్లతో నిర్వహిస్తున్న డెయిరీల నుంచి వచ్చే నెయ్యిని యాదాద్రి, వేములవాడ దేవాలయాల్లో లడ్డూల తయారీకి ఉపయోగిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఆ డెయిరీలతో ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఫోన్ చేసి కోరారు. శనివారం నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం(మదర్ డెయిరీ)చైర్మన్ ఎన్నిక కార్యక్రమానికి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరీశ్‌రావు బినామీ పేర్లతో చేసిన మోసాలు బయటకు వస్తున్నాయన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, ఆఫీసుల్లో మదర్ డెయిరీ పాలనే వాడేలా ఆదేశాలివ్వాలని నల్లగొండ, భువనగిరి జిల్లా కలెక్టర్లను కోరారు. మదర్ డెయిరీ సుమారు రూ.60 కోట్ల నష్టాల్లో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీ చైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి ఎన్నిక

మదర్ డెయిరీ కొత్త చైర్మన్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వేల్పుపల్లి గ్రామానికి చెందిన గుడిపాటి మధుసూదన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వ్యవసాయ వసతుల నిధుల వినియోగంలో తెలంగాణ టాప్

హైదరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన నిధుల (అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ స్కీమ్)ను ఖర్చు చేయడంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం అవార్డును కూడా అందించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఈస్కీమ్ కింద రాష్ట్రానికి రూ. 2,836 కోట్ల నిధులు వచ్చాయని, వీటి ద్వారా 1,322 వ్యవసాయ ప్రాథమిక ప్రాసెసింగ్ యూనిట్లు, 785 గిడ్డంగులు, 163 యంత్రాలు అద్దెకిచ్చే కేంద్రాలు(కస్టమ్ హైరింగ్ సెంటర్లు), 101 కోతల అనంతర(పోస్ట్ హార్వెస్ట్) చర్యలకు ఉపకరించే సాంకేతికతకు సంబంధించిన యూనిట్లు వంటివి కలిపి మొత్తం 2,199 మౌలిక సదుపాయాల యూనిట్లను నెలకొల్పినట్టు పేర్కొన్నారు. నిజామాబాద్, ఖమ్మం, సిద్దిపేట జిల్లాలు ఈ స్కీమ్ కింద అత్యధిక పనితీరును కనబర్చాయన్నారు. ఈ స్కీమ్ ద్వారా రైతులు ఏర్పాటుచేసే యూనిట్లకు 3శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని, రూ.2 కోట్ల రుణం వరకు ఎలాంటి హామీ అవసరంలేదని ప్రకటనలో తెలిపారు.

ఎఫ్‌టీఎల్ నిల్!

(మొదటి పేజీ తరువాయి)

కాలేదు! చెరువుల సంరక్షణలో కీలకమైన అంశాలను పక్కన పెట్టిన ప్రభుత్వ శాఖలు.. కబ్జాదారులకు ద్వారాలు తెరిచాయి. 'రియల్' ఒత్తిళ్లో.. ఉన్నతస్థాయి ఆదేశాలో తెలియదు కానీ..చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల నిర్ధారణకు నిర్వహించాల్సిన సర్వేను కోల్డ్ స్టోరేజీలో పెట్టేశారు. రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర విభాగాలతో కలిసి చెరువుల సర్వే పూర్తి చేయాల్సిన హెచ్ఎండీఏ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. సంస్థ పరిధిలో 3500పైగా చెరువులుండగా.. 7శాతంలోపు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై తుది నోటిఫికేషన్ జారీ చేసింది. 2540 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన హెచ్ఎండీఏ.. 230 చెరువులకు మాత్రమే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించడం గమనార్హం! గ్రేటర్ నుంచి ఔటర్ లోపలి, వెలుపలి ప్రాంతాల్లోని చెరువుల కబ్జాకు ఇదే ప్రధాన కారణం. ప్రలోభాలు, ఇతర అంశాలకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులు.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఇష్టానికి మారుస్తూ నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ) ఇచ్చేశారు. కొన్నిచోట్ల ఎన్‌వోసీల అవసరం లేకుండానే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు జారీచేసేశారు. ప్రస్తుతం 'హైదరాబాద్ విపత్తుల నిర్వహణ, ఆస్తుల రక్షణ సంస్థ(హైడ్రా)' కూల్చివేస్తున్న భవనాలు ఇలాఅనుమతులు పొందినవే కావడం గమనార్హం.

3500లకు పైగా చెరువుల్లో..

హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 3,532 చెరువులున్నాయి. హైదరాబాద్‌తోపాటు రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, యాదాద్రి జిల్లాల్లో ఉన్న చెరువుల విస్తీర్ణం క్రమంగా కుంచించుకుపోతోంది. ఔటర్ రింగు రోడ్డు పరిధిలో 500 వరకు.. ఔటర్ వెలుపల 3 వేలకు పైగా చెరువులు ఉన్నాయి. అభివృద్ధి విస్తరణ క్రమంలో చెరువులను కాపాడేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 2010లో చెరువుల సంరక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. హెచ్ఎండీఏ కమిషనర్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో జీహెచ్ఎంసీ, జలమండలి, పీసీబీ తదితర శాఖల ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. క్రమం తప్పకుండా కమిటీ సమావేశమై ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల నిర్ధారణ సర్వే, నోటిఫికేషన్ల ప్రకటనను పర్యవేక్షించాలి. కానీ, ఈ కమిటీ సమావేశాలు నామమాత్రంగానే జరిగాయి. సర్వే నిర్వహణ బాధ్యతను హెచ్ఎండీఏ ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించింది. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో పాటు హెచ్ఎండీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. విస్తీర్ణం వివరాలు, మ్యాపులు, వాస్తవ పరిస్థితులను పోల్చి చూసుకొని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై



ఇంజాపూర్ దిలావర్‌ఖాన్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా, నీటిపారుదల శాఖ అధికారులు

ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయాలి. ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించి.. వాటిని పరిశీలించిన తర్వాత కమిటీ ఆమోదంతో తుది నోటిఫికేషన్ జారీ చేస్తారు. చెరువుల విస్తీర్ణం, మ్యాపు, ఎఫ్‌టీఎల్, సర్వే నంబర్లు తదితర వివరాలన్నీ ఉంటాయి. ఒక్కో చెరువుకు ఒక్కో గుర్తింపు నంబరు కేటాయిస్తూ.. విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. ఒక్కసారి తుది నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాత మార్పులకు అవకాశం ఉండదని ఓ అధికారి తెలిపారు. హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో తుది, ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకటించిన చెరువుల వివరాలను అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు.

ఏళ్ల తరబడి సాగుతున్న సర్వే..!

హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులపై 2013లో సర్వే మొదలైంది. 11 ఏళ్లలో 2540 చెరువులకు మాత్రమే ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. 3 వేలకుపైగా చెరువుల సర్వే పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక తుది నోటిఫికేషన్ జారీ చేసినవి 230 మాత్రమే. కొన్ని చెరువుల విస్తీర్ణం, సర్వే నంబర్లు, మ్యాపులు రెవెన్యూ, సాగునీటి శాఖల వద్ద వేర్వేరుగా ఉండడం కూడా ప్రాథమిక నోటిఫికేషన్ జారీలో జాప్యానికి కారణమంటున్నారు. దీంతో దేన్ని ప్రామాణికంగా తీసుకోవాలన్న దానిపై తుది నిర్ణయానికి రాలేకపోతున్నామని హెచ్ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు. హైదరాబాద్ మహానగర తాగునీటి వనరుల్లో ఒకటైన హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ కూడా ఇంకా నిర్ధారణ కాలేదంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రాథమిక నోటిఫికేషన్ ఆధారంగా ఉస్మాన్‌సాగర్(గండిపేట)లో ఆక్రమణలు తొలగించిన హైడ్రా.. హిమాయత్‌సాగర్ విషయంలో వేచిచూసే ధోరణి కనబరుస్తోంది. ఇదిలా ఉంటే.. హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో అనుమతులున్న భవనాల్లో ఫ్లాట్లు కొనడానికి కూడా ప్రజలు వెనకంజ వేస్తున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ సంస్థలు రెవెన్యూ ఇరిగేషన్ విభాగాల చుట్టూ తిరుగుతున్నారు. అనుమతులపై స్పష్టత ఇవ్వాలని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలను కోరుతున్నారు.

హైడ్రా పరిశీలనలో మాసబ్, దిలావర్‌ఖాన్ చెరువులు

» చర్యలు తప్పవు: హైడ్రా అధికారులు

హయత్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు హైడ్రా, నీటిపారుదలశాఖల అధికారులు స్పందించారు. రెండు రోజులుగా హైడ్రా ప్రత్యేక అధికారుల బృందం, స్థానిక నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి ఇంజాపూర్‌లోని దిలావర్‌ఖాన్ చెరువు, తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువులను సందర్శించారు. ఇంజాపూర్‌లో నిర్మిస్తున్న డబల్ బెడ్‌రూమ్ ఇళ్లను, ఆక్రమణకు గురవుతున్న దిలావర్‌ఖాన్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాలను పరిశీలించారు. పాత, కొత్త సర్వే మ్యాపులను పరిశీలించారు. గూగుల్ మ్యాపు ద్వారా చెరువు పూర్తి విస్తరణ, బఫర్ జోన్ వచ్చే ప్రాంతాలను కూడా చూశారు. దిలావర్‌ఖాన్ చెరువు, మాసబ్ చెరువు చుట్టూ తిరిగి ఆక్రమణలను పరిశీలించారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాల వారీగా సర్వే..

చెరువుల సర్వేపై హెచ్ఎండీఏ ప్రత్యేకదృష్టి సారించింది. నిర్ణీత కాలవ్యవధిలో సర్వే పూర్తి చేసి నోటిఫికేషన్లు పంపాలని కలెక్టర్లకు లేఖలు రాసింది. ఆగస్టు 1 నుంచి 65 చెరువుల సర్వే పూర్తయిందని, 269 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశామని.. 30 చెరువుల వివరాలు హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని అధికారులు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 51 చెరువుల తుది నోటిఫికేషన్‌ను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఔటర్ వరకు ఉన్న 500 చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల నిర్ధారణపై హెచ్ఎండీఏ దృష్టి సారించింది. 'రికార్డుల ఆధారంగా నోటిఫికేషన్ ఇస్తాం. ఆక్రమణల విషయంలో ఏం చేయాలన్నది ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకుంటారు' అని హెచ్ఎండీఏ అధికారి చెప్పారు.

హైడ్రా కేసు..అధికారులకు నోటీసులివ్వండి

» పోలీసులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలకు సహకరించారనే హైడ్రా ఫిర్యాదుతో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న రెవెన్యూ అధికారులకు ముందస్తు నోటీసులు ఇవ్వాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. తమపై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) పోలీసులు పెట్టిన కేసులను కొట్టివేయాలని కోరుతూ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు, బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్ హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్లపై పెట్టిన కొన్ని సెక్షన్లకు ఆధారాల్లేవని, మరికొన్ని ఏడేళ్లలోపు జైలుశిక్ష పడేవి మాత్రమేనని పేర్కొంది. బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులివ్వాలని ఆదేశించింది.

ప్రాణం మీదికి తెచ్చిన రీల్స్ సరదా

» గూడ్స్‌రైలెక్కి యువకుడి రీల్స్ కరెంటు షాక్‌తో గాయాలు

కాజీపేట, సెప్టెంబరు 14: యువత రీల్స్ మోజులో పడి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. తాజాగా ఓ యువకుడు గూడ్స్ రైలు బోగి ఎక్కి రీల్స్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై.. 70 శాతం కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన రాజు అనే యువకుడు శనివారం హనుమకొండ జిల్లా కడిపికొండలోని ఓ చర్చిలో జరుగుతున్న కార్యక్రమానికి హాజరయ్యాడు. సమీపంలోని రాంనగర్‌లో నిలిపి ఉన్న రైలు బోగీ ఎక్కి సెల్‌ఫోన్‌లో రీల్స్ చేస్తున్నాడు. ఈ క్రమంలో రైలుపై ఉన్న హైటెన్షన్ కరెంట్ తీగలు రాజుకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురైన రాజు తీవ్రగాయాలతో బోగీ నుంచి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో అతడిని ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనలో రాజు శరీరం 70 శాతం కాలిపోయిందని ఎంజీఎం వైద్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

రాజంపేట, సెప్టెంబరు 14 : పొలంలో గడ్డి కోస్తుండగా తెగిపడిన విద్యుత్ వైరు తాకి షాక్‌తో ఓ రైతు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలో జరిగింది. ఎల్లారెడ్డిపల్లికి చెందిన రైతు ముక్కిరి ఎల్లయ్య (41)కు గుండారం గ్రామ శివారులో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. రోజూలాగే శనివారం కూడా ఎల్లయ్య పొలానికి వెళ్లాడు. బోరు స్టార్టర్ చుట్టూ పెరిగిన గడ్డిని కోస్తుండగా.. అప్పటికే తెగి పడి ఉన్న విద్యుత్ వైరుకు చేయి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

చిన్నారుల కోసం 'సత్యసాయి సంజీవని'

» సిద్దిపేట జిల్లా కొండపాకలో సేవలు ప్రారంభం

కొండపాక, సెప్టెంబరు 14 : గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత వైద్య సేవలందించేందుకు సత్యసాయి సేవా సంస్థ సిద్దిపేట జిల్లా కొండపాకలో ఏర్పాటు చేసిన సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభమైంది. సద్గురు మధుసూదన సాయి ఈ ఆస్పత్రిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండె జబ్బుల బారిన పడి దేశంలో లక్షల మంది పిల్లలు చనిపోతున్నారని తెలిపారు. గుండె ఆపరేషన్లు చేయించుకునేందుకు వేచి ఉంటున్న వారి సంఖ్య అధికంగా ఉందని, ఆపరేషన్‌కు రమ్మని పిలిచే సమయానికి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి మరిన్ని ఆస్పత్రుల ఏర్పాటుకు తాము సిద్ధమని పేర్కొన్నారు. కొండపాక ఆస్పత్రి ఆవరణలో పరిశోధన కేంద్రంతోపాటు నర్సింగ్, పారామెడికల్ కళాశాలను త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి, పల్వర్ సత్యసాయి చిల్డ్రన్స్ కార్డియాలజీ సెంటర్ డాక్టర్ అనగ తులసి, సత్యసాయి సంజీవని చైల్డ్ హార్ట్ కేర్ సెంటర్ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి పాల్గొన్నారు. సత్యసాయి సంజీవని హార్ట్ కేర్ సెంటర్, చిన్నారుల గుండె సంరక్షణ పరిశోధన కేంద్రం ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు శనివారం ఓ ప్రకటన చేశారు.

భద్రాద్రి జిల్లాలో పౌరహక్కుల సంఘం నేతల అరెస్టు

» పోలీసుల చర్యపై ప్రజాసంఘాల నిరసన

మణుగూరు, హైదరాబాద్, సెప్టెంబరు 14 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలోని రఘునాథపాలెం అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయంపై విచారణకు పౌరహక్కుల సంఘం కమిటీ సభ్యులు కరకగూడెం మండలంలో పర్యటించేందుకు ప్రయత్నించగా వారిని శనివారం ఉదయం భద్రాద్రి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, జనరల్ సెక్రటరీ నారాయణతో పాటు మరో 9 మంది నాయకులు మణుగూరు నుంచి వాహనాల్లో కరకగూడెం వస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు శనివారం ఉదయం వారిని అశ్వాపురం, మణుగూరు ప్రాంతాల్లో అదుపులోకి తీసుకుని ఆయా పోలీసుస్టేషన్లకు తరలించారు. ఓ ప్రైవేటు బస్సులో వారిని ఖమ్మానికి తరలించారు. పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ ఈ ఘటనపై ఒక ప్రకటన విడుదల చేస్తూ వాస్తవాలను బయటకు రాకుండా చేసే ఇటువంటి ప్రయత్నాలను పౌర సమాజం నిరసించాలని కోరారు. ఈ అరెస్టులను సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా, పౌర హక్కుల సంఘం ఖమ్మం జిల్లా నేత ఆర్. మధుసూదన్ రెడ్డి, తెలంగాణ ప్రజాఫ్రంట్, మహిళా సంఘం నేతలు ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక స్టీరింగ్ కమిటీ నేతలు ఖండించారు.

వైసీపీ మాజీ ఎమ్మెల్యే.. కాటసాని మా ప్లాట్లను కబ్జా చేశారు

» సర్వే చేసి మా ప్లాట్లను మాకు ఇప్పించండి

» పద్మావతినగర్ అసోసియేషన్ విజ్ఞప్తి

పంజాగుట్ట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): "పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు కొన్నాం. మా ప్లాట్ల పక్కనే కర్నూలు జిల్లా పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్‌సీపీ నేత కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన భార్య ఉమా మహేశ్వరమ్మ భూమిని కొనుగోలు చేశారు. ఆ తర్వాత మా ప్లాట్లను కబ్జా చేశారు. వాటిలోకి వెళ్లకుండా.. చుట్టూ ప్రహరీగోడ కట్టారు" అని అమీన్‌పూర్ ప్రాంతంలోని పద్మావతినగర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వెల్లడించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, ప్లాట్ల యజమానులు మాట్లాడారు. 1986లో సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌కు చెందిన రైతులు, తదితరుల నుంచి 24 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని వారు వివరించారు. గ్రామ పంచాయతీ అనుమతితో లేఅవుట్‌ను అభివృద్ధి చేశామన్నారు. "2006లో మా లేఅవుట్ పక్కన కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన భార్య 58 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. మా లేఅవుట్‌లో ఉన్న 35 ప్లాట్లను కొన్నారు. వాటిని చదును చేస్తూ మా ప్లాట్లను కబ్జా చేసి, చుట్టూ ప్రహరీగోడను నిర్మించారు. మేంప్రహరీ గోడను కూల్చేస్తే.. మళ్లీ నిర్మించుకుని, మా ప్లాట్లలోకి వెళ్లకుండా చేశారు. శిష్లా రమేశ్ అనే వ్యక్తి కూడా తప్పుడు పత్రాలను సృష్టించి, మా ప్లాట్లలో కొన్నిటిని ఇతరులకు విక్రయించాడు. కొన్నిటిని డబుల్ రిజిస్ట్రేషన్ చేయించాడు" అని వాపోయారు. వీటిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర మనోవేదనను అనుభవిస్తున్న మాకు.. హైడ్రా రూపంలో ఓ ఉపశమనం లభించింది. కాటసాని ఆక్రమించిన ప్రహరీగోడతోపాటు.. కొన్ని కట్టడాలను హైడ్రా కూల్చివేసిందన్నారు. అయినా సమస్య తీరలేదని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి, సర్వే చేయించి ప్లాట్లను తమకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎలక్ట్రిక్ బైక్ తయారు చేసిన భద్రాద్రి జిల్లా యువకుడు

» రెండు గంటల చార్జింగ్‌తో 80 కి.మీల ప్రయాణం

» బీటెక్ చేసి మెకానిక్‌గా పని... మోహంత్‌పై ప్రశంసలు

కరకగూడెం, సెప్టెంబర్ 14: పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతుండంతో ప్రస్తుతం బ్యాటరీతో నడిచే వాహనాలకు డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలోనే అనేక కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేస్తున్నాయి. అయితే 'మనమే ఎందుకు సొంతంగా ఎలక్ట్రిక్ బైక్‌ను తయారు చేయకూడదు?' అని వినూత్న ఆలోచన చేశాడో యువకుడు. ఉన్నత విద్యనభ్యసించినా సరైన అవకాశాలు లేక మెకానిక్‌గా మారిన అతను తన ప్రతిభను ఉపయోగించి ఒక ఎలక్ట్రిక్ బైక్‌ను తయారు చేశాడు. అతను తయారుచేసిన బైక్ 2 గంటల చార్జింగ్‌తో 80 కి.మీ. మైలేజీ ఇస్తుండడం విశేషం. భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి మోహంత్.. 2014లో భద్రాచలంలోని పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్(ఈఈఈ) పూర్తిచేశాడు. సరైనఉద్యోగం రాకపోవడంతో మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రయోగాత్మకంగా ఓ పాత బైకును తీసుకొని దాన్ని బ్యాటరీతో నడిచేలా మార్పులు చేశాడు. పాత బైకును కేవలం రూ.25వేల వ్యయంతో ఎలక్ట్రిక్ బైక్‌గా మార్చిన మోహంత్ దాన్ని మైలేజ్‌ను పరీక్షించగా రెండు గంటల చార్జింగ్‌తో అది 80 కిలోమీటర్లు ప్రయాణించింది. దాంతో మోహంత్‌ను స్థానిక ప్రజలు అభినందించారు.

ప్రభుత్వం అవకాశమిస్తే ముందుకెళ్తా: మోహంత్

"ఉన్నత చదువులు చదివినా ఉద్యోగం రాకపోవడంతో కుటుంబ పోషణ కోసం బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాను. ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తే మరింత నైపుణ్యంతో ఇంకా అద్భుతమైన ఆవిష్కరణలు చేస్తాను. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాలు కొనాలంటే లక్షల్లో ధరలు ఉండటంతో చాలామంది కొనలేకపోతున్నారు. ఎవరికైనా కావాలంటే అతి తక్కువ ఖర్చుతో ఇలాంటి వాహనాలు తయారుచేసి ఇస్తాను."

రైల్వేలైన్‌లో భూమి కోల్పోయి రైతు ఆత్మహత్య

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన

తంగళ్లపల్లి, సెప్టెంబరు 14: రైల్వే లైన్‌లో భూమిని కోల్పోయిన ఓ రైతు పనిలేక మద్యానికి బానిసై పురుగుల మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలో శనివారం జరిగింది. పాపయ్యపల్లె గ్రామానికి చెందిన రైతు బుర్ర అంజయ్య(53) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. జిల్లాలోని కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లైన్‌లో భాగంగా తనకు ఉన్న ఎకరం భూమిని కోల్పోయాడు. పరిహారం వచ్చినా పని లేకుండా పోయింది. కొన్ని రోజులుగా కూలీ పని దొరకక శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

అరుదైన వ్యాధుల ఔషధాలకు
900 కోట్లతో కేంద్రం ప్రాజెక్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: అరుదైన వ్యాధులతో బాధపడేవారికి ఉచితంగా ఔషధాలను అందించేందుకు కేంద్రప్రభుత్వం రూ.900 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటికే.. ఈ కోవలోని రోగులకు చేయూతనందించేందుకు రూ.50 లక్షల దాకా నేరుగా వారి ఖాతాలకు నగదు బదిలీ చేస్తుండగా.. ఇప్పుడు ఖరీదైన ఔషధాల ధరలను అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించింది. గౌచర్ డిసీజ్(జన్యుపరమైన లోపాలతో కాలేయం, ప్లీహం వంటి ప్రాంతాల్లో కొవ్వు పేరుకుపోయి.. అవయవాల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది), డుచెన్ కండరాల బలహీనత, సిస్టిక్ ఫైబ్రోసిస్(ఒక జన్యువు మ్యుటేషన్ కారణంగా ఊపిరితిత్తులు, క్లోమం, ఇతర అవయవాలు దెబ్బతినడం), వెన్నెముక కండరాల క్షీణత వంటి 13 రకాల రుగ్మతలను అరుదైన వ్యాధులుగా పరిగణిస్తారు. భారత్‌లో అరుదైన వ్యాధులతో సతమతమవుతున్న వారి సంఖ్య 19 కోట్ల వరకు ఉంటుందని కేంద్ర ఆరోగ్య శాఖ అంచనా.

ప్రధాని అయ్యే అవకాశం వచ్చినా తిరస్కరించాను



నాగ్‌పూర్, సెప్టెంబరు 14: కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు ప్రధాని అయ్యే అవకాశం వచ్చినా.. తాను ఆ ప్రతిపాదనను తిరస్కరించానని చెప్పారు. శనివారం నాగ్‌పూర్‌లో జర్నలిజం అవార్డుల వేడుకలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, "ఒకసారి ఓ నేత నా వద్దకు వచ్చారు. మీరు ప్రధాని రేసులో నిలబడితే మేమంతా మీకు మద్దతు పలుకుతామని ఆయన నాతో చెప్పారు. అయితే, ప్రధాని కావడం నా లక్ష్యం కాదు. నేను అనుకున్న దానికి నేను ఎప్పుడూ కట్టుబడి ఉంటాను." అని కరాఖండీగా ఆయనతో చెప్పానని తెలిపారు. ఏ నేతతో ఎప్పుడు ఈ వ్యాఖ్యలు చేసింది ఆయన చెప్పలేదు.

హిందీ, స్థానిక భాషల మధ్య పోటీ లేదు: అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: హిందీ, ఇతర భారతీయ భాషల మధ్య ఎప్పుడూ పోటీ ఉండదని, అవి మిత్ర భాషలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. అన్ని ఇతర భారతీయ భాషలను బలోపేతం చేసేదాకా హిందీని ప్రోత్సహించడం సాధ్యంకాదన్నారు. హిందీ అన్ని స్థానిక భాషలకు మిత్రుడి వంటిదన్నారు. శనివారం హిందీ దివస్ సందర్భంగా నాలుగో అఖిల భారతీయ రాజ్‌భాషా సమ్మేళన్‌ను ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ.. హిందీని ఒక కమ్యూనికేషన్ భాషగా, ఒక ఉమ్మడి భాషగా, ఒక సాంకేతిక భాషగా, ఇప్పుడు అంతర్జాతీయ భాషగా మార్చేందుకు ప్రతిజ్ఞ చేసేందుకు హిందీ దివస్ ఒక సందర్భమన్నారు. హిందీని అధికారిక భాషగా స్వీకరించి 75ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు.

ప్రథమ వందేభారత్ మెట్రో ప్రారంభం రేపు

అహ్మదాబాద్, సెప్టెంబరు 14: దేశంలోని ప్రప్రథమ వందేభారత్ మెట్రో రైలును ప్రధాని మోదీ సోమవారం ఇక్కడ ప్రారంభించనున్నారు. ఇది అహ్మదాబాద్-భుజ్‌ల మధ్య తిరగనుంది. మొత్తం ఏసీ బోగీలు ఉన్న ఈ రైలుకు ఎలాంటి రిజర్వేషన్ సౌకర్యం ఉండదు. రైలు బయలుదేరడానికి కొద్ది సేపు ముందు కౌంటర్‌లో టిక్కెట్లు తీసుకుంటే సరిపోతుంది. 1,150 మంది కూర్చోవడానికి, 2,058 మంది నిల్చోవడానికి ఇందులో సౌకర్యాలు ఉన్నాయి. ఇది గంటకు 110 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. కాగా, దుర్గ్ నుంచి విశాఖపట్నం మధ్య ప్రయోగాత్మకంగా నడుస్తున్న వందేభారత్ రైలుపై ఛత్తీస్‌గఢ్‌లోని మహాసముంద్ జిల్లా బాగ్‌బహరా స్టేషన్ వద్ద కొందరు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో మూడు బోగీల అద్దాలు దెబ్బతిన్నాయి. ఈ రైలును సోమవారం అధికారికంగా ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఈ దాడి జరగడం గమనార్హం.

జీఎస్టీ లోపాలు చెబితే అవమానిస్తారా: స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో ఇటీవల జరిగిన పారిశ్రామికవేత్తల సమావేశంలో జీఎస్టీ లోపాలను ఎత్తిచూపిన హోటల్ యజమాని పట్ల కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల వైఖరి గర్హనీయమని తమిళనాడు సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా పర్యటన ముగించుకుని శనివారం ఉదయం చెన్నై చేరిన స్టాలిన్.. విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. జీఎస్టీ అమలు కఠినంగా ఉందని, ఆ పన్నుల విధానాన్ని సులభతరం చేయాలని కోరిన కోయంబత్తూరు అన్నపూర్ణా హోటల్ అధినేత శ్రీనివాసన్‌ను పిలిపించుకుని బలవంతంగా క్షమాపణలు చెప్పించుకోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.

టపాసులతో కేజ్రీకి స్వాగతం.. కేసు నమోదు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఆయన అభిమానులు టపాసులు కాల్చి స్వాగతం పలికారు. ఈ ఘటనకు సంబంధించి ఢిల్లీ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులపై శనివారం కేసు నమోదు చేశారు. న్యూఢిల్లీలో టపాసుల తయారీ, వినియోగం, అమ్మకంపై నిషేధం ఉండడమే ఇందుకు కారణం. వాయు కాలుష్యం నియంత్రణకు తోడు రాబోయే శీతాకాలం నేపథ్యంలో టపాసులపై నిషేధం విధిస్తూ ఢిల్లీ ప్రభుత్వం సోమవారమే ప్రకటన చేసింది.

అస్త్ర క్షిపణుల కొనుగోలుకు అర్మేనియా చర్చలు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: భారతదేశం స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన 'అస్త్ర' క్షిపణులను కొనుగోలు చేయాలని అర్మేనియా భావిస్తోంది. ఇందుకోసం మన దేశంతో చర్చలు కూడా ప్రారంభించింది. రక్షణ శాఖలోని విశ్వసనీయ వర్గాల ద్వారా ఈ విషయం వెల్లడైంది. తమ వద్ద ఉన్న సుఖోయ్ 30ఎస్ యుద్ధ విమానాలను కూడా భారత్ తరహాలో ఆధునీకరించుకోవాలని అర్మేనియా నిర్ణయించిందని, దీనికి కూడా భారత్ నుంచి సహాయం కోరుతోందని వారు తెలిపారు. అయితే, ఈ చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయన్నారు.

సాక్ష్యాధారాల ధ్వంసంపై ఆర్జీ కర్
మాజీ ప్రిన్సిపల్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

సరైన జవాబులు రాకపోవడంతో అదుపులోకి తీసుకుంది. 8 సార్లు ప్రశ్నించినా.. ప్రతిసారీ వేర్వేరు సమాధానాలు ఇచ్చారని పేర్కొంది. ఈ కేసులో 17వ తేదీ నాటికి కోల్‌కతా హైకోర్టుకు నివేదిక ఇవ్వాల్సి ఉంది. మరో ఇద్దరు కోల్‌కతా పోలీసులపైనా సీబీఐ నజర్ పెట్టినట్లు సమాచారం. కాగా, అంతకుముందు సీబీఐ.. సందీప్ ఘోష్‌పై అత్యాచారం అభియోగాలను నమోదు చేసినట్లు పీటీఐ పేర్కొంది. మరోవైపు మెడికోపై హత్యాచారం కేసులో సందీప్ ఇప్పటికే సీబీఐ విచారణను ఎదుర్కొంటున్నారు. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆరోపణలపై ఆయనను దర్యాప్తు సంస్థ ఈ నెల 2న అరెస్టు కూడా చేసింది. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఆగస్టు 9న యువ వైద్యురాలు.. ఆర్జీ కర్ సెమినార్ హాల్‌లో హత్యాచారానికి గురయ్యారు. హాల్‌లోకి వెళ్లి బయటకు వస్తున్నట్లుగా ఉన్న సీసీ టీవీ దృశ్యాల మేరకు వాలంటీర్ సంజయ్ రాయ్‌ను సీబీఐ అరెస్టు చేసింది. పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. నార్కో టెస్టు చేయాలనుకున్నా.. అతడు ఒప్పుకోకపోవడంతో సాధ్యం కాలేదు.

వైద్యులతో సీఎం చర్చలపై ప్రతిష్ఠంభన

బెంగాల్ వైద్యులు, సీఎం మమతా మధ్య చర్చలపై ప్రతిష్ఠంభన వీడలేదు. బాధిత మెడికో కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నెల రోజులకు పైగా నిరసనలు చేస్తున్న వైద్యులు.. శనివారం సీఎంతో చర్చలకు సిద్ధమయ్యారు. అయితే, వాటిని ప్రత్యక్ష ప్రసారం చేయాలని పట్టుబట్టారు. విషయం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున ఇది సాధ్యం కాదని మమతా స్పష్టం చేశారు. అంగీకారం కుదిరిన డిమాండ్లపై నిమిషాల్లో సంతకం చేస్తానని కూడా చెప్పారు. దీనికిముందు ఆమె వైద్యుల దీక్షా శిబిరానికి వెళ్లారు. సీఎం ఆహ్వానం మేరకు ఆమె ఇంటికి వెళ్లినప్పటికీ.. ప్రత్యక్ష ప్రసారానికే పట్టుబట్టడంతో చర్చలు సాగలేదు. 2 గంటల తర్వాత వైద్యులు కన్నీరుపెడుతూ వెళ్లిపోయారు. అయితే, తనను పదేపదే అవమానించవద్దని.. ఇప్పటికే మూడుసార్లు ఇలా చేశారని మమత అసహనం వ్యక్తం చేశారు.



శనివారం తన నివాసం వెలుపల జూనియర్ డాక్టర్లతో మాట్లాడుతున్న మమత



ఎస్‌హెచ్‌వో అభిజిత్

అంతిమ ఘడియల్లో కశ్మీర్ ఉగ్రవాదం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నది తాను కాదని, కశ్మీర్ ప్రజలేనని కొనియాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్-ఎన్సీ-పీడీపీ, కశ్మీర్ యువతకు మధ్య పోరాటమని.. ఓవైపు కుటుంబ పార్టీలు, మరోవైపు కలలను నెరవేర్చుకునే ప్రయత్నంలో ఉన్న తన చెల్లెళ్లు, కుమార్తెలు ఉన్నారని ప్రధాని అన్నారు. ఉగ్రవాదం, వారసత్వ రాజకీయాలు సుందర కశ్మీర్‌ను దారుణంగా దెబ్బతీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం దోడా జిల్లాలో మోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గత 42 ఏళ్లలో ఇక్కడ పర్యటించిన తొలి ప్రధానిగా ఆయన ప్రత్యేకంగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో కశ్మీరీ భాషలో ప్రసంగాన్ని ప్రారంభించారు. రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికలు భవిష్యత్‌ను నిర్దేశించేవని పేర్కొన్నారు. ఇకపై ఈ ప్రాంతంలో కర్ఫ్యూలు ఉండవన్నారు. స్వాతంత్ర్యం వస్తూనే కశ్మీర్‌పై విదేశీ శక్తులు కన్నేశాయని, తర్వాత కుటుంబ పార్టీలు ప్రజలను వంచించాయని విమర్శించారు. వెనుకబాటు పాపం ఆ మూడు పార్టీలదేనని, అవినీతి, భూకబ్జాలను ప్రోత్సహించి ప్రజల హక్కులను హరించాయని ధ్వజమెత్తారు. 2000 సంవత్సరం నుంచి నిలిచిపోయిన పంచాయతీ, బ్లాక్, జిల్లా డెవలప్‌మెంట్ కౌన్సిల్స్ ఎన్నికలు నిర్వహించి కొత్త తరాన్ని ప్రోత్సహించామని, తద్వారా 35 వేలమంది యువత పదవులు చేపట్టారని మోదీ చెప్పారు. కాంగ్రెస్ హయాంలో శ్రీనగర్ లాల్‌చౌక్ వద్దకు కేంద్ర హోంమంత్రి కూడా వెళ్లలేకపోయారన్నారు.



ఢిల్లీలోని తన అధికారిక నివాసం ఆవరణలో ఇటీవలే పుట్టిన ఆవుదూడతో ఆడుకుంటున్న ప్రధాని మోదీ. ఈ దూడ పేరు 'దీపజ్యోతి' అని మోదీ తెలిపారు.

విదేశీ గడ్డపై భారత్‌ను అవమానించారు..

కాంగ్రెస్ రాజ కుటుంబం దేశంలోనే అత్యంత అవినీతి రాజ కుటుంబం అని, అత్యంత అవినీతి పార్టీ కాంగ్రెస్ అని, అధికారం కోసం అవసరమైతే ఎన్నికలను తారుమారు చేస్తుందని ప్రధాని ధ్వజమెత్తారు. సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెడుతోందని తాను హెచ్చరిస్తే.. తప్పుబట్టారని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న హిమాచల్‌లో ఏం జరుగుతోందో గమనించాలని సూచించారు. రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో ఉండగా, ఆయన పాల్గొన్న కార్యక్రమంలో భారత జర్నలిస్టుపై దాడి జరిగిందని ఆరోపించారు. మొహబ్బత్ కా దుకాణ్, వాక్ స్వాతంత్ర్యం గురించి మాట్లాడేవారు.. విదేశీ గడ్డ మీద భారత్‌ను అవమానించారని మండిపడ్డారు. తాము గనుక 20 సీట్లు అదనంగా గెలిస్తే బీజేపీ వాళ్లను జైలుకు పంపేవారమన్న ఖర్గే వ్యాఖ్యలను మోదీ ప్రస్తావిస్తూ.. అధికారం కావలనుకుంటోంది ప్రజల అభివృద్ధికా? వారిని జైలుకు పంపేందుకా? అని నిలదీశారు. కాగా, కశ్మీర్‌లో కిష్త్వాడ్, దోడా, రాంబన్, దక్షిణ కశ్మీర్ జిల్లాల్లోని 24 నియోజకవర్గాల్లో ఈ నెల 18వ తేదీన తొలి విడత పోలింగ్ జరగనుంది.

అల్విదా కామ్రేడ్!

- ముగిసిన ఏచూరి అంతిమయాత్ర
- ఎయిమ్స్‌కు భౌతికకాయం అప్పగింత
- సోనియా, పవార్, అఖిలేశ్ నివాళులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వామపక్ష యోధుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అంతిమయాత్ర ముగిసింది. వామపక్షాల అగ్రనేతలు, నాయకులు, వేలాది కార్యకర్తలు అంతిమయాత్రలో పాల్గొని, అణగారినవర్గాల కోసం జీవితాంతం పోరాడిన ఎర్రసూరీడు ఏచూరికి చివరి వీడ్కోలు పలికారు. శనివారం మధ్యాహ్నం పార్టీ ప్రధాన కార్యాలయం ఏకే గోపాలన్ భవన్ నుంచి ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన 14-అశోకా రోడ్(సీపీఎం మాజీ కేంద్రకార్యాలయం) వరకు జరిగిన అంతిమయాత్ర.. అక్కడి నుంచి ఎయిమ్స్ వరకు కొనసాగింది. ఏచూరి భౌతికకాయాన్ని వైద్య బోధన, పరిశోధనల కోసం ఎయిమ్స్ అధికారులకు అప్పగించారు. సహచర కామ్రేడ్‌కు అంతిమ వీడ్కోలు పలుకుతూ సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరాట్, మాణిక్ సర్కార్, పినరయి విజయన్, బృందాకరాట్, బీవీ రాఘవులు, సుభాషిణీ అలీ తదితరులు అంతిమయాత్రను ముందుండి నడిపించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆ పార్టీ నేతలు బి.మధు, తమ్మినేని వీరభద్రం, శ్రీనివాసరావు, జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు, టి.సాగర్, డీజీ నర్సింహారావు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

అగ్రనేతల నివాళులు

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ.. ఏచూరి భౌతికకాయానికి నివాళులర్పించి, ఏచూరి భార్య సీమాచిస్తీ, కుమార్తె అఖిలను ఓదార్చారు. కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, చిదంబరం, సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్, కపిల్ సిబ్బల్, ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్, డీఎంకే నేతలు కనిమొళి, బాలు, బంగ్లాదేశ్, నేపాల్ వామపక్ష నేతలు.. ఏచూరి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకే కాకుండా ప్రజాస్వామ్య వాదులకు తీరని నష్టమని బీవీ రాఘవులు అన్నారు. ఏచూరి స్ఫూర్తితో వామపక్ష ఉద్యమాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.



లోకం తీరు



చైనా కంపెనీల్లో
సెబీ చీఫ్ పెట్టుబడులు

- కాంగ్రెస్ సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: చైనాకు భారత్‌కు మధ్య ఘర్షణ పరిస్థితులు నెలకొన్న సమయంలో, ఆ దేశానికి చెందిన పలు కంపెనీల్లో సెబీ చెయిర్ పర్సన్ మాధబి పురీ బుచ్ పెట్టుబడులు పెట్టారని కాంగ్రెస్ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ నేత పవన్‌ఖేరా శనివారం దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. 2021-24 మధ్య కాలంలో మాధబి అమెరికాలో పలు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారన్నారు. వీటిలో వాన్‌గార్డ్ టోటల్ స్టాక్‌మార్కెట్ ఈటీఎఫ్, ఏఆర్‌కే ఇన్నొవేషన్ ఈటీఎఫ్‌లతోపాటు చైనా కంపెనీలు.. గ్లోబల్ ఎక్స్ ఎంఎస్‌సీఐ చైనా కన్స్యూమర్, ఇన్‌వెస్కో చైనా టెక్నాలజీ ఈటీఎఫ్ వంటివి కూడా ఉన్నాయన్నారు. 'ఓవైపు చైనా దురాక్రమణకు పాల్పడుతున్నా.. అలాంటిదేమీ లేదని చైనాకు ప్రధాని మోదీ క్లీన్‌చిట్ ఇస్తుంటారు. అదే దారిలో సెబీ చెయిర్ పర్సన్ ఆ దేశ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు' అని పవన్ ఖేరా తీవ్ర విమర్శలు చేశారు. 2017-23 మధ్య కాలంలో సెబీ పూర్తికాలపు సభ్యురాలిగా, చెయిర్ పర్సన్‌గా మాధబి బుచ్ రూ.36.9 కోట్ల విలువైన లిస్టెడ్ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టారని, సెబీ సభ్యుల ప్రవర్తనా నియమావళిలోని సెక్షన్‌కు 6కు ఇది పూర్తి విరుద్ధమన్నారు. దీంతోపాటు, 2017-21 మధ్య ఆమె.. విదేశాల్లో ఆస్తులను కలిగి ఉన్నారని తెలిపారు. వీటి గురించి ప్రభుత్వంలో ఏ విభాగానికైనా ఆమె సమాచారం అందించారా? అని ప్రశ్నించారు. తనకు 99% వాటా ఉన్న అఘోరా అడ్వైజరీ కంపెనీ కార్యకలాపాలు.. తాను సెబీలో చేరగానే నిలిచిపోయాయని మాధబి అబద్ధం చెప్పారని పవన్ ఖేరా ఆరోపించారు. ఇప్పటికీ, ఆ కంపెనీలో ఆమెకు 99 శాతం వాటా ఉందన్నారు.

పన్నుల వాటాలో అన్యాయంపై
కొత్త వ్యూహం

8 రాష్ట్రాల సీఎంలకు సిద్దరామయ్య లేఖ

బెంగళూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పన్నుల వాటా పంపిణీలో రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై జాతీయ స్థాయిలో పోరాటానికి కర్ణాటక సీఎం సిద్దరామయ్య సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఈ నెల 11న ఆయన.. అధికాదాయం ఉన్న 8 రాష్ట్రాల (ఏపీ, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, పంజాబ్, గుజరాత్, హరియాణ, కేరళ) సీఎంలకు లేఖలు పంపారు. వీరితో ఆర్థిక సమాఖ్య వాదంపై బెంగళూరులో ఓ సదస్సు నిర్వహించడానికి సిద్ధమయ్యారు. అధికాదాయం ఉన్న రాష్ట్రాల పన్నులను రాజకీయ లబ్ధి కోసం యూపీ, బిహార్ వంటి రాష్ట్రాలకు కేంద్రం పంచుతోందని సిద్దరామయ్య గతంలోనూ విమర్శించారు. ఇటీవల 16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుల ముందు కూడా ఆయన.. కేంద్ర ఖజానాకు కర్ణాటక నుంచి వెళ్లే ప్రతి రూపాయిలో కేవలం 15 పైసలు మాత్రమే తిరిగి వెనక్కి ఇస్తోందని ఆరోపించారు.

సీఎంఆర్ఎఫ్‌కు దివీస్ లాబొరేటరీస్ రూ.5 కోట్ల విరాళం

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి శనివారం దివీస్ లాబొరేటరీస్ 5కోట్ల విరాళం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన చెక్కును కంపెనీ సీఈవో డాక్టర్ కిరణ్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి అందజేశారు.



సీఎం రేవంత్‌కు చెక్కును అందజేస్తున్న దివీస్ సీఈవో కిరణ్

టీపీసీసీ నూతన చీఫ్‌గా నేడు మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ నూతన చీఫ్‌గా బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ఆదివారం గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు టీపీసీసీ చీఫ్‌గా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ముందుగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి నివాళులు అర్పించనున్నారు. అనంతరం గాంధీభవన్‌కు భారీ ర్యాలీగా వెళ్తారు. మధ్యాహ్నం 2 గంటలకు గాంధీభవన్‌కు చేరుకోనున్న మహేశ్ కుమార్ గౌడ్.. ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తర్వాత 2.45 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా టీపీసీసీ చీఫ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఇందిరా భవన్ ముందు సభ జరగనుంది. కాగా.. టీపీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి సంబంధించి గాంధీభవన్‌లో చేసిన ఏర్పాట్లను శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహేశ్ కుమార్ గౌడ్‌కు స్వాగతం పలికేందుకు ఆదివారం పార్టీ కార్యకర్తలు గాంధీభవన్‌కు పెద్దఎత్తున రావాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా మహేశ్ కుమార్ గౌడ్ చర్యలు తీసుకుంటారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని శనివారం ఆయన నివాసంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు షబ్బీర్ అలీ శాలువా కప్పి అభినందించారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే దాడులు

- హామీలను మరిచి డైవర్షన్ రాజకీయాలు
- రాష్ట్రంలో హెడ్‌లైన్ మేనేజ్‌మెంట్ నడుస్తోంది
- శాంతిభద్రతలను కాపాడలేని అసమర్థ సీఎం
- మీడియాతో మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్ సిటీ/మియాపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో రోజుకో అంశంతో ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరిచి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు.. ఇందులో భాగంగానే తమ ఎమ్మెల్యేలపై దాడులూ చేయిస్తున్నారు" అని కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. శాంతిభద్రతలను కాపాడలేని అసమర్థ, చేతకాని సీఎం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. శనివారం అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చిన కేటీఆర్.. కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. అరికెపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి మధ్య వివాదం, కౌశిక్‌రెడ్డి ఇంటిపై గాంధీ అనుచరుల దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 9 నెలలుగా హెడ్‌లైన్ మేనేజ్‌మెంట్ నడుస్తోందని విమర్శించారు. హామీల అమలును దాటవేస్తూ పాలకులు గారడీ మాటలు చెబుతున్నారని విమర్శించారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలకు దమ్ముంటే రాజీనామా చేసి, మళ్లీ పోటీ చేయాలన్న కౌశిక్‌రెడ్డి మాటల్లో తప్పేముందని ప్రశ్నించారు. కోర్టు తీర్పు వస్తే తమ పదవులు పోతాయని పార్టీ మారిన ఎమ్మెల్యేలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఆ భయంతోనే రేవంత్‌రెడ్డికి తొత్తులుగా ఉన్న వారు తమపై దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి వంటి దౌర్భగ్యపు, చరిత్రహీన సీఎంను గతంలో ఎప్పుడూ చూడలేదని, పోలీసుల ఎస్కార్ట్‌తో ఓ ఎమ్మెల్యే ఇంటిపై దాడికి పాల్పడతారా? ఇదెక్కడి దుష్ట సంప్రదాయమని మండిపడ్డారు. "ఉమ్మడి ఏపీ సీఎంలుగా పని చేసిన చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డినే మేము ఎదుర్కొన్నాం. వారితో పోలిస్తే నువ్వు చాలా చిన్నోడివి.. చిట్టినాయుడు, బుల్లి అబ్బాయి వంటి వాడివి.. పదవి ఎవరికీ శాశ్వతం కాదు" అని రేవంత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి ఘటనలో పోలీసులనూ వదిలిపెట్టమని, న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పది మంది ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని చెప్పుకొన్న రేవంత్.. హైకోర్టు తీర్పు తర్వాత మాట మార్చారని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రజలందరూ తమ వాళ్లేనని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లపాటు ఒక్క ప్రాంతీయ విద్వేష ఘటన చోటు చేసుకోలేదని గుర్తు చేశారు. అందుకే హైదరాబాద్ ప్రజలు తమను కడుపు నిండా ఆశీర్వదించారన్నారు. దీంతో హైదరాబాద్ ప్రజలపై సీఎం రేవంత్‌రెడ్డి పగపట్టారని, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. హైడ్రాను తీసుకొచ్చి ఆగమాగం చేస్తున్నాడని దుయ్యబట్టారు.



కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడుతున్న కేటీఆర్

దివ్యాంగుల ఇళ్లను కూలుస్తారా?

తిమ్మాజిపేట: ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మహబూబ్‌నగర్‌లోని ఆదర్శనగర్‌లో అక్రమ నిర్మాణాల పేరుతో దివ్యాంగుల ఇళ్లను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూలు జిల్లా నేరేళ్లపల్లిలోని ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలమూరు బిడ్డనంటూ గొప్పలు చెప్పుకొనే సీఎం రేవంత్‌కి పేదోళ్లపై వివక్ష ఎందుకని ప్రశ్నించారు.

గాంధీపై అక్రమ చొరబాటు కేసు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మరో 14 మందిపై గచ్చిబౌలి పోలీసులు అక్రమ చొరబాటు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు ఉప్పలపాటి శ్రీకాంత్, బి గౌతంగౌడ్, రాంపల్లి వెంకటేష్, జి రాములు, నరేష్, మేల శివ, రాధిక, మంజుల, చంద్రిక గౌడ్, రాగం నరేందర్ యాదవ్, డీ వెంకటేష్ గౌడ్, అష్రఫ్, రఘునాథ్ రెడ్డి, మోహన్‌గౌడ్‌పై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గాంధీ ఆయన అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదైందని సోషల్ మీడియాలో వైరలవుతున్న వార్తల్లో నిజం లేదని పోలీసులు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేలు బజారున పడి
తన్నుకోవడం బాధేసింది

- అరికెపూడి గాంధీ ఏ పార్టీ ఎమ్మెల్యేనో.. ఇటీవల అసెంబ్లీలో సభాపతి చెప్పారు
- గతంలో నన్ను సీఎల్పీ నేతగా లేకుండా చేశారు
- పీఏసీ చైర్మన్ పదవి కూడా నాకు ఇవ్వలేదు
- ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టించింది బీఆర్ఎస్సే: భట్టి



పెద్దపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు బజారున పడి తన్నుకోవడం బాధ అనిపిస్తోందని, అతిగా ముందుకు పోతే ఎలా నియంత్రించాలో ప్రభుత్వానికి తెలుసని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఆయన పర్యటించారు. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి మధ్య జరుగుతున్న వివాదంపై నందిమేడారంలో మీడియా అడిగిన ప్రశ్నలకు భట్టి స్పందించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాన్ని గౌరవించాలి కాబట్టి, వాళ్లు బజారున తన్నుకుంటూ ఉంటా ఉంటే కొంత ఉపేక్షించామన్నారు. గాంధీ ఏ పార్టీకి చెందిన వారు అనే విషయమై ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో పార్టీల వారీగా సభాపతి చెప్పారని, ఆయన తమ పార్టీ నేత కాదంటే ఎలా అని ఆయన బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. ఎందుకు ఈ గందరగోళమని అన్నారు. గతంలో తనను సీఎల్పీ నేతగా లేకుండా చేశారని, పీఏసీ చైర్మన్ పదవి తనకు ఇవ్వకుండా వేరే వాళ్లకు ఇచ్చారని, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువల గురించి బీఆర్ఎస్ ఇప్పుడు మాట్లాడవద్దని సూచించారు. సీఎల్పీ లేకుండా ఆనాడు బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలు మరిచిపోలేదన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం భ్రష్టుపట్టిపోవడానికి కారణం బీఆర్ఎస్ పార్టీ అని మండిపడ్డారు. ఎమ్మెల్యేల వివాదం వెనుక ఒక పెద్ద తల ఉందంటున్న బీజేపీ నాయకులు రాజకీయ ఉనికి కోసం తహతహలాడుతున్నారని, వారిని ప్రజలు పట్టించుకోరని భట్టి అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదు, మోటార్లు నడవవని అన్న బీఆర్ఎస్ నాయకులకు చెంప దెబ్బ కొట్టేలా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని భట్టి విక్రమార్క అన్నారు. భవిష్యత్తులో తెలంగాణను పవర్ మోడల్ రాష్ట్రంగా చూడబోతున్నామని, 2029-30 నాటికి రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేస్తామని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం, జూలపల్లి, పెద్దపల్లి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు ధర్మారం, పెద్దపల్లిలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. వ్యవసాయ రంగానికి భవిష్యత్తులో సౌర విద్యుత్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదారాబాద్‌లో ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్టుకుంటుంటే ఆ నెపాన్ని కాంగ్రెస్‌పై రుద్దడం సరైంది కాదన్నారు. అభివృద్ధి, సంక్షేమం తమకు రెండు కళ్ల లాంటివన్నారు. హైదరాబాద్‌లో శాంతి భద్రతలకు విఘాతం సృష్టిస్తుంది బీఆర్ఎస్ పార్టీయేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ధర్నాలు చేసుకునేందుకు ప్రతిపక్షాలకు స్వేచ్ఛనిచ్చినా.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తోన్న బీఆర్ఎస్ నేతలు భౌతిక దాడులను ప్రోత్సహిస్తున్నారని హైదరాబాద్‌లో మండిపడ్డారు. ఇక, సీఎం రేవంత్ రెడ్డి పాలనపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు బదులిస్తూ.. పదేళ్లు పాలించినోళ్లు పది నెలలు కూడా ఓపికగా ఉండలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పంటలు దెబ్బతిన్నరైతులకు
రెండు రోజుల్లో రూ.10 వేల సాయం

» రాష్ట్రంలో వరద నష్టం 10,330 కోట్లు: పొంగులేటి

నేలకొండపల్లి, సెప్టెంబరు 14: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు పంటలు దెబ్బతిన్న రైతులకు రెండు రోజుల్లో తక్షణ సాయంగా రూ.10వేలు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలం కట్టుకాచారం గ్రామంలో శనివారం వరదలతో నష్టపోయిన రైతులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలతో నష్టపోయిన ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించిందని, ప్రాథమిక వరద నష్టం రూ.10,330 కోట్లుగా అంచనా వేసినట్లు చెప్పారు. వరద విపత్తులకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. మళ్లీ విపత్తులు సంభవిస్తే దీటుగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర బృందాలను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. గడచిన నాలుగు సంవత్సరాల్లో విపత్తు నిర్వహణ కోసం కేంద్రం కేటాయించిన నిధులు సుమారు రూ.1,300 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి చేరలేదన్నారు. గత ప్రభుత్వం ఈ నిధులను నిజంగా ఖర్చు పెట్టి లెక్కలు చూపించలేకపోయిందా.. లేదా? అనే విషయంపై విచారణ చేస్తున్నామని తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులను అడిగిన మాట వాస్తవమేనని, త్వరలో ముఖ్యమంత్రి, తాను, అధికారుల బృందం రాష్ట్రానికి నిధుల సహాయం కోసం ప్రధానిని కలువబోతున్నామని ఆయన చెప్పారు.

మంథనికి మరిన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు:దుద్దిళ్ల

మంథని, సెప్టెంబరు 14: మారుమూల ప్రాంతమైన పెద్దపల్లి జిల్లా మంథనికి ఐటీ కంపెనీలు తీసుకువచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మంథనిలో హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ సెంట్‌లేయన్స్ నెట్‌వర్క్ బ్రాంచ్‌ను మంత్రి శ్రీధర్‌బాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంథనిలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పెద్ద పట్టణాలకే పరిమితమైన సాఫ్ట్‌వేర్ కంపెనీలు మంథని లాంటి మారుమూల ప్రాంతానికి తరలివచ్చి బ్రాంచ్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు కల్పించడం హర్షణీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పరిశ్రమలు, కంపెనీలను తీసుకువచ్చి మంథని ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.



వ్యవసాయశాఖ సలహాదారుగా పోచారం శ్రీనివాసరెడ్డి బాధ్యతల స్వీకరణలో పాల్గొన్న మంత్రి తుమ్మల

వ్యవసాయ శాఖ సలహాదారుగా
పోచారం బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని ఉద్యానవన శాఖ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు హాజరయ్యారు. పోచారానికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా వ్యవసాయ శాఖ సలహాదారుగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆగస్టు 20న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

త్వరలో పంటల బీమా!

» ఈ నెలాఖరు వరకు క్లస్టర్ల వారీగా టెండర్లు

» ప్రీమియం చెల్లింపునకు రూ.2,500కోట్ల అంచనా

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో పంటల బీమా అందుబాటులోకి రానుంది. ఈ మేరకు ప్రభుత్వం పంటల బీమాపై దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన' (పీఎంఎఫ్‌బీవై) పథకం కింద బీమాను రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకు రానుంది. ఇందుకు సంబంధించిన కసరత్తును వ్యవసాయ శాఖ ఇప్పటికే పూర్తిచేయగా త్వరలోనే దీని అమలుకు మార్గం సుగుమం కానుంది. ఇందులో భాగంగానే ఈ నెలాఖరు వరకు టెండర్లను ఆహ్వానించనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అయితే పంటల బీమా కోసం పిలిచే టెండర్లను గంపగుత్తగా కాకుండా క్లస్టర్ల వారీగా పిలవాలని వ్యవసాయ శాఖ నిర్ణయించినట్టు సమాచారం. అంతేకాకుండా దాదాపు అన్ని పంటలకు బీమాను వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. పీఎంఎఫ్‌బీవైలోని మార్గదర్శకాలను అనుసరించి పంటలకు బీమాను అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో ప్రీమియం చెల్లింపునకు సుమారు రూ.2,500 కోట్ల నిధులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేస్తోంది. టెండర్ల ప్రక్రియ పూర్తయితే నిధుల అంశంపై స్పష్టత రానుంది. అయితే పంటల బీమాకు చెల్లించాల్సిన రాష్ట్ర వాటా, రైతుల వాటాను కలిపి ప్రభుత్వమే చెల్లించనుంది. రైతులు, రాష్ట్రం వాటాను చెల్లించిన తర్వాత కేంద్రం తన వాటాను జమ చేస్తుంది. పంటల గుర్తింపు, దిగుబడి లెక్కింపునకు సాంకేతికతను వినియోగించనుండగా.. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిసింది. అదే సమయంలో సాంకేతికతతో పాటు ఆఫ్‌లైన్ (మాన్యువల్) విధానంలోనూ పంటలను గుర్తించనున్నారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో ఇటీవల కురిసిన వానలు, వచ్చిన వరదల నేపథ్యంలో వానాకాలంలో సాగైన పంటల్లో సుమారు 4.15లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వం గుర్తించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గుర్తించిన పంట నష్టాలకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం అందించనుంది. ఈ నేపథ్యంలో పంటల బీమాను వానాకాలం సీజన్ నుంచి అమలు చేస్తారా లేక యాసంగి నుంచి అమలుచేస్తారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే వానాకాలం సీజన్ ముగిసిందని, ఈ లోపే బీమా పథకం అందుబాటులోకి వచ్చి ఉంటే రైతులకు లబ్ధి చేకూరేదని రైతు సంఘాలు అంటున్నాయి. కాగా ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 1.23కోట్ల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవ్వగా.. వీటిలో వరి 59.76లక్షల ఎకరాలు, పత్తి 43.29 లక్షల ఎకరాలు, కంది 4.83లక్షలు, మొక్కజొన్న 5.30లక్షల ఎకరాల్లో సాగయ్యాయని ఇటీవల వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో పేర్కొంది.

మంత్రి తుమ్మల సమీక్ష

రాష్ట్రంలో పంట బీమా అమలు, వ్యవసాయ శాఖ భవిష్యత్తు కార్యాచరణపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం సచివాలయంలో శాఖ అధికారులతో సమీక్షించారు. పంటల బీమా అమలు, అందుకు తీసుకోవాల్సిన చర్యలు, రైతులకు ప్రయోజనాలకు అనుగుణంగా విధానాలు రూపొందించే అంశంపై చర్చించారని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

నెల నెలా ఆస్తి పన్ను!

(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పన్నుల విధానాన్ని సరళీకృతం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగానే నెలానెలా ఆస్తి పన్ను చెల్లించే వెసులుబాటుతోపాటు 20వేల లీటర్ల కన్నా ఎక్కువ నీటి వాడకానికి సంబంధించిన బిల్లులను సులభంగా చెల్లించే విధానంపై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. చెత్త సేకరణ చార్జీలను కూడా ఆన్‌లైన్‌లో చెల్లించే వెసులుబాటును పరిశీలిస్తున్నారు. పేమెంట్ యాప్‌ల ద్వారా పన్నులు, చార్జీల వసూలు చేపడితే బకాయిలు పేరుకుపోయే అవకాశం ఉండదని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆరు నెలలకు ఒక సారి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. ఒక్కో ఇంటికి జలమండలి 20 వేల లీటర్ల వరకు ఉచితంగా నీటిని సరఫరా చేస్తోంది. అంతకు మించి నీటిని వాడే వారి నుంచి బిల్లులు వసూలు చేస్తోంది. నెలల తరబడి బకాయిలు వసూలు కాకపోయినా జీహెచ్‌ఎంసీ సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఏళ్ల తరబడి ఆస్తి పన్ను చెల్లించని వాళ్లూ ఉన్నారు. కానీ, కరెంట్ బిల్లుల చెల్లింపు విషయంలో ఆలస్యమైతే అపరాధ రుసుం వసూలు చేస్తుండడమే కాదు.. మరీ జాప్యం చేస్తే కనెక్షన్ కట్ చేసేందుకు డిస్కమ్‌లు వెనుకాడడం లేదు. ఇదే పద్ధతిని ఆస్తి పన్ను, నీటి బిల్లుల విషయంలోనూ అమలు చేయాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది. వీలైతే ఈ మూడు బిల్లులు క్రమం తప్పకుండా చెల్లించేలా, ఒకదానికి మరోటి అనుసంధానం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. పేమెంట్ యాప్‌ల ద్వారా చెల్లించే సౌకర్యం ఉన్నందునే ప్రజలు కరెంట్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నారని అధికారులు ప్రస్తావించగా.. ఆ విధానాన్ని ఇక్కడా అమలు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని, ఆర్థిక సంవత్సరం చివరలో రాయితీలిచ్చినా సత్ఫలితాలుంటాయని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది. పౌర సంస్థల తరఫున సదుపాయాలు, సౌకర్యాలు, సేవలు సక్రమంగా అందినపుడే... ప్రజలు బాధ్యతతో వ్యవహరిస్తారని పేర్కొన్నట్లు సమాచారం. సీఎం ఆదేశాలతో అధికారులు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నారు. కాగా, ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయాన్ని ప్రభుత్వ ఖాతాలో కాకుండా నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లోనే జమ చేయాలని ఆర్థిక శాఖకు సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు.

'హైడ్రా'కు చట్టబద్ధత!

ఆర్డినెన్స్‌ను తీసుకురానున్న సర్కార్.. తర్వాత అసెంబ్లీలో బిల్లు.. చట్టంతో విశేషాధికారాలు

» 20న మంత్రిమండలి భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశం



హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)'కు రేవంత్ ప్రభుత్వం మరింత బలోపేతం చేయనుంది. సీఎం రేవంత్ అధ్యక్షతన 20న జరగనున్న మంత్రిమండలి సమావేశంలో ప్రధానంగా హైడ్రాపైనే దృష్టిపెట్టనున్నారు. హైడ్రాకు చట్టబద్ధత కల్పించే విషయమై నిర్ణయం తీసుకోనున్నారు. హైడ్రాకు ఆర్డినెన్స్‌ను తీసుకురావడం, అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవడం వంటి అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని సమాచారం. అలాగే ధరణి కమిటీ చేసిన సిఫారసులు కూడా చర్చకు రానున్నాయి. రికార్డ్ ఆఫ్ రైట్స్-2024 (ఆర్వోఆర్) ముసాయిదా అంశమూ చర్చకు రానుంది. కొత్త ముసాయిదాపై మంత్రిమండలి చర్చించి.. అవసరమైన మేరకు మార్పులు చేర్పులు చేయనుంది. ఇక రైతు రుణమాఫీ, రైతుభరోసాపైనా చర్చించనున్నారు. రైతు రుణ మాఫీ పథకం కింద ఇప్పటికే ప్రభుత్వం రూ.18 వేల కోట్లను వెచ్చించింది. ఇప్పటివరకు రూ.2లక్షల వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేసినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. రైతు భరోసా పథకానికి ఇంకా విధివిధానాలు ఖరారు కాలేదు. పర్యవసానంగా ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం పథకాన్ని అమలు చేయలేదు. దీనిపైనా క్యాబినెట్‌లో చర్చించనున్నారు. ఔటర్ రింగు రోడ్డును ఆనుకుని ఉన్న 51 గ్రామాలను సమీప 13 మునిసిపాలిటీల్లో విలీనం చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ మునిసిపాలిటీలను కూడా గ్రేటర్ హైదరాబాద్ మునిసిల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చిస్తారని సమాచారం. 20న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో బీసీ కుల గణన అంశమూ చర్చకు రానుంది. బీసీ కుల గుణన చేసి మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇది పూర్తయితే తప్ప.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఈ దృష్ట్యా కుల గణనను వేగవంతం చేసే అంశంపై క్యాబినెట్ చర్చించనుంది. రాష్ట్రంలో ఇటీవల భారీ వర్షాలు కురిసి, వరదలు సంభవించాయి. పలు జిల్లాల్లో పంట, ఆస్తి నష్టం వాటిల్లింది. ఇందుకోసం కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని కోరుతోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి నష్టం వివరాలను సమర్పించారు కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించి, వివరాలు సేకరించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడకపోతే రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేపట్టాల్సిన నష్ట నివారణ చర్యలు, దాతలు ఇస్తున్న విరాళాల వ్యయం తదితర అంశాలపై చర్చించనుంది. రాష్ట్రంలో 225 కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనకు వచ్చిన కొన్ని గ్రామాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన మరికొన్ని గ్రామాలు కలిపి మొత్తం 225కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయాలన్నది ఆలోచన. వీటిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో క్యాబినెట్ కొత్త పంచాయతీలపై చర్చించి, తుది నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు.

ఏసీబీ, విజిలెన్స్ తరహాలోనే హైడ్రా

» అవీ ప్రభుత్వ నిర్ణయంతో ఏర్పాటైనవే

» హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ అక్టోబరు లోపు ఆరినెన్స్ రాబోతుందని ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. బంజారాహిల్స్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రంగనాథ్.. పలు అంశాలపై మాట్లాడారు. హైడ్రాను చట్టబద్ధం చేసేందుకు క్యాబినెట్ త్వరలో ఆమోద ముద్ర వేయనుందని, ఆర్డినెన్స్ జారీ అయితే.. తమ సంస్థకు విశేషాధికారాలు వస్తాయని చెప్పారు. ఆర్డినెన్స్ తర్వాత ఆరు వారాల్లోగా అసెంబ్లీ ఆమోదిస్తుందని పేర్కొన్నారు. "హైడ్రాకు చట్టబద్ధత ఉందా? లేదా? అనే దానిపై కొందరు కోర్టుకు వెళ్లారు. అలాంటి వారికి త్వరలోనే సమాధానం దొరుకుతుంది. ప్లానింగ్ కమిషన్, క్యాబినెట్ సెక్రటేరియట్, లా కమిషన్, ఏసీబీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వంటివన్నీ ప్రభుత్వ నిర్ణయాల ద్వారా ఏర్పాటైనవే. ప్రభుత్వం హైడ్రాకు వాల్టా, జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ వంటి వేర్వేరు చట్టాల కింద అధికారాలను కల్పించింది"అని వివరించారు. చెరువులు, నాలాలు, పార్కులు, రోడ్లు వంటి ప్రభుత్వ ఆస్తులను కాపాడడమే హైడ్రా బాధ్యత అన్నారు. "లోకల్ పోలీసులకు టాస్క్‌ఫోర్స్ సహకరించినట్లుగా.. మునిసిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు హైడ్రా సహకారం ఉంటుంది. గ్రేహౌండ్స్, టాస్క్‌ఫోర్స్‌లా హైడ్రా పనిచేస్తుంది" అని చెప్పారు.

గల్ఫ్ కార్మికులకు త్వరలో సంక్షేమ బోర్డు

» హైదరాబాద్‌లో ప్రవాసీ ప్రజావాణి

» గల్ఫ్ ప్రభావిత నియోజకవర్గ ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం సమీక్ష



హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయనుంది. రెండు, మూడు రోజుల్లో దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ కానున్నాయి. గల్ఫ్ ప్రభావిత నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ఈ బోర్డులో భాగస్వాములుగా ఉండనున్నారు. బోర్డు ఏర్పాటు, దాని విధివిధానాలపై ప్రభుత్వం ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చినట్లు తెలిసింది. గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై చర్చించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. గల్ఫ్ కార్మికులు అధికంగా ఉండే నియోజక వర్గాల ప్రజాప్రతినిధులు, పీసీసీ ఎన్నారై సెల్ నాయకులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో జరిగే ప్రజావాణిలో గల్ఫ్ బాధితులు, వారి కుటుంబాల కోసం ప్రత్యేకంగా ఈ నెల 20 నుంచి ప్రవాసీ ప్రజావాణి కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్మికులు, వారి కుటుంబ సంక్షేమం కోసం జిల్లాకొక ప్రవాసీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సెట్విన్, న్యాక్ లాంటి సంస్థలతో వివిధ అంశాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు. గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సీట్లు కేటాయిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి (డిసెంబరు 7, 2024) తర్వాత గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామన్నారు. అంతకుముందు మరణించిన వాళ్ల కుటుంబాలకూ మానవతా దృక్పథంతో రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తామన్నారు. రైతు బీమా తరహాలో గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ బీమా ఉండాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. గల్ఫ్‌లో ఎవరైనా చనిపోతే భౌతిక కాయాన్ని తీసుకురావడానికి వారాల తరబడి సమయం పడుతుందనీ, 48 గంటల్లోగా వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

లోక్‌సభలో విద్వేషం పంచే, పెంచేవాళ్లే ఎక్కువ

పేదల గొంతుకను వినిపించేవాళ్లు తక్కువ

» రానున్న పదేళ్లు ప్రజల కోసమే పనిచేస్తాం..

» దేశాన్ని కాపాడేవారే ఎన్నికల్లో గెలవాలి

» కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఒవైసీ మాట్లాడితే శత్రువుగా చూడలేం:సీఎం

» 'ప్రాఫెట్ ఆఫ్ ది వరల్డ్' పుస్తకావిష్కరణ



హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ప్రజల గొంతుకను వినిపించేవాళ్లు తక్కువగా ఉన్నారని, విద్వేషం పెంచి, పంచేవాళ్లు ఎక్కువగా ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజల తరఫున మాట్లాడేందుకు గతంలో జైపాల్‌రెడ్డి వంటి గొప్ప నేతలు ఉండేవారని.. ఇవాళ.. కార్పొరేట్, వ్యాపార దృక్పథం ఉన్నవారు రాజకీయాల్లోకొస్తున్నారన్నారని... అలాంటివారి వారుంటే వారి వ్యాపారం పెరుగుతుంది తప్ప.. 'పేద వర్గాల గొంతుకగా వాళ్లు పనిచేయలేరని' ఆక్షేపించారు. దేశాన్ని కాపాడేవారే ఎన్నికల్లో గెలవాలన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఇస్లామిక్ సైన్స్ పరిశోధన సంస్థకు చెందిన 'అల్ మహదుల్ ఆలీ అల్ ఇస్లామీ' ఆధ్వర్యంలో 'ప్రాఫెట్ ఫర్ ది వరల్డ్' పుస్తకావిష్కరణకు రేవంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. లోక్‌సభలో ముస్లింలు, దళితులు, ఆదివాసీల గురించి అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతుంటే సంతోషంగా అనిపించేదని.. ఒక్కోసారి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడినా సంతోషం కలిగేదని, బాధ మాత్రం పడలేదని, తమకు వ్యతిరేకంగా చెబితే శత్రువులుగా చూడబోమన్నారు. రాష్ట్రం నుంచి లోక్‌సభకు 17 మంది ప్రాతినిధ్యం వహిస్తుండగా వారిలో పేదల గురించి మాట్లాడే వారిలో అసదుద్దీన్ ఒవైసీ కూడా ఒకరని.. ఆయన తమవెంట ఉన్నారా? లేదా? అనేది తాము చూసుకోబోం అని.. హైదరాబాద్‌లో ఉన్న 4 కోట్ల ప్రజల అభివృద్ధి కోసం కృషిచేస్తామన్నారు. అందుకు విరుద్ధంగా ఉంటే హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. మహమ్మద్ ప్రవక్త దారిలో నడిచి దేశాన్ని కాపాడుకోవాలని.. ఆ దారిలో నడిస్తే రానున్న కాలంలో మంచిరోజులొస్తాయన్నారు. మహమ్మద్ ప్రవక్త చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ శాంతి, సామరస్యంతో ముందుకు నడవాలన్నారు. హైదరాబాద్ నుంచే ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఉండటం సంతోషం కలిగించిందన్నారు. ఎన్నికల్లో గెలవడానికే విద్వేషాన్ని పెంచడంలో తప్పులేదని.. అయితే. గెలిచిన తర్వాత ప్రజల మధ్య చిచ్చు పెట్టి, అంతరాలు పెంచేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండేసి సార్లు చంద్రబాబును, వైఎస్‌ను.. తెలంగాణ ఏర్పడ్డాకా రెండుసార్లు కేసీఆర్‌ను గెలిపించారని... రానున్న పదేళ్లలో తాము కూడా పేదవర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తామని ప్రకటించారు. ఈసా-మూసీ నదులు దెబ్బతిని... మురుగు అంతా మూసీలో కలుస్తోందని... అందుకే మూసీ ప్రక్షాళన, పునరుజ్జీవన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మూసీ వెంబడి నివాసం ఉంటున్న పేద ప్రజల లెక్కలు తీస్తున్నామని.. వీరికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తామన్నారు. భగవద్గీత, బైబిల్, ఖురాన్ చెప్పేదొక్కటేనని.. అందరం కలిసికట్టుగా ఈ దేశాన్ని ముందుకు తీసుకెళ్లడమే బాధ్యతగా ఉండాలన్నారు. ఈ దేశంలో కొందరు ద్వేషాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. దీన్ని మనమంతా గుర్తించి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు(మైనారిటీ వ్యవహారాలు) మహ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ మైనార్టీ విద్యాలయాల సంస్థ డైరెక్టర్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ పాల్గొన్నారు.

పామాయిల్ రైతులకు ఊరట

» దిగుమతి సుంకాన్ని 27.5 శాతానికి పెంచిన కేంద్రం

» కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి తుమ్మల

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. పంట పండించే రైతులకు ఊరట కలిగిస్తూ.. ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దిగుమతి సుంకాన్ని 5.5శాతం నుంచి 27.5శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర రైతాంగం తరఫున కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. దిగుమతి సుంకం పెంపు వలన పామాయిల్ పండించే రైతులకు లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.14,392గా ఉండగా.. అది టన్నుకు రూ.1,500 నుంచి రూ.1,700 వరకు అదనంగా పెరిగే అవకాశం ఉన్నదని, వెరసి మొత్తంగా ఒక్కో ఆయిల్ పామ్ గెల ధర రూ.16,500గా పెరిగే అవకాశం ఉన్నదని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 44,400 ఎకరాల పామ్ ఆయిల్ తోటల నుంచి 2.80 లక్షల టన్నుల ఆయిల్‌పామ్ గెలలు దిగుబడి వస్తున్నదని ఆయన తెలిపారు. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో తెలంగాణలో పామాయిల్ సాగును పెద్ద ఎత్తున చేపట్టడానికి అవకాశాలు మరింత మెరుగుపడ్డాయన్నారు. రైతులు పామాయిల్ సాగు విరివిగా చేపట్టాలని తుమ్మల పిలుపునిచ్చారు. కాగా ముడి పామాయిల్ దిగుమతిపై సుంకం ఎత్తివేయడం వలన ఆయిల్ పామ్ గెలల ధర తగ్గడంతో రైతుల్లో నిరాశ నెలకొందని, ఈ పంట సాగు చేయాలనుకున్నవారిపై ప్రతికూల ప్రభావం చూపిందని ఇటీవల మంత్రి తుమ్మల కేంద్రానికి లేఖ రాశారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు అధిక ధరలు అందేలా చర్యలు తీససుకోవడంతో పాటు, దిగుమతి చేసుకుంటున్న ముడి పామాయిల్‌పై సుంకాన్ని పెంచాలని ఆ లేఖలో కోరారు. అదే విధంగా ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోనూ తుమ్మల ప్రత్యేకంగా మాట్లాడారు. స్పందించిన కేంద్రం తాజాగా సుంకాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

ప్రత్యర్థి.. రాజకీయంగా నన్ను
కత్తితో పొడవడానికి వస్తే ఊర్కోను

» ఎదురుదాడి చేస్తా.. అదే రాజనీతి

» బీఆర్‌ఎస్‌పై మా పార్టీ తీరు సరైందే

» మా కార్యకర్తలను రెచ్చగొట్టవద్దు

» ఆంధ్రోళ్లకు టికెట్లు ఇచ్చింది కేసీఆరే

» హరీశ్ రావును ఎలుగుబంటి కరిచినట్టుంది: తూర్పు జగ్గారెడ్డి



హైదరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): "ప్రత్యర్థి.. నన్ను రాజకీయంగా కత్తితో పొడవాలని వస్తే నేను ఊర్కోను. ఎదురుదాడి చేస్తా. అదే రాజనీతి" అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ విషయంలో తమ పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరైనదేనన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అనవసరమైన రచ్చ పెట్టుకుని హైదరాబాద్ ప్రజల మూడ్‌ను ఖరాబు చేశారన్నారు. వినాయక నవరాత్రుల సమయంలో అన్ని టీవీలూ ఖైరతాబాద్ వినాయకుడి పూజను చూపిస్తాయన్నారు. ఇప్పుడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు లొల్లి పెట్టుకుని ఖైరతాబాద్ వినాయకుడిని, వినాయక పూజలను ప్రజలు చూడకుండా చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇంత చిల్లరగా వ్యవహరించబోరన్నారు. గాంధీభవన్‌లో శనివారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. "బీఆర్‌ఎస్ వాళ్లు ఆంధ్రా వాళ్లను తిడుతున్నరు.! ఆంధ్రాకు వెళ్లి వైసీపీ నేత రోజా ఇంట్లో చేపల పులుసు తిన్నదీ.. ఆంధ్రా ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకున్నది, ఆంధ్రోళ్లకు టికెట్లు ఇచ్చిందీ కేసీఆరే కదా?" అన్నారు. రెండు రోజులుగా హరీశ్‌రావు దునుకుడు చూస్తుంటే.. ఆయనను ఎలుగుబంటి కరిచినట్లనిపిస్తుందన్నారు.

ఫిరాయింపులకు ఆజ్యం పోసిందే కేసీఆర్

వైఎస్‌ఆర్ హయాంలో తానేమీ కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని జగ్గారెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్యేలకు నేరుగా కండువా కప్పే సంస్కృతి ఉమ్మడి రాష్ట్రంలో లేదని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే ఇది మొదలైందన్నారు. 2014 నుంచి 2018 వరకు నలుగురు ఎంపీలు, పాతిక మంది ఎమ్మెల్యేలు, 18 మంది ఎమ్మెల్సీలను వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. ఈ ఫిరాయింపులకు ఆజ్యం పోసిందే కేసీఆర్ అని చెప్పారు. కేసీఆర్ సీఎం అయ్యాక రాజకీయాల్లో విలువలే పోయాయన్నారు. బీజేపీ డైరెక్షన్‌లో కాంగ్రెస్‌కు కేసీఆర్ వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. కౌశిక్‌రెడ్డి పంచాయితీలో ఉత్తమ్‌కు ఏం సంబంధమని.. ఈ విషయంలో సీఎం రేవంత్, ఉత్తమ్‌లకు పూర్తి స్పష్టత ఉందని ఓ ప్రశ్నకు సమాధానంగా జగ్గారెడ్డి చెప్పారు. ఈ సందులో దూరాలని బీజేపీ వచ్చిందని, రాజకీయం చేయడం తప్పితే ఆ పార్టీకి ఏం తెలుసునని అన్నారు.

సీఎంను పనికిరానోడని అంటే నాలుక కోస్తాం

తమ సీఎం రేవంత్‌రెడ్డిని పనికిరానోడని అంటే నాలుక కోస్తం అంటూ జగ్గారెడ్డి హెచ్చరించారు. కేటీఆర్ అన్నా, ఆయన అయ్య కేసీఆర్ అన్నా కూడా నాలుక కోస్తామన్నారు. తమ కార్యకర్తలను రెచ్చగొట్టవద్దని హితవు పలికారు. సీఎం రేవంత్ పాలన.. అసమర్థుని జీవయాత్రలా ఉందంటూ కేటీఆర్ వ్యాఖ్యలపైన జగ్గారెడ్డి ఈ మేరకు స్పందించారు.

ఇండియన్ సొసైటీ ఆఫ్ హైపర్ టెన్షన్ అధ్యక్షుడిగా డాక్టర్ వసంత్ కుమార్



హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ సొసైటీ ఆఫ్ హైపర్ టెన్షన్ అధ్యక్షుడిగా డాక్టర్ సీహెచ్ వసంత్ కుమార్ ఎన్నికయ్యారు. ప్రముఖ ఫిజీషియన్ అయిన డాక్టర్ వసంత్ కుమార్ హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో సీనియర్ కన్సల్టెంట్‌గా వైద్య సేవలందిస్తున్నారు. సెప్టెంబరు 13న రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఇండియన్ సొసైటీ ఆఫ్ హైపర్ టెన్షన్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో డాక్టర్ వసంత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భారతదేశంలో హైపర్ టెన్షన్‌కు సంబంధించి ఎక్కువ మంది వృత్తి నిపుణులు ఉన్న సంస్థ ఇదే. ఇది ఆసియా పసిఫిక్ సొసైటీ ఆఫ్ హైపర్ టెన్షన్‌కు అనుబంధంగా కొనసాగుతోంది. భారతదేశంలో రక్తపోటు రాకుండా ముందస్తు జాగ్రత్తలు, నివారణ గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది.

భూమికి భూమి... ఇంటికి ఇల్లు ఇవ్వాల్సిందే

- చౌటుప్పల్‌లో ఆర్‌ఆర్‌ఆర్ నిర్వాసితుల రాస్తారోకో

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 14: ప్రాంతీయ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్)లో ఆస్తులు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తామని చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆర్‌ఆర్‌ఆర్‌తో నష్టపోతున్న బాధితులకు భూమికి బదులుగా భూమి ఇవ్వాలని, ప్లాట్‌లు, ఇండ్లకు ఓపెన్ మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై ఆర్‌ఆర్ ఆర్ నిర్వాసితులు చేపట్టిన రాస్తారోకోలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి బాధ్యత తీసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు.

జూనియర్ వైద్యుల పనివేళలు తగ్గించాలి

- 72 గంటల నుంచి 48 గంటలకు కుదించాలి
- కేంద్ర ఆరోగ్య కమిటీ సభ్యుడు డాక్టర్ కిరణ్ మాదాల

హైదరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జూనియర్ డాక్టర్లపై పనిభారం పెరుగుతోందని, వారి పనివేళలు వారంలో 72 గంటల నుంచి 48 గంటలకు తగ్గించాలని కేంద్ర ఆరోగ్య కమిటీ సభ్యుడు డాక్టర్ కిరణ్ మాదాల కేంద్రాన్ని కోరారు. ఢిల్లీలో జరిగిన కేంద్ర ఆరోగ్య కమిటీ సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న జూనియర్ వైద్యులపై తీవ్రమైన పనిభారం పడుతోందని దీంతో వారు ఒత్తిడిలోనవుతున్నారని అన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగినంత మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ వైద్యులను నియమించాలని కోరారు. దీంతో జూనియర్ వైద్యులపై పనిభారం తగ్గుతుందని తద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు.

రష్యాలో నిత్యం నరకమే

(మొదటిపేజీ తరువాయి)

కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా అక్కడ ఎదురైన అనుభవాలను సూఫియాన్ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

మిమ్మల్ని రష్యాకు ఎవరు తీసుకెళ్లారు?

మాది నారాయణపేట జిల్లా కేంద్రం. 2021లో పని కోసం దుబాయి వెళ్లా. అక్కడ ఎమిరేట్స్‌లో కేటరింగ్ పని చేసేవాడిని. నెలకు రూ.30వేల వరకు వచ్చేవి. నాతోపాటు కర్ణాటకలోని గుల్బర్గకు చెందిన మరో ముగ్గురూ ఉండేవారు. ఈ క్రమంలో బాబా బ్లాగ్ యూట్యూబ్ చానల్‌లో ఒక వీడియో చూశాం. రష్యాలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు ఉన్నాయని, రూ. లక్ష వరకు జీతం వస్తుందని తెలిసి.. నలుగురం అతడిని సంప్రదించాం. రూ. 3లక్షలు చెల్లిస్తే ఉద్యోగం ఇప్పిస్తామని, మూడు నెలల శిక్షణలో రూ.40 వేలు, ఆ తర్వాత రూ.లక్ష వరకు జీతం వస్తుందంటే ఆశపడ్డాం. డబ్బులు చెల్లించాక పేపర్లు రెడీ చేసి మమ్మల్ని రష్యా తీసుకెళ్లారు.

మీరు మోసపోయారని ఎప్పుడు గ్రహించారు?

మమ్మల్ని తీసుకెళ్లిన ఏజెంట్ ముంబైకి చెందిన వాడే. దుబాయ్‌లో ఏజెన్సీ నడిపిస్తాడు. చెన్నైకి చెందిన నైజిల్ అనే వ్యక్తి, రష్యా పౌరుడు ఒకరు.. మాస్కోలో మమ్మల్ని రిసీవ్ చేసుకున్నారు. అక్కడి నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోస్టారమ పట్టణానికి తీసుకెళ్లారు. అక్కడ ఒక హాస్టల్‌లో ఉంచారు. అక్కడే ఉద్యోగాలు ఇస్తారనుకొని సంతోషించాం. కానీ, నాలుగు రోజులు తర్వాత ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌కు మమ్మల్ని తీసుకెళ్లారు. వాళ్లు తీసుకెళ్లి అడవిలో వదిలేశాక.. మేము మోసపోయామని గుర్తించాం. భాష సమస్య కారణంగా మేము ఎంత చెప్పినా అక్కడున్న వారెవరూ వినిపించుకోలేదు. మా ఫోన్లలో ఇండియా సిమ్ కార్డులే ఉండడంతో ఎవరినీ సంప్రదించలేకపోయాం.

యుద్ధ భూమికి ఎలా వెళ్లారు? అక్కడి పరిస్థితులేంటి?

ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌లోనే మాకు ఆర్మీ డ్రెస్సులు ఇచ్చారు. హెలికాప్టర్‌లో చాలా దూరం తీసుకుపోయి.. ఉక్రెయిన్- రష్యా సరిహద్దుల్లోని క్యాంపులో వదిలేశారు. అక్కడ విపరీతమైన చలి వాతావరణం ఉండేది. పది కిలోమీటర్ల పరిధిలో కలాంచక్ అనే గ్రామం మాత్రమే ఉండేది. మాకు గన్ ఫైరింగ్‌తో పాటు గ్రెనైడ్లు వేయడం, సొరంగాలు తవ్వడం నేర్పించారు. గాయపడిన సైనికులను ఎలా తీసుకెళ్లాలి? బుల్లెట్లను ఎలా లోడ్ చేయాలి? క్షతగాత్రులకు ప్రథమ చికిత్స ఎలా చేయాలి? వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. బాబా పంపిన బ్యాచ్‌లో మాదే మొదటిది.. ఇండియాకు చెందిన వారు దాదాపు 60 మంది మాలాగే అక్కడ ఇరుక్కుపోయారు.

ఏం పనులు చేసేవారు..? భోజన వసతి ఎలా ఉండేది?

ప్రధానంగా సొరంగాలు తవ్వేవాళ్లం. తుపాకులు మోయడం, బుల్లెట్లు లోడ్ చేయడం, నీళ్లు నింపడం, ఎవరికైనా గాయాలైతే తీసుకెళ్లడం, మరణిస్తే మృతదేహాలను ప్యాక్ చేయడం వంటి పనులు చేసేవాళ్లం. డ్రోన్ దాడిలో గుజరాత్‌కు చెందిన హమిత్ మరణించిన తర్వాత చాలా భయమేసింది. రోజుకు ఒక్క సారి మాత్రమే భోజనం చేసేవాళ్లం. ఆ ఆహారం తినడం చాలా ఇబ్బందిగా ఉండేది. 12 నుంచి 15 గంటల వరకు పని ఉండేది. నేలపైనే పడక. చలి ఉండటంతో స్లీపింగ్ బ్యాగ్‌లో పడుకునే వాళ్లం.

మీ మానసిక పరిస్థితి ఎలా ఉండేది?

డ్రోన్ల ద్వారా బాంబులు పడేవి. శవాలను మోసుకువెళ్లే వాళ్లం. గాయపడిన వారికి చికిత్స చేసేవాళ్లం. అనుక్షణం.. భయం భయంగా గడిపేవాళ్లం. మేము వెళ్లిన 25 రోజుల తర్వాత రెండు నిమిషాలు ఇంట్లో వాళ్లతో మాట్లాడాం. గుజరాత్‌కు చెందిన వ్యక్తి చనిపోయాక ఓ వీడియో తీసి.. మమ్మల్ని ఇండియాకు రప్పించాలని వేడుకున్నాం. కళ్ల ముందే చాలామంది చనిపోతుంటే.. అల్లాను ప్రార్థించేవాళ్లం. మేము నలుగురం వెళ్తే చెన్నై నుంచి వచ్చిన మరో ఇద్దరు మాతో కలిశారు. శిక్షణ సమయంలో కలిసే ఉన్నాం. ఆ తర్వాత వివిధ క్యాంపులకు తీసుకెళ్లడంతో మానసికంగా కుంగిపోయాం. ఎప్పుడూ తుపాకులు పట్టుకొని తిరిగేవాళ్లం. ఎటు నుంచి మృత్యువు వస్తుందో తెలియని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు గుర్తుచ్చి రోజూ ఏడ్చేవాళ్లం.

ఇండియాకు తిరిగొస్తారని అనుకున్నారా? ఎవరెవరు సహకరించారు?

అక్కడి నుంచి బయటపడతామని అస్సలు అనుకోలేదు. మమ్మల్ని కాపాడేందుకు నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, సీఎం రేవంత్‌రెడ్డి చాలా ప్రయత్నాలు చేశారు. ఎంపీ అసదుద్దీన్.. కేంద్ర మంత్రి జయశంకర్‌ను కలిసి మా పరిస్థితిని వివరించారు. రెండు దేశాల ఎంబసీలు ఈ విషయంలో చాలా శ్రద్ధ తీసుకున్నాయి. ప్రధాని మోదీ కూడా రష్యాకు వచ్చిన సందర్భంలో ఈ విషయమై పుతిన్‌తో చర్చించారు. దీంతో మేము స్వదేశానికి రాగలిగాం. మీడియా కూడా ప్రముఖ పాత్ర పోషించింది. వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. తొలివిడతలో మేము ఇండియాకు వచ్చాం.

ఉద్యోగ ఏజెన్సీల మోసాలపై ఎలాంటి చర్యలు అవసరం?

పొట్టకూటి కోసం ఆశపడే వారు ఎక్కువ జీతం వచ్చే పని కావాలనుకుంటారు. అలాంటి వారిని బాబా లాంటి వ్యక్తులు, ఏజెన్సీలు మోసం చేస్తున్నాయి. సదరు ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి. తప్పుడు ప్రచారం చేస్తున్న యూట్యూబ్ వీడియోలను బ్లాక్ చేసి, అలాంటి యూట్యూబర్స్‌పైనా చర్యలు తీసుకోవాలి.

రాష్ట్రవ్యాప్తంగా 773 చెరువులు, కాలువలకు గండ్లు



- తాత్కాలిక మరమ్మతులకు రూ.75 కోట్లు.. శాశ్వత పునరుద్ధరణకు రూ.483 కోట్లు
- కేంద్ర సహాయాన్ని కోరుతూ నివేదిక
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరదలతో రాష్ట్రవ్యాప్తంగా 773 చెరువులు, కాలువలకు గండ్లు పడ్డాయని, వీటిని తాత్కాలికంగా మరమ్మతులు చేసేందుకు రూ.75 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ కోసం రూ.483 కోట్లు మంజూరు చేయాలని కేంద్రానికి నివేదిక అందజేసినట్టు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న కాలువలు, చెరువులు, పంప్ హౌస్‌లతోపాటు చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో 250 మిల్లీమీటర్ల నుంచి 450 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ఈ నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. కోదాడ నియోజకవర్గ పరిధిలోని నడిగూడెం మండలం కాగితం రామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమకాలువకు గండి పడటంతో ఆ ప్రభావం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలపై పడిందన్నారు. ఖరీఫ్ పంటను కాపాడటంతో పాటు సాగునీటిని అందించడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాలతో 265 చోట్ల చెరువులకు గండ్లు పడగా... 285 చెరువులు దెబ్బతిన్నాయని, ప్రాజెక్టులకు చెందిన 131 కాలువలకు గండ్లు పడగా 83 దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు 94 భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరుకున్నాయన్నారు. కాగా నాగార్జునసాగర్ ఎడమకాలువ పునరుద్ధరణ పనులతోపాటు ముక్త్యాల బ్రాంచ్ కెనాల్, రెడ్లకుంట, మఠంపల్లి మండలంలోని చెరువులను స్వయంగా పరిశీలించేందుకు ఆదివారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు.

20న ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పరిశీలన

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టు టన్నెల్ పనులను పరిశీలించేందుకు ఈనెల 20న నల్గొండ జిల్లా పర్యటనకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెళ్లనున్నారు.

11 ఏళ్ల తర్వాత మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులంతా బదిలీ అయ్యారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ గురుకులాల్లోని టీచర్ల బదిలీలు కూడా పూర్తయ్యాయి. ఇక తమ వంతు ఎప్పుడొస్తుందోనని వేచిచూస్తున్న మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల బదిలీలూ ఎట్టకేలకు ముగిశాయి. బదిలీలకు హైకోర్టు అనుమతించడంతో రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ శనివారం పూర్తయింది. మొత్తం 2,757 మంది బదిలీలు జరగ్గా.. వీరిలో 89 మంది ప్రిన్సిపాళ్లు, 1,923 పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), 745 మంది ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ) ఉన్నారు. 11 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న బదిలీల ఉత్తర్వులు తీసుకుని వారు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.

అల్లుడు కాదు కిరాతకుడు

అత్తింటి ఆస్తిపై కన్నేసి బావమరిది హత్య

- 10 లక్షలు సుపారీ మాట్లాడుకుని ప్రాణం తీయించిన వైనం



యశ్వంత్ (ఫైల్), ప్రధాన నిందితుడు శ్రీకాంత్

రాయదుర్గం, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై అప్పుల్లో కూరుకుపోయిన ఓ వ్యక్తి.. ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కేందుకు అత్తింటి ఆస్తిపై కన్నేశాడు. ఆస్తి తనకు దక్కేందుకు అడ్డుగా ఉన్న బావమరిదిని పథకం ప్రకారం కిరాయి హంతకులతో హత్య చేయించి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. రూ.10 లక్షల సుపారీ మాట్లాడుకుని హత్య చేయించిన ఆ కిరాతక అల్లుడు.. పోస్టుమార్టం నివేదిక వల్ల దొరికిపోయాడు. హైదరాబాద్, కొండాపూర్ ప్రాంతంలో ఈ నెల 2న జరిగిన ఈ హత్యకు సంబంధించిన వివరాలను మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్ శనివారం వెల్లడించారు. ఏపీ, నెల్లూరు జిల్లా కావలికి చెందిన మద్దసాని ప్రకాశంకు కుమార్తె అమూల్య, కొడుకు యశ్వంత్(25) ఉన్నారు. ప్రకాశం తన కుమార్తెను నెల్లూరు జిల్లా సత్యవోలుఅగ్రహారానికి చెందిన శ్రీకాంత్‌కు ఇచ్చి 2017లో పెళ్లి చేశారు. కొండాపూర్ రాఘవేంద్రకాలనీలో పీజీ నిర్వహించే శ్రీకాంత్ బెట్టింగ్‌కు బానిసై రూ.4కోట్ల మేర అప్పుల్లో కూరుకుపోయాడు. ఆర్థిక సమస్యల నుంచి బయటపడేందుకు శ్రీకాంత్ అత్తింటివారి ఆస్తిపై కన్నేశాడు. ఆస్తి మొత్తం తనకు దక్కాలంటే అడ్డుగా ఉన్న బావమరిది యశ్వంత్‌ను హతమార్చాలని నిర్ణయించుకుని పథకం వేశాడు. ఇందులో భాగంగా బీటెక్ పూర్తి చేసి ఖాళీగా ఉన్న యశ్వంత్‌ను హైదరాబాద్ పంపించాలని అత్తమామలను కోరాడు. హాస్టల్ నిర్వహణలో తనకు తోడుగా ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేసుకుంటాడని వారికి చెప్పాడు. అల్లుడి సూచన మేరకు ప్రకాశం కొడుకు యశ్వంత్‌ను కొన్నాళ్ల క్రితం పంపించారు. శ్రీకాంత్‌కు చెందిన హాస్టల్‌లో ఉంటూ యశ్వంత్ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుండేవాడు. అయితే, యశ్వంత్ చెడు సావాసాలు చేస్తున్నాడని, గంజాయికి బానిసయ్యాడని శ్రీకాంత్ తన అత్తమామలను నమ్మించాడు. హత్యకు నాలుగు రోజుల ముందు కూడా యశ్వంత్ కోసం వారికి చెడుగా చెప్పాడు.

రూ.10 లక్షల సుపారీ.. రూ.90 వేలు అడ్వాన్స్...

యశ్వంత్‌ను చంపేందుకు కర్ణాటకకు చెందిన ఆనంద్(35), ఏపీలోని కడప జిల్లాకు చెందిన అంబటి వెంకటేశ్(23)తో రూ.10లక్షలకు బేరం మాట్లాడుకున్న శ్రీకాంత్ రూ.90వేలు అడ్వాన్సు ఇచ్చాడు. ఆనంద్ స్థానికంగా వంట పని చేస్తుండగా, వెంకటేశ్ ఓ హాస్టల్‌లో సూపర్‌వైజర్. ఈ క్రమంలో ఆగస్టు31న తన హాస్టల్ సీసీ కెమెరాలను పని చేయకుండా చేసిన శ్రీకాంత్.. సెప్టెంబరు 2వ తేదీ అర్ధరాత్రి తర్వాత వెంకటేశ్, ఆనంద్‌ను హాస్టల్‌కి పిలిపించాడు. ముగ్గురూ కలిసి యశ్వంత్ ఉన్న గదిలోకి వెళ్లి.. గాఢనిద్రలో ఉన్న యశ్వంత్ మెడకు చున్నీ బిగించి ఊపిరాడకుండా చేసి హతమార్చారు. అనంతరం ఫ్యాన్‌కు ఉరివేసి యశ్వంత్ ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులను, కుటుంబసభ్యులను శ్రీకాంత్ నమ్మించాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇక, కుటుంబ సంప్రదాయం ప్రకారం యశ్వంత్ మృతదేహాన్ని ఖననం చేస్తుండగా శ్రీకాంత్ అడ్డుకుని దహనం చేయాలని పట్టుబట్టాడు. దీంతో శ్రీకాంత్‌పై కుటుంబసభ్యులకు అనుమానం మొదలైంది. మరోపక్క, యశ్వంత్ మృతదేహంపై గాయాలు ఉన్నట్టు పోస్టుమార్టం నివేదిక రావడంతో జరిగింది హత్య అని గుర్తించిన పోలీసులు సాంకేతిక ఆధారాల సేకరణ మొదలుపెట్టారు. సీసీ కెమెరాలు, శ్రీకాంత్ ఫోన్ కాల్ డేటాపై దృష్టి సారించారు. ఈలోగా తన కొడుకుది హత్య అనే అనుమానం ఉందని యశ్వంత్ తండ్రి ప్రకాశం ఈనెల 10న గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు అసలు నిజాన్ని కనిపెట్టి ఆనంద్, వెంకటేశ్‌ను కూడా అరెస్టు చేశారు. ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

320 ఎంబీబీఎస్ సీట్లకు ఎసరు!

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర విమర్శలు వస్తున్నాయి. యూజీసీ తీరుపై రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అవసరమైతే కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని భావిస్తోంది. కోర్టును ఆశ్రయించే యోచనలో కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మల్లారెడ్డికి చెందిన రెండు మెడికల్ కాలేజీల్లో 400 ఎంబీబీఎస్, రెండు డెంటల్ కాలేజీల్లో 200 బీడీఎస్ సీట్లున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయంతో సంబంధం లేకుండా ప్రత్యేక కేటగిరీ కింద వీటికి డీమ్డ్ హోదా ఇస్తూ ఇటీవల యూజీసీ నిర్ణయం తీసుకుంది. కన్వీనర్ కోటా, రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం లేకుండా అనుమతులిచ్చింది. తద్వారా ఫీజుల ఖరారు, పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల మూల్యాంకనం వంటివన్నీ సొంతగానే చేసుకోవచ్చు. తెలంగాణ స్థానిక కోటా వర్తింపజేయాల్సిన పనిలేకుండా మినహాయింపులు ఇచ్చింది. దీంతో 600 సీట్లు మేనేజ్‌మెంట్ కోటాలోకి వెళ్లిపోయాయి. నిరుటి వరకు ఇందులో సగం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేసేవారు. నీట్‌లో మంచి ర్యాంక్ సాధించిన విద్యార్థులకు ఏటా రూ.60 వేలతో మెడిసిన్ చదివే అవకాశం దక్కేది. మేనేజ్‌మెంట్‌లోనూ 85 శాతం తెలంగాణవారికే కేటాయించేవారు. ఇప్పుడు డీమ్డ్ కావడంతో ఆ నిబంధనలేవీ వర్తించవు. ఒక్క సీటు కూడా రాష్ట్ర విద్యార్థులకు దక్కదు. కౌన్సెలింగ్‌ను కూడా మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) నిర్వహిస్తుంది. అంటే, ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ సీట్లు ఓపెన్ అన్నమాట. కాగా, మల్లారెడ్డి కాలేజీల బాటలో అపోలో, సీఎంఆర్ కళాశాలలూ డీమ్డ్ హోదాకు దరఖాస్తు చేసుకున్నాయి. ఇది కొనసాగితే రాష్ట్రంలో కన్వీనర్, రిజర్వేషన్ కోటా సీట్లు తగ్గి మెరిట్, పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, డీమ్డ్ వర్సిటీలను అడ్డుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కాగా, ఎంబీబీఎస్ సీట్ల అంశంపై కాళోజీ వర్సిటీ అధికారులతోనూ మంత్రి సమీక్షించారు.

ఒక్కో బ్యాచ్‌కు రూ.175 కోట్లు డీమ్డ్ యూనివర్సిటీ హోదా దక్కే వైద్య కళాశాలలకు రూ.వందల కోట్ల లబ్ధి చేకూరనుంది. ప్రైవేటులో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీటు ఫీజు రూ.60 వేలు మాత్రమే ఉండగా, మేనేజ్‌మెంట్ కోటా ఫీజు రూ.11.25 లక్షల నుంచి రూ.15 లక్షల దాక ఉంది. కళాశాలల్లో ఉన్న వసతులను బట్టి ఈ ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఫీజుల నియంత్రణ కమిటీ నిర్ణయిస్తుంది. డీమ్డ్ వర్సిటీలకు ఈ కమిటీతో సంబంధం లేకుండా, సొంతగానే ఫీజులను నిర్ణయించుకునే అధికారం ఉంటుంది. మల్లారెడ్డి వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ ఫీజు రూ.17 లక్షలుగా వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. గతంలో కన్వీనర్ కోటా ఫీజు 200 సీట్లకు ఏడాదికి రూ.1.20 కోట్లు వస్తే, ఇప్పుడు అది రూ.35 కోట్లు కానుంది. ఒక్క బ్యాచ్ విద్యార్థులతో ఏకంగా రూ.175 కోట్ల ఆదాయం వస్తుంది. డీమ్డ్ యూనివర్సిటీలపై రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణ ఉండదు. సొంతంగా పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల మూల్యాంకనంతో.. ఇక్కడ చదివే విద్యార్థులు సులభంగా మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. సంపన్నుల పిల్లలు ఎంత డబ్బయినా వెచ్చించి డీమ్డ్ యూనివర్సిటీల్లో చేరేందుకు సిద్ధమవుతారు.

మీడియా స్వేచ్ఛపై రాహుల్ దుష్ప్రచారం

- విదేశీ గడ్డపై భారత్‌ను అవమానించే కుట్ర
- జర్నలిస్టుపై దాడి.. కాంగ్రెస్ ప్రజాస్వామ్యమా..?
- రాజ్యాంగంపై రాహుల్ కపట ప్రేమ: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ/హైదరాబాద్/అడ్డగుట్ట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోని మీడియా స్వేచ్ఛపై రాహుల్ గాంధీ విదేశాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. విదేశీ గడ్డపై దేశ ప్రజాస్వామ్య విలువలను దిగజార్చేలా, రాజ్యాంగాన్ని కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అమెరికాలో మన దేశానికి చెందిన సీనియర్ జర్నలిస్టుపై దాడితో రాహుల్ గాంధీ నిజ స్వరూపం తెలిసిందని చెప్పారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన హత్యాకాండపై కాంగ్రెస్ తన వైఖరిని అంగీకరించిందని తెలిపారు. జర్నలిస్టు ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక అతనిపై దాడి చేయమేనా కాంగ్రెస్ ప్రజాస్వామ్యం..? అని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతూ రాహుల్ గాంధీ రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై కపటప్రేమ ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. దేశం పరువు తీయాలనే ఏకైక లక్ష్యంతోనే విదేశీ పర్యటనలు చేయడం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎమర్జెన్సీ సమయంలో పత్రికా స్వేచ్ఛ గొంతు నులిమి, అనేక పత్రికలను నిషేధించి, ఎడిటర్లను, విలేకరులను జైల్లో పెట్టించిన విషయాన్ని కిషన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో గుర్తు చేశారు. కాగా, రాష్ట్రంలోని దాదాపు 35 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పిలిచిన టెండర్లలో రూ.750 కోట్లకు పైగా కుంభకోణం జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బీజేపీ శాసనసభా పక్ష ఉపనేత పాయల్ శంకర్ ఆరోపించారు. పాలకుల అనుయాయులకు మాత్రమే టెండర్ దక్కేలా చేశారని విమర్శించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు కోరాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ మెప్పు కోసమే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ విమోచన వేడుకలకు దూరంగా ఉన్నారని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. ఈ నెల 17న సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహించే విమోచన ఉత్సవ ఏర్పాట్లను శనివారం లక్ష్మణ్ పరిశీలించారు.

750 దరఖాస్తులు.. 55 మంది సివిల్ సర్వెంట్లు

(మొదటిపేజీ తరువాయి)

అధికార వర్గాలు తెలిపాయి. సమాచార కమిషన్‌కు పూర్వ వైభవం తెస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పలుసార్లు ప్రకటించారు. ఎంపీ హోదాలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్టీఐ దరఖాస్తు చేసినా సమాచారం ఇవ్వలేదని, ఈ ప్రభుత్వంలో ఇలా ఉండదని చెప్పారు. దీంతో అధికార యంత్రాంగం ఈ దిశగా ప్రత్యేక దృష్టిసారించింది. సీఎస్ శాంతికుమారి నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల కమిటీ దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తోంది. కాగా, సహ చట్టం కమిషనర్ల ఎంపికలో సుప్రీంకోర్టు సూచనలు కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. కమిషనర్ల అర్హతలతో పాటు వారి అనుభవాన్ని తప్పనిసరిగా ప్రస్తావించాలి. అయితే, అనేక ఏళ్లపాటు ప్రభుత్వ సర్వీసులో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్‌లకు సమాచార కమిషన్‌లో అవకాశమిస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ప్రభుత్వం భావిస్తోంది. గత సర్కారు హయాంలోలా రాజకీయ పునరావాసంగా కాకుండా, ఎలాంటి పైరవీలకు తావివ్వకుండా.. సమర్థులు, చట్టం గురించి మంచి అవగాహన ఉన్నవారినే నియమించాలని నిర్ణయించినట్లు తెలిసింది. వీటిని సీఎస్ కమిటీ పరిగణనలోకి తీసుకుంటోంది. దరఖాస్తుదారుల్లో ఆర్టీఐ అమలుకు కృషి చేసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో పాటు ఆర్టీఐ నిపుణులు కూడా ఉన్నారు. వీరి వివరాలను నిఘా సంస్థలు ఇప్పటికే సేకరించాయని తెలిసింది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేతతో కూడిన త్రిసభ్య కమిటీ త్వరలో నియామకాలను ఖరారు చేయనుంది.

గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యం

పాలనలో పారదర్శకతను పెంచేందుకు 2005లో యూపీఏ ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని తెచ్చింది. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీఐని నీరుగార్చింది. మూడేళ్ల వరకు కమిషన్ సభ్యులనే నియమించలేదు. ఆర్టీఐ కార్యకర్తల ఆందోళన, హైకోర్టు ఆదేశాలతో 2017 సెప్టెంబరులో మొదటిసారి కమిషన్ వేసింది. అయితే, ప్రధాన సమాచార కమిషనర్‌గా అసెంబ్లీ మాజీ కార్యదర్శి రాజా సదారాంను నియమించడం వివాదాస్పదమైంది. ఆర్టీఐ అసెంబ్లీకి వర్తించదని అయన ప్రభుత్వంలో ఉన్నప్పుడు పేర్కొన్నారు. అలాంటి అధికారిని ప్రధాన సమాచార కమిషనర్‌గా నియమించడం సరికాదంటూ సహ కార్యకర్తలు తప్పుబట్టారు. అయినా, నాటి ప్రభుత్వం వెనక్కితగ్గలేదు. తర్వాత రెండుసార్లు కమిషనర్లను నియమించినా.. నిబంధనలను పక్కనబెట్టి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నవారినే ఎంపిక చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఇక ప్రధాన సమాచార కమిషనర్‌గా ఉన్న బుద్దా మురళి 2022 సెప్టెంబరులో పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. ఐదుగురు కమిషనర్లు కట్టా శేఖర్ రెడ్డి, గుగులోత్ శంకర్‌నాయక్, సయ్యద్ ఖలీలుల్లా, మైద నారాయణరెడ్డి, మొహమ్మద్ ఆమిర్‌ల పదవీకాలం 2023 ఫిబ్రవరితో ముగిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● ఆదివారం 15 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా



హైదరాబాద్, బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ) కోర్సులో ప్రవేశానికి వాక్ ఇన్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి.


అర్హత: అభ్యర్థులు డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు మించ కూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- **వాక్ ఇన్ అడ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 21
- **చిరునామా:** అడ్మిషన్ డెస్క్, రూమ్ నెంబరు 102, డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037
- **వెబ్‌సైట్:** citdindia.org

ఐఐటీ గాంధీనగర్‌లో పీహెచ్‌డీ

గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫుల్ టైం రెసిడెన్షియల్ రీసెర్చ్ (ఆర్ఆర్), కంటిన్యూయింగ్ డాక్టోరల్ ప్రోగ్రామ్ (సీడీపీ) కేటగిరీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. సీడీపీని పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్‌లు, విద్యాసంస్థల ఫ్యాకల్టీకి ఉద్దేశించారు. ఆర్ఆర్ అభ్యర్థులకు ఫెలోషిప్ సౌకర్యం ఉంది.



స్పెషలైజేషన్లు: బయోలాజికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కాగ్నిటివ్ అండ్ బ్రెయిన్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎర్త్ సైన్సెస్, ఎర్త్ సిస్టమ్స్ సైన్స్, ఆర్కియలాజికల్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, సొసైటీ అండ్ కల్చర్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: అభ్యర్థులు ఎంచుకొన్న స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ/ఎమ్మెస్సీ(బేసిక్ సైన్స్)/బీటెక్/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. ఐఐఎస్సీ, ఐసర్ సంస్థల నుంచి బీఎస్, బీఎస్-ఎంఎస్ కోర్సులు ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశించిన మేరకు నెట్/గేట్ అర్హత తప్పనిసరి.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. సంస్థ నిర్ణయం మేరకు రాత పరీక్ష, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

ఫెలోషిప్: నెట్/గేట్ అర్హత ఉన్నవారికి; ఐఐటీలు, ఐసర్లలో చదివినవారికి మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత నెలకు రూ.42,000ల ఫెలోషిప్ ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ల్లో రీసెర్చ్ వర్క్ ప్రజంట్ చేసేందుకు రూ.2 లక్షల వరకు ఫైనాన్షియల్ సపోర్ట్ అందిస్తారు. విదేశీ యూనివర్సిటీల్లో నాలుగు నుంచి ఆర్నెల్లు రీసెర్చ్ వర్క్ చేసేందుకు గాను 12,500 యూఎస్ డాలర్లు అందిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 17
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** అక్టోబరు 24 నుంచి 26 వరకు
- **రాత పరీక్ష, ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** నవంబరు 1 నుంచి 20 వరకు
- **వెబ్‌సైట్:** iitgn.ac.in/admissions/phd

అంబేద్కర్ యూనివర్సిటీలో
పీజీ డిప్లొమా

శ్రీకాకుళం(ఏపీ)లోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(డాబీఆర్ఏయూ)- పీజీ డిప్లొమా ఇన్ గాంధియాన్ సోషల్ వర్క్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కోర్సు వ్యవధి ఏడాది. ఇందులోనే ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. కోర్సులో బాగంగా క్యాంపస్ తరగతులు, ఫీల్డ్ వర్క్ ఉంటాయి. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సామాజిక, న్యాయ సంబంధిత రంగాల్లో పనిచేస్తున్న వారికి ఈ కోర్సు ఉపకరంగా ఉంటుంది. దీనిని పూర్తిచేసిన వారు ఎన్జీఓ సంస్థలు, మీడియా సంస్థలు, గ్రామీణాభివృద్ధి సంస్థలు, కౌన్సెలింగ్ సెంటర్లు, సామాజిక అధ్యయన కేంద్రాల్లో ఉపాధి పొందే వీలుంది.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **వెబ్‌సైట్:** www.drbrau.edu.in

మౌలానా ఆజాద్ వర్సిటీలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దు యూనివర్సిటీ(మనూ)- యూజీ రెగ్యులర్ ప్రోగ్రామ్‌లలో మిగిలిన మెరిట్ బేస్ట్ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. సీయూఈటీ, నాన్ సీయూఈటీ అభ్యర్థులు; గతంలో అప్లయ్ చేసుకొని అడ్మిషన్ దొరకని వారు కూడా ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్‌లు-క్యాంపస్‌లు-సీట్లు

- హైదరాబాద్ క్యాంపస్‌లో బీకామ్(ఆనర్స్/రీసెర్చ్) 22 సీట్లు, బీఏ(ఆనర్స్ రీసెర్చ్) 55 సీట్లు; బీఏ జేఎంసీ(ఆనర్స్/రీసెర్చ్) 24 సీట్లు; బీఎస్సీ(ఆనర్స్/రీసెర్చ్)లైఫ్ సైన్సెస్ 21 సీట్లు; బీఎస్సీ(ఆనర్స్/రీసెర్చ్)ఫిజికల్ సైన్సెస్ 56 సీట్లు; బీఓసీ(ఎమర్జెన్సీ అండ్ ట్రామా కేర్) 16 సీట్లు, బీఓసీ(మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ) 16 సీట్లు; బీఓసీ(మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ) 17 సీట్లు ఉన్నాయి.
- భోపాల్ క్యాంపస్‌లో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) 15 సీట్లు ఉన్నాయి.
- దర్భంగా క్యాంపస్‌లో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) 12 సీట్లు ఉన్నాయి.
- హైదరాబాద్ పలక్‌నుమా క్యాంపస్‌లో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) 13 సీట్లు ఉన్నాయి.
- లఖ్‌నవూ క్యాంపస్‌లో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) 16 సీట్లు ఉన్నాయి.
- వారణాసి క్యాంపస్‌లో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) 15 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **అడ్మిషన్ పోర్టల్‌లో దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిమిత్తం అభ్యర్థులు సంబంధిత క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సిన తేదీ:** సెప్టెంబరు 18
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** సెప్టెంబరు 20
- **అడ్మిషన్ ఫీజు చెల్లింపులు:** సెప్టెంబరు 21 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 23 నుంచి
- **వెబ్‌సైట్:** manuu.edu.in



మహిళలకు హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్



మంగళగిరి(ఏపీ)లోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం 'మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రెయినింగ్ కోర్సు'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. మహిళలు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేటు ఎంపీహెచ్‌డబ్ల్యు సంస్థల్లో శిక్షణ ఇస్తారు. కోర్సు వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఇంటర్మీడియెట్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏ గ్రూపు వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.


వయసు: డిసెంబరు 31 నాటికి 17 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక: మొత్తం సీట్లలో 60 శాతం 'ఫ్రీ సీట్లు' ఉన్నాయి. మిగిలినవి మేనేజ్‌మెంట్ సీట్లు. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అభ్యర్థుల అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఫ్రీ సీట్లు భర్తీ చేస్తారు. మేనేజ్‌మెంట్ సీట్లకు సంబంధించి అభ్యర్థులు ఎంచుకొన్న ప్రైవేటు శిక్షణ కేంద్రాల్లో దరఖాస్తు సమర్పించాలి. వీటిని సెలెక్షన్ కమిటీకి పంపుతారు. కమిటీ ఆమోదించిన అభ్యర్థులకు ప్రవేశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.50
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21
- **వెబ్‌సైట్:** cfw.ap.nic.in

ఐఐఎస్‌డబ్ల్యుబీఎంలో ఎంబీఏ



కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఐఐఎస్‌డబ్ల్యుబీఎం)- ఎంబీఏ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు: మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్ అండ్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్

ప్రోగ్రామ్ వివరాలు: ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో ఒక్కోదానిలో తొమ్మిది కంపల్సరీ పేపర్లు ఉంటాయి. మూడో సెమిస్టర్‌లో మూడు కంపల్సరీ పేపర్లు, మూడు స్పెషలైజేషన్ పేపర్లు ఉంటాయి. నాలుగో సెమిస్టర్‌లో రెండు కంపల్సరీ పేపర్లు, మూడు స్పెషలైజేషన్ పేపర్లు ఉంటాయి. రెండు, మూడు సెమిస్టర్ల మధ్య సమ్మర్ ప్రాజెక్ట్ ఉంటుంది. ప్రోగ్రామ్‌లో బాగంగా డిజర్టేషన్, వైవా ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో నాలుగేళ్ల బీఈ/బీటెక్; మెడికల్ సైన్స్ డిగ్రీ; ఎల్ఎల్‌బీ; ఆనర్స్ డిగ్రీ(ఆర్ట్స్/సైన్స్/కామర్స్)/డిగ్రీ(బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/కంప్యూటర్ అప్లికేషన్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు కూడా అర్హులే. క్యాట్ 2024 ఎగ్జామ్‌కు అప్లయ్ చేసి ఉండాలి.

ఎంపిక: క్యాట్ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** డిసెంబరు 20
- **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు:** 2025 మార్చిలో
- **కొరియర్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ఐఐఎస్‌డబ్ల్యుబీఎం, మేనేజ్‌మెంట్ హౌస్, కాలేజ్ స్క్వేర్ వెస్ట్, కోల్‌కతా-700073
- **వెబ్‌సైట్:** www.iiswbm.edu

రైల్వేలో గ్రాడ్యుయేట్ పోస్టులు

ఖాళీలు 8,113

భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) దేశ వ్యాప్తంగా అన్ని రైల్వే జోన్లలో నాన్-టెక్నికల్ పాపులర్ కేటగిరీ గ్రాడ్యుయేట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

పోస్టుల వివరాలు

1. కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్: **1,736 పోస్టులు**
2. స్టేషన్ మాస్టర్: **994 పోస్టులు**
3. గూడ్స్ రైలు మేనేజర్: **3,144 పోస్టులు**
4. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్: **1,507 పోస్టులు**
5. సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: **732 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 18 నుంచి 36 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ప్రారంభం వేతనం: నెలకు రూ.29,200 నుంచి రూ.35,400

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(టైర్-1, టైర్-2), స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ కేటగిరీ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎం, ఈబీసీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 13

వెబ్‌సైట్: www.rrbapply.gov.in/



జాబ్ కార్నర్

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్లు

ఖాళీలు 1,511

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్...రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

1. డిప్యూటీ మేనేజర్(సిస్టమ్స్)- ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అండ్ డెలివరీ: **187 పోస్టులు**
2. డిప్యూటీ మేనేజర్(సిస్టమ్స్)- ఇన్‌ఫ్రా సపోర్ట్ అండ్ క్లౌడ్ ఆపరేషన్స్: **412 పోస్టులు**
3. డిప్యూటీ మేనేజర్(సిస్టమ్స్)- నెట్‌వర్కింగ్ ఆపరేషన్స్: **80 పోస్టులు**
4. డిప్యూటీ మేనేజర్(సిస్టమ్స్)- ఐటీ ఆర్కిటెక్ట్: **27 పోస్టులు**
5. డిప్యూటీ మేనేజర్(సిస్టమ్స్)- ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ: **7 పోస్టులు**
6. అసిస్టెంట్ మేనేజర్(సిస్టమ్)- **798 పోస్టులు**

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంసీఏ, ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 జూన్ 30 నాటికి డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 25 నుంచి 35 ఏళ్లు; అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు డిప్యూటీ మేనేజర్లకు రూ.64,820 - రూ.93,960. అసిస్టెంట్ మేనేజర్లకు రూ.48,480 - రూ.85,920.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.750(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు చెల్లింపు మినహాయింపు ఉంటుంది).

పోస్టింగ్ స్థలం: నవీ ముంబయి/హైదరాబాద్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 4

వెబ్‌సైట్: https://sbi.co.in/


లిటిల్స్





క్యూఆర్ కోడ్ గ్రామం!

చైనాలో జిలిన్‌షూ అనే గ్రామం ఉంది. ప్రపంచంలో ఏ గ్రామానికి లేని ప్రత్యేకత జిలిన్‌షూకు ఉంది. ఈ గ్రామానికి చెందిన ప్రజలు- 1.30 లక్షల చెట్లతో ఒక క్యూఆర్ కోడ్‌ను సృష్టించారు. ఈ క్యూఆర్ కోడ్‌ను విమానం నుంచి స్కాన్ చేస్తే ఆ గ్రామానికి చెందిన టూరిజం వెబ్‌సైట్ వస్తుంది.

7 తేడాలను కనిపెట్టండి







సరైన నీడను గుర్తించండి





దారి కనుక్కోండి

డైలీ సుడోకు - 410

				9	8			1
			7			5	4	
	8		1					
	3			5			8	
	6	9	8		4	3	7	
	4			3			2	
					6		1	
	5	8			9			
9			4	8				

సుడోకు - 409 సమాధానం

5	8	6	9	2	3	4	7	1
9	4	1	8	7	6	5	3	2
7	2	3	5	4	1	6	9	8
2	6	4	7	1	8	9	5	3
1	3	5	6	9	4	2	8	7
8	7	9	3	5	2	1	4	6
3	9	8	2	6	5	7	1	4
6	1	7	4	8	9	3	2	5
4	5	2	1	3	7	8	6	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.